thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 295 కరీంనగర్ గురువారం, 1 జనవరి 2026 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## నీట్ పరీక్షలో డబ్బుదే కీలక పాత్ర: స్టాలిన్

చెన్నై : 'నీట్' పరీక్షలో ఆద్యంతం డబ్బు కీలక పాత్ర పోషిస్తోందని తమిళనాడు సీఎం స్టాలిన్ విమర్శించారు. 2025 యూజీ వైద్య కోర్సుల ప్రవేశాలకు నిర్వహించిన నీట్ పరీక్షలో అవినీతికి పాల్పడి, అర్హత లేని వారికి ప్రభుత్వ వైద్య కళాశాలల్లో సీటు ఇప్పిస్తామని నగదుతీసుకుని మోసగించారంటూ మహారాష్ట్రకు చెందిన జాతీయ పరీక్షా ఏజెన్సీ అధికారి, పలువురువైద్యులపై సీబీఐ కేసు నమోదుచేసిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంపై సీఎం స్టాలిన్ తన ఎక్స్‌లో స్పందిస్తూ... "నీట్ అనేది మెరిట్ గురించి కాదు, మార్కెట్ గురించి అని నిరూపించే మరో కేసు. అందుకే మేము 'నీట్' నీట్ కాదని గట్టిగా చెబుతున్నాము. నీట్ ప్రారంభం నుంచి చివరి వరకు డబ్బు మాత్రమే ప్రముఖ పాత్ర పోషిస్తుంది. నీట్ పరీక్షా వ్యవస్థ ఒక నైతిక కుంభకోణం" అని పోస్ట్ చేశారు.




## రెండు హైవే ప్రాజెక్టులకు కేంద్ర కేబినెట్ ఆమోదం

ఢిల్లీ: కేంద్ర క్యాబినెట్ ఇవాళ( బుధవారం, డిసెంబర్ 31) పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. రూ. 20, 668 కోట్ల రూపాయలతో రెండు హైవేల నిర్మాణానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. నాసిక్ సోలాపూర్ హై స్పీడ్ కారిడార్ నిర్మాణానికి మంత్రివర్గం ఆమోద ముద్ర వేసింది. 19,142 కోట్ల రూపాయలతో 374 కిలోమీటర్ల సూరత్ చెన్నై హై స్పీడ్ కారిడార్ నిర్మాణం జరగనుంది. చెన్నై సూరత్ హై కారిడా నిర్మాణంతో 45 శాతం ప్రయాణ సమయం తగ్గనుంది. 31 గంటల నుంచి 17 గంటల్లో గమ్యస్థానానికి చేరుకునే అవకాశం ఉంది. చెన్నై సూరత్ కారిడార్ నిర్మాణంలో భాగంగా కర్నూల్ కడప మీదుగా జాతీయ రహదారి వెళ్లనుంది. చెన్నై పోర్టు, హజీరా పోర్టుకు కనెక్టివిటీ పెరుగనుంది. కొప్పర్తి, ఓర్వకల్ పారిశ్రామిక ఇండస్ట్రియల్ కారిడార్లకు హై స్పీడ్ నెట్‌వర్క్ ఉపయోగపడనుంది. రెండేళ్లలో రోడ్డు నిర్మాణం పూర్తికానుంది. ఒడిశాలోని జాతీయ రహదారి 326 వెడల్పు, బలోపేతం కోసం రూ.1526 కోట్ల కేటాయింపునకు కేబినెట్ ఆమోదం తెలిపింది. కాగా, 2024 జూన్ నుంచి రైల్వే, హైవే, మెట్రో, వివిధ మౌలిక వసతుల ప్రాజెక్టులకు భారీ ఎత్తున నిధులను కేంద్ర ప్రభుత్వం కేటాయించింది. 12.6 లక్షల రూపాయల నిధులను కేబినెట్ కేటాయించింది. 43 రైల్వే ప్రాజెక్టుల కోసం 1,52,583 కోట్ల రూపాయలను కేటాయించింది. 24 జాతీయ రహదారుల నిర్మాణానికి 2, 18,312 కోట్ల రూపాయలు కేటాయించింది. 8 మెట్రో రైల్ ప్రాజెక్టుల నిర్మాణానికి రూ.1,31,542 కోట్లు, నాలుగు ఏర్పాట్లు నిర్మాణానికి 7339 కోట్లు, మేజర్ పోర్టు నిర్మాణానికి రూ.1,45,945 కోట్లు, రెండు కొత్త రోప్ వేల నిర్మాణానికి రూ.6811 కోట్లు, మూడు హైడ్రో ప్రాజెక్టుల నిర్మాణానికి రూ.28,432 కోట్లు, 12 పారిశ్రామిక స్మార్ట్ సిటీస్ ఏర్పాటుకు రూ.28, 602 కోట్లు, పీఎం ఆవాస్ యోజన కోసం 5,36,137 కోట్లను కేంద్రం కేటాయించింది. కేంద్ర కేబినెట్ మరో కీలక నిర?యం తీసుకుంది. వొడాఫోన్-ఐడియాకు ఉపశమనం కల్పించింది. రూ.87,695 కోట్ల ఏజీఆర్ బకాయిలు ఫ్రీజ్‌కు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది.



## కాంగ్రెస్ విధానాలతో నేత కార్మికులకు అన్యాయం

సిరిసిల్ల : కాంగ్రెస్ ప్రజా వ్యతిరేక విధానాలతో నేత కార్మికులకు అన్యాయం జరుగుతోందని మాజీ మంత్రి భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ మండిపడ్డారు. సిరిసిల్ల అపారెల్ పార్క్‌ను పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. అపారాల్ పార్క్‌లో మా హయాంలో వచ్చిన రెండు పరిశ్రమలు మినహా ఇప్పటి వరకు కొత్తగా ఒక్కటీ రాలేదు. 25 వేల మంది మహిళలకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో పార్క్ ఏర్పాటు చేశాం. సంక్రాంతి లోపు వర్కర్ టూ ఓనర్ పథకం లబ్ధిదారులను ప్రకటించాలి. లేదంటే 10 వేల మందితో నిరసన కార్యక్రమం చేస్తాం. మా ప్రభుత్వం ఉన్నప్పుడు కార్మికులను కంటికి రెప్పలా కాపాడుకున్నాం. రూ. 400 కోట్లతో అపారెల్ పార్క్ ఏర్పాటు చేసింది మేమే. ఈ ప్రభుత్వం ఏం చేయలేదు అని కేటీఆర్ అన్నారు. సిరిసిల్ల పట్టణ ఎస్సీ బాలుర హాస్టల్‌లో విద్యార్థులతో కలిసి కేటీఆర్ న్యూ ఇయర్ వేడుకల్లో పాల్గొని కేక్ కట్ చేశారు. అనంతరం విద్యార్థుల కు బ్యాగులు పంపిణీ చేశారు. అంతకు ముందు జూనియర్ కళాశాల మైదానంలో జరిగిన క్రికెట్ పోటీల విజేతల కు బహుమతులు అందజేశారు







## ప్రభుత్వ ఉద్యోగులకు గుడ్‌న్యూస్.. నిధులు విడుదల

హైదరాబాద్ : ప్రభుత్వ ఉద్యోగులకు తెలంగాణ ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. ప్రభుత్వ ఉద్యోగుల పెండింగ్ బిల్లుల కోసం 713 కోట్ల రూపాయలు విడుదల చేసింది. డిసెంబర్ మాసానికి సంబంధించిన బిల్లుల విడుదలకు డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క ఆదేశాలు ఇచ్చారు. ఈ నేపథ్యంలోనే ఆర్థిక శాఖ ద్వారా బుధవారం 713 కోట్ల రూపాయల బిల్లులు విడుదల అయ్యాయి. ఉద్యోగ సంఘాలకు ప్రతినెల 700 కోట్ల రూపాయలు విడుదల చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. జూన్ నెలాఖరులో183 కోట్ల రూపాయలు విడుదల చేసింది. ఆగస్టు నుంచి ప్రతినెల కనీసం 700 కోట్ల రూపాయల చొప్పున విడుదల చేస్తోంది. విడుదలైన బిల్లుల్లో గ్రాట్యూటీ, జీపీఎఫ్, సరెండర్ లీవ్, అడ్వాన్స్‌లు ఉన్నాయి.




# సీఎం రేవంత్ సూపర్ సక్సెస్!

## అమాంతం పెరిగిన గ్రాఫ్!

## 2025లో కీలక ఘట్టాలు

హైదరాబాద్ : తెలంగాణ ముఖ్యమంత్రిగా.. బాధ్యతలు చేపట్టిన రేవంత్ రెడ్డి.. ఈ ఏడాది కీలక ఘట్టాలతో తన గ్రాఫ్‌ను పెంచుకున్నారు. ముఖ్యంగా నాలుగు అంశాల్లో ఆయన వెరువకుండా దూకుడు ప్రదర్శించారు. ఇది ఆయనకు విజయాలను దూసుకువచ్చింది. బలమైన ముఖ్యమంత్రిగా ప్రజల్లో గ్రాఫ్ పెంచేలా కూడా చేసింది. 1) హైడ్రా: మూసీ పరివాహక ప్రాంతాన్ని అభివృద్ధి చేయడం సంకల్పంగా పెట్టుకున్న ముఖ్యమంత్రి హైడ్రాను దూకుడుగా ముందుకు తీసుకువెళ్లారు. ఎన్ని విమర్శలు వచ్చినా.. కోర్టుల నుంచి ఆక్షేపణలు వచ్చినా.. ఒకానొక దశలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ కోర్టు మెట్లు ఎక్కాల్సి వచ్చినా.. వెనక్కి తగ్గలేదు. ఈ క్రమంలో మూసీ పరివాహక అభివృద్ధికి కట్టుబడిన తీరును స్పష్టం చేసింది. 2) ఫ్యూచర్ సిటీ, పెట్టుబడులు: ఈ ఏడాది ఈ రెండు విషయాల్లోనూ సీఎం రేవంత్ రెడ్డి పక్కా ప్లాన్‌తో వ్యవహరించారు. ఫ్యూచర్ సిటీ వంటి మహానగరానికి ప్రాధాన్యం ఇచ్చారు. అదేసమయంలో ఫార్మా సహా సెమీకండెక్టర్ ప్రాజక్టులకు పెద్దపీటవేశారు. అదేవిధంగా 2047 నాటికి రైజింగ్ తెలంగాణ పేరుతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలన్న సంకల్పం పెట్టుకున్నారు. ఇటీవల కూడా పెట్టుబడుల సదస్సును నిర్వహించారు. వీటితో పాటు.. హైదరాబాద్ నగరం గురించి.. ప్రపంచ దేశాలకు తెలిసేలా..ప్రపంచ సుందరుల పోటీకి ఆతిథ్యం ఇచ్చారు. అలానే.. నగరాన్ని విస్తరించడం.. జోన్లుగా వర్గీకరించడం ద్వారా అభివృద్ధికి పెద్దపీట వేశారు. 3) కులగణన: రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి సర్కారు చేపట్టిన కుల గణన ఈ ఏడాది పెద్ద సంచలనమేనని చెప్పాలి. రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత.. తొలిసారి.. కులగణనను చేపట్టడం ద్వారా బీసీల సంఖ్యను తేల్చారు. తెలంగాణ సమాజంలో 43 శాతం మంది బీసీలు ఉన్నారని గుర్తించిన సీఎం రేవంత్ రెడ్డి.. వారికి 43 శాతం రిజర్వేషన్ కల్పించాలని నిర్ణయించారు. పంచాయతీ ఎన్నికల నుంచే దీనిని అమలు చేయాలని భావించినా.. రాష్ట్రపతి, గవర్నర్ ల నుంచి ఈబిల్లుకు ఆమోదం పొందలేదు. అయితే.. రాజకీయంగా మాత్రం అన్ని పార్టీలను ఒకే తాటిపైకి తీసుకురావడంలో రేవంత్ రెడ్డి సక్సెస్ అయ్యారు. 4) విజయాలు: ఈ ఏడాది జరిగిన రెండు కీలక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని విజయ తీరాల దిశగా నడిపించారు.

జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నికలో విజయంతోపాటు.. ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో 8 వేల మంది సర్పంచులను గెలిపించుకోవడం ద్వారా తన హవాకు తిరుగులేదన్న వాదనను రేవంత్ రెడ్డి నిరూపించుకున్నారు. ఇక, పార్టీలో చిన్నపాటి విభేదాలు.. మంత్రుల మధ్య చికాకులు వచ్చినా.. వాటిని పెద్దవి కాకుండా.. హెచ్చరించారు. ఎవరినీ నొప్పించకుండా.. ఇంటా బయటా.. సీఎంగా రేవంత్ మంచి మార్కులు వేసుకున్నారు.




# మూడో పక్షం జోక్యం లేదు..

## అది నిజం కాదు.. చైనాకు అంత సీన్ లేదు!

## ఇండోపాక్ ఉద్రిక్తతలపై చైనా ప్రకటనను తిరస్కరించిన భారత్!!

ఇండియా, పాకిస్థాన్ మధ్య ఆపరేషన్ సిందూర్ సమయంలో ఉద్రిక్తతలు నెలకొన్న విషయం తెలిసిందే. అయితే ఇండోపాక్ మధ్య శాంతి నెలకొల్పేందుకు తాము మధ్యవర్తిత్వం వహించినట్లు చైనా ప్రకటించింది. చైనా వ్యాఖ్యలను భారత్ తీవ్రంగా ఖండించింది. పాక్‌తో కాల్పుల విరమణలో మూడో పక్షం జోక్యం లేదని స్పష్టం చేసింది. ఆపరేషన్ సిందూర్ తర్వాత మే 10న జరిగిన కాల్పుల విరమణ.. రెండు దేశాల డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ మధ్య ప్రత్యక్ష చర్చల ద్వారా కుదిరిందని వెల్లడించింది. 'మేము ఇప్పటికే అలాంటి వాదనలను తోసిపుచ్చాము. భారత్-పాక్ మధ్య సమస్యల పరిష్కారానికి మూడో పక్షం ప్రమేయం లేదు. రెండు దేశాల డీజీఎమ్‌వోలు నేరుగా సంప్రదింపులు జరిపి కాల్పుల విమరణ ఒప్పందాన్ని అంగీకరించారు. ఈ విషయంపై గతంలో అనేక సందర్భాల్లో మా వైఖరిని స్పష్టం చేశాము' అని ప్రభుత్వం స్పష్టం చేసింది. పెహల్గామ్ ఉగ్రదాడి ఘటన తర్వాత పాకిస్థాన్‌పై భారత్ సైనిక చర్య చేపట్టింది. అయితే రెండు దేశాల డీజీఎంవోల చర్చల తర్వాతే ఆపరేషన్ సిందూర్‌ను నిలిపివేసినట్లు భారత్ పేర్కొన్నది. కానీ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మాత్రం ఇరు దేశాల మధ్య సంధికి తానే కీలక పాత్ర పోషించినట్లు చెప్పుకుంటున్నారు. సుంకాల బెదిరింపులతో రెండు దేశాలు దిగొచ్చాయని ప్రపంచ వ్యాప్తంగా చాటింపు వేసుకుంటున్నారు. అయితే, ట్రంప్ ప్రకటనలను భారత్ ఎప్పటికప్పుడు ఖండిస్తూ వచ్చింది. పాక్‌తో జరిగిన సమరంలో మూడవ దేశ పాత్ర లేదని చెప్పింది. అయితే, ఇప్పుడు ట్రంప్ తరహాలోనే ఇండోపాక్ మధ్య శాంతిని నెలకొల్పడంలో తాము కూడా పాత్ర పోషించినట్లు ఇప్పుడు చైనా చెప్పడం గమనార్హం. ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న సంక్షోభాలను పరిష్కరించేందుకు శాంతిదూత పాత్రను చైనా పోషించినట్లు ఆ దేశ విదేశాంగ మంత్రి వాంగ్ యి పేర్కొన్నారు. ఇండోపాక్ యుద్ధమే కాదు మయన్మార్, కంబోడియా-థాయ్‌ల్యాండ్, ఇరాన్ న్యూక్లియర్ సమస్యను కూడా పరిష్కరించినట్లు చైనా మంత్రి చెప్పారు. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఈ ఏడాది ఎక్కువ సంఖ్యలో యుద్ధాలు, సీమాంతర దాడులు జరిగాయన్నారు. రాజకీయ అనిశ్చితి పెరిగిందన్నారు. శాంతి స్థాపన చేయాలన్న నిర్ణయాన్ని తీసుకున్నామని, దీని కోసం ఆ సమస్యల మూలాలను తెలుసుకుని పరిష్కరించే ప్రయత్నం చేశామన్నారు. బీజింగ్‌లో జరిగిన ఇంటర్నేషనల్ సిచ్యువేషన్ అండ్ చైనా ఫారిన్ రిలేషన్స్ సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఆయన వ్యాఖ్యలకు భారత్ తాజాగా కౌంటర్ ఇచ్చింది.




## భారీ ఉగ్రకుట్ర భగ్నం.. 150 కేజీల అమ్మోనియం నైట్రేట్ స్వాధీనం

రాజస్థాన్‌లో ఉగ్రవాదులు భారీ ఉగ్రకుట్రకు పన్నాగం పన్నారు. పెద్ద స్థాయిలో బాంబు పేలుళ్లకు ప్లాన్ చేశారు. అయితే, పోలీసులు అప్రమత్తం అవ్వటంతో ఉగ్రకుట్ర భగ్నం అయింది. టోంకోలో ఓ మారుతీ కారులో తరలిస్తున్న 150 కేజీల అమ్మోనియం నైట్రేట్‌ను పోలీసులు సీజ్ చేశారు. నిందితులు ఎంతో తెలివిగా ఎవ్వరికీ అనుమానం రాకుండా ఉండేందుకు యూరియా బస్తాల్లో అమ్మోనియం నైట్రేట్‌ను తరలించడానికి ప్రయత్నించారు. అమ్మోనియం నైట్రేట్‌తో పాటు 200 దాకా ఎక్స్‌ప్లోజివ్ బ్యాటరీలు, 1100 మీటర్ల పొడువైన వైర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు అనుమానితులను అరెస్ట్ చేశారు.

వారిని సురేంద్ర, సురేంద్ర మోచీగా గుర్తించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.




తెలంగాణ ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత డిమాండ్ చేశారు. ఉద్యమకారులకు సంక్షేమ బోర్డు, పింఛను, 250 గజాల స్థలం ఇస్తామని హామీలు ఇచ్చి నిలబెట్టుకోలేకపోయారని విమర్శించారు. కరీంనగర్ జిల్లా మానకొండూరు మండలంలో ఆమె నిరసన ప్రదర్శన చేపట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమకారులకు నివాస స్థలాలు ఇచ్చేవరకు తమ పోరాటం ఆగదని కవిత తెలిపారు.




## ఐ బొమ్మ రవి కస్టడీ రిపోర్ట్‌లో కీలక అంశాలు

హైదరాబాద్, డిసెంబర్ 31: ఐబొమ్మ రవి కస్టడీ రిపోర్టును పోలీసులు బుధవారం కోర్టుకు సమర్పించారు. అందులో కీలక అంశాలు వెలుగులోకి వచ్చాయి. రెండు రకాలుగా సినిమా ప్రింట్‌ను రవి కొనుగోలు చేశారు. నార్మల్ ప్రింట్‌కు 100 డాలర్లు, హెచ్‌డీ ప్రింట్‌కు 200 డాలర్లు చెల్లించాడు. అతడికి సంబంధించిన ఏడు ఖాతాలను పోలీసులు గుర్తించారు. వాటిలో రూ.13.40 కోట్ల నగదు ఉన్నట్లు పోలీసులు కనుగొన్నారు. బెట్టింగ్ యాడ్‌ల ద్వారా రూ.1.78 కోట్లు కూడబెట్టినట్లు గుర్తించారు. ఇక ఐబొమ్మ రవి సోదరి చంద్రికకు రూ. 90 లక్షల నగదు పంపినట్లు పోలీసులు అతడి ద్వారా తెలుసుకున్నారు. అయితే ఈ నగదు లావాదేవీలన్నీ ఐబొమ్మ రవి డాలర్ల రూపంలోనే చేసినట్లు గుర్తించారు. ఇక రాకేష్ అనే వ్యక్తి ద్వారా ట్రేడ్ మార్క్ లైసెన్స్, బెట్టింగ్, పైరసీ ద్వారా వచ్చిన నగదుతో రవి జల్సాలు చేసినట్లు పోలీసులు కనుగొన్నారు. హైదరాబాద్ కూకట్‌పల్లిలోనే రవి ఆఫీస్ నడిపినట్లు కస్టడీ రిపోర్టులో పోలీసులు స్పష్టం చేశారు. దాదాపు 12 రోజుల కస్టడీ అనంతరం మంగళవారం అతడిని జైలుకు పోలీసులు తరలించారు. ఈ కస్టడీలో ఐ బొమ్మ రవి కీలక అంశాలు వెల్లడించారు. వాటిని తమ కస్టడీ రిపోర్టులో పొందుపరిచిన అంశాలను కోర్టుకు పోలీసులు అందజేశారు. ఈ మొత్తంలో దాదాపు రూ. 10 కోట్లు విలాసవంతంగా గడపడానికి ఖర్చు చేశాడు. హైఫై పబ్‌లు, ఫైవ్ స్టార్ హోటళ్లలోనే బస చేయడం ద్వారా లగ్జరీ లైఫ్ ఎంజాయి చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడించారు. ప్రస్తుతం రవి అకౌంట్‌లో రూ. 3 కోట్ల నగదును పోలీసులు ఫ్రీజ్ చేసిన సంగతి తెలిసిందే.

## రూ.3వేల కోట్ల ఆస్తి పన్ను వసూలే లక్ష్యం: జీహెచ్ఎంసీ కమిషనర్

హైదరాబాద్: పరిశుభ్రతలో హైదరాబాద్ మహానగరాన్ని అగ్ర స్థానంలో నిలపడమే లక్ష్యంగా 2026లో పనిచేయనున్నట్లు జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర?న్ తెలిపారు. 2025 స్వచ్ఛ సర్వేక్షణ్‌లో జాతీయ స్థాయిలో జీహెచ్ఎంసీ ఆరో ర్యాంకు సాధించిందన్నారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ 650 చదరపు కిలోమీటర్ల నుంచి దాదాపు 2 వేల కిలోమీటర్ల వరకు పరిధి విస్తరించిన క్రమంలో 300 వార్డుల నుంచి రోజుకు 9 వేల మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోందన్నారు. చెత్త నిర్వహణకు కొత్త డంపింగ్ యార్డుల కోసం భూసేకరణ చేస్తున్నట్లు తెలిపారు. సీఎం ఆదేశాల మేరకు పారిశుద్ధ్యంపై 300 వార్డుల్లో నిరంతరం ప్రత్యేక డ్రైవ్ కొనసాగిస్తామని వివరించారు. గ్రేటర్‌లో పారిశుద్ధ్యం సహా వివిధ అభివృద్ధి పనులు, పరిపాలన అంశాలపై సమగ్ర వివరాలు వెల్లడించిన ఆర్వీ కర?న్.... వచ్చే ఆర్థిక సంవత్సరానికి రూ.3వేల కోట్ల ఆస్తి పన్ను వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. జీఐఎస్ సర్వే ద్వారా 14 లక్షల ప్రాపర్టీలను సర్వే చేసినట్లు పేర్కొన్నారు. అందులో లక్ష మంది.. కట్టాల్సిన ఆస్తి పన్ను కంటే తక్కువగా చెల్లిస్తున్నట్టు గుర్తించామన్నారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండానే నగర పౌరులు తమ ఆస్తి పన్ను నేరుగా జీహెచ్ఎంసీ వెబ్ సైట్, యాప్ ద్వారా చెల్లించవచ్చని సూచించారు. నగరంలో రవాణా సదుపాయం మరింత మెరుగుపర్చేందుకు పెండింగ్ లో ఉన్న ఫ్లైఓవర్లను ఏప్రిల్ నాటికి పూర్తి చేస్తామని, హెచ్ సీటీ ప్రాజెక్టు కింద చేపట్టిన 32 ప్రాజెక్టులకు త్వరలోనే ప్రారంభిస్తామని ఆర్వీ కరన్ ప్రకటించారు.







హైదరాబాద్, డిసెంబర్ 31: యూట్యూబర్ అన్వేష్‌పై కేసు నమోదు అయ్యింది. దేవీ దేవతలను దూషించారంటూ అన్వేష్‌పై సినీనటి, బీజేపీ నాయకురాలు కరాటే కళ్యాణి పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కళ్యాణి ఫిర్యాదు మేరకు అన్వేష్‌పై బీఎన్ఎస్ సెక్షన్ 352,79,299, ఐటీ చట్టంలోని 67 సెక్షన్ కింది పోలీసులు కేసు నమోదు చేశారు. త్వరలో అన్వేష్‌కు పంజాగుట్ట పోలీసులు నోటీసులు జారీ చేయనున్నారు. అన్వేష్ వివాదాస్పద కామెంట్స్‌పై తెలంగాణలో వరస ఫిర్యాదులు చేస్తున్నారు. ఇక అన్వేష్‌ను దేశ ద్రోహిగా ప్రకటించాలని, అతడిని భారత్‌కు రప్పించాలని హిందూ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

ఇటీవల హిందూ దేవతలపై యూట్యూబర్ అన్వేష్ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. హీరోయిన్ల వస్త్రధారణపై నటుడు శివాజీ చేసిన కామెంట్స్‌ను తప్పుబడుతూ అన్వేష్ ఓ వీడియో చేశారు. అయితే ఆ వీడియోలో హిందూ దేవతలను కించపరిచే విధంగా మాట్లాడటం సంచలనంగా మారింది. హిందువులు దేవతగా కొలిచే సీతమ్మ వారిపై, అలాగే ద్రౌపది దేవి గురించి అన్వేష్ అసభ్యకరమైన రీతిలో మాట్లాడారు. దీంతో దేవతల పట్ల అన్వేష్ తీరుపై హిం దూ సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. యూట్యూబర్ కామెంట్స్‌కు నిరసనగా తెలుగు రాష్ట్రాల్లో అన్వేష్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు.




హైదరాబాద్: న్యూ ఇయర్ వేడుకల నేపథ్యంలో మందుబాబులకు హైదరాబాద్ సీపీ సజ్జనార్ హెచ్చరికలు జారీ చేశారు. మద్యం తాగి వాహనాలతో రోడ్ల పైకి వస్తే ఉపేక్షించేది లేదన్నారు. నగరంలోని 120 ప్రాంతాల్లో ఇవాళ రాత్రి ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపడతామని చెప్పారు.

మద్యం తాగి పట్టుబడితే భారీ జరిమానాతో పాటు వాహనాలను జప్తు చేస్తామన్నారు. జైలు శిక్ష, డ్రైవింగ్ లైసెన్స్ రద్దు తదితర చర్యలు చేపడతామని పేర్కొన్నారు. ర్యాష్ డ్రైవింగ్, బహిరంగ ప్రదేశాల్లో న్యూసెన్స్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు.

**ఫ్లైఓవర్ల మూసివేత.. భారీ వాహనాలపై నిషేధం...** న్యూఇయర్ వే డుకల నేపథ్యంలో నగరంలో పోలీసులు ఆంక్షలు విధించారు. ఫ్లైఓవర్లు మూసివేయనున్నారు. భారీ వాహనాల ప్రవేశంపై రాత్రి నుంచి నిషేధం అమలు చేయనున్నారు. ట్యాంక్‌బండ్, నెక్లెస్‌రోడ్‌లో వాహనాలకు అనుమతి లేదని పోలీసులు తెలిపారు. ఈవెంట్స్ జరిగే ప్రాంతాల్లోనూ ట్రాఫిక్ ఆంక్షలు అమలు కానున్నాయి. ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించుకోవాలని పోలీసులు సూచించారు. హైదరాబాద్, సైబరా బాద్, రాచకొండ కమిషనరేట్ల పరిధిలో అర్ధరాత్రి ఆకస్మిక తనిఖీలు చేపట్టనున్నారు. మహిళల భద్రతకు షీటీమ్స్ విధుల్లో ఉండనున్నాయి.





## దుబాయ్‌లో హాదీ హత్య కేసు నిందితుడు.. వీడియో విడుదల..!

విద్యార్థి నేత హాదీ హత్య కేసులో ఫైసల్ కరీమ్ మసూద్, ఆలంగీర్ షేక్‌లను బంగ్లాదేశ్ పోలీసులు అనుమానితులుగా గుర్తించిన సంగతి తెలిసిందే. తాజాగా ఫైసల్ దుబాయ్‌లో ఉన్నట్లు వెల్లడైంది. ఈ హత్యతో తనకు ఎలాంటి సంబంధం లేదంటూ అతడు ఓ వీడియోను విడుదల చేశాడు. వీడియోలో ఫైసల్ మాట్లాడుతూ.. తనను కావాలనే ఈ కేసులో ఇరికించారని ఆరోపించాడు. దీని నుంచి తనని తాను రక్షించుకునేందుకు దుబాయ్‌కు వెళ్లిపోయినట్లు తెలిపాడు. జమాతే ఇస్లామీ పార్టీ విద్యార్థి విభాగానికి చెందిన వ్యక్తులకు ఇందులో ప్రమేయం ఉందని ఆరోపించాడు. ఈ సందర్భంగా హాదీతో తనకు వ్యాపార సంబంధాలు మాత్రమే ఉన్నాయని తెలిపాడు. ప్రభుత్వ కాంట్రాక్ట్‌లు దక్కించుకోవడం కోసం హాదీ రాజకీయ కార్యకలాపాలకు తాను విరాళాలు ఇచ్చినట్లు పేర్కొన్నాడు. డిసెంబరు 12న హాదీపై దాడి తర్వాత అనుమానితులు దేశం విడిచి పారిపోయారని బంగ్లాదేశ్ పోలీసులు పేర్కొన్న సంగతి తెలిసిందే. వాళ్లు ప్రస్తుతం భారత్‌లో ఉన్నారంటూ ఇటీవల ఢాకా మెట్రోపాలిటన్ పోలీసులు పేర్కొన్నారు. అయితే, వీటిని భారత భద్రతాధికారులు ఖండించారు. అంతర్జాతీయ సరిహద్దు దాటి ఎవరూ భారత్‌లోకి వచ్చినట్లు ఆధారాలు లేవని బీఎస్ఎఫ్ అధికారులు, మేఘాలయ పోలీసులు స్పష్టం చేశారు. ప్రజలను తప్పుదారి పట్టించేందుకు పొరుగుదేశం ఇలాంటి నిరాధారమైన ఆరోపణలు చేస్తోందని మండిపడ్డారు. ఇక, ఈ కేసు విచారణను ఢాకా పోలీసులు వేగవంతం చేశారు. ఈ హత్యకు సంబంధించి అనేక మంది అనుమానితులను అరెస్టు చేస్తున్నారు. నిందితులు పారిపోయేందుకు సాయం చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇద్దరిని రిమాండ్‌కు తరలించారు.

## కీలక మైలురాయిని చేరిన యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ

హైదరాబాద్: యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ కీలక మైలురాయిని చేరింది. స్కిల్స్ యూనివర్సిటీలో శిక్షణ పొందిన విద్యార్థుల సంఖ్య వెయ్యికి చేరింది. ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు ఉద్యోగాలకు సరిపోయే నైపుణ్యం అందించే లక్ష్యంతో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీకి గతేడాది ఆగస్టు 1న శంకుస్థాపన జరిగింది. పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్య విధానంలో యూనివర్సిటీ నిర్వహిస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఛాన్సలర్‌గా, విశ్రాంత ఐఏఎస్ అధికారి సుబ్బారావు వీసీగా ఉండగా.. ప్రముఖ పారిశ్రామికవేత్తలతో కూడిన బోర్డ్ ఆఫ్ మేనేజ్‌మెంట్ యూనివర్సిటీని పర్యవేక్షిస్తోంది. బోర్డుకు పారిశ్రామిక దిగ్గజం ఆనంద్ మహీంద్రా ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం గచ్చిబౌలిలోని ట్రిపుల్ ఐటీలో నిర్వహిస్తున్న తాత్కాలిక క్యాంపస్‌లో లాజిస్టిక్స్, హెల్త్‌కేర్, లైఫ్ సైన్సెస్, ఫార్మా, బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ వంటి రంగాల్లో స్వల్పకాలిక, సర్టిఫికేషన్ కోర్సుల ద్వారా శిక్షణ ఇస్తున్నారు. మైక్రోసాఫ్ట్, రెడ్డీస్ ల్యాబ్స్, ఏఐజీ, అపోలో ఆసుపత్రులు, జీఎంఆర్ కార్గో వంటి ప్రముఖ సంస్థలు యూనివర్సిటీతో భాగస్వామ్యమయ్యాయి.

## బ్రిటీషు ఇండియాలో భారత ప్రామాణిక కాలమానం అమలు




1906, జనవరి 1 నుండి భారతదేశంలో ఏకైక ప్రామాణిక సమయం అమలు కావడం ప్రారంభం అయింది. భారత దేశంలో అమలులో ఉన్న భిన్నాంశ కాలమానాన్ని ఖగోళకారుడు జాన్ గోల్డింగ్‌హామ్ స్థాపించాడని భావిస్తారు. భారత ప్రామాణిక కాలమానం భారతదేశ మంతటా పాటించే సమయం. ఇది గ్రీన్‌విచ్ సమయానికి ఐదున్నర గంటలు ముందు ఉంటుంది. బ్రిటీషు నావికుడు-ఖగోళకారుడు మైఖెల్ టాపింగ్ కృషి ఫలితంగా 1792లో, బ్రిటీషు ఈస్టిండియా కంపెనీ అప్పటి మద్రాసులో మద్రాసు అబ్జర్వేటరీని ప్రారంభిం చింది. 1802లో భారత దేశంలో ఈస్టిండియా కంపెనీ అధికారిక ఖగోళ కారునిగా నియమితుడైన జాన్ గోల్డింగ్‌హామ్, గ్రీన్‌విచ్ ప్రామాణిక సమయానికి ఐదున్నర గంటలు ముందున్న మద్రాసు రేఖాంశం (13ళీ5ః24?% చీ 80ళీ18ః30?జు? / ?13.09000ళీచీ 80.30833ళీజు%) ను స్థానిక ప్రామాణిక సమయంగా స్థిర పరిచాడు. దీనితో ప్రస్తుతము ఉపయోగిస్తున్న ప్రమాణిక సమయానికి అది ప్రాతిపదిక అయింది. అప్పటి వరకు ప్రామాణికంగా ఉపయోగిస్తున్న సమయంలో రోజు సూర్యోదయంతో ప్రారంభ మయ్యేది. అయితే కొత్త పద్ధతిలో రోజు అర్ధరాత్రి ప్రారంభ మవుతుంది. బొంబాయి నౌకాశ్రయములో నౌకా కార్యకలపాలకు సమయ పాలనా మద్దతును 1862లో స్థాపించబడిన కొలాబా అబ్జర్వేటరీ అందించేది. చరిత్రలో మొట్టమొదటగా ప్రామాణిక సమయం వివరణ భారతదేశంలో 4వ శతాబ్దపు భారతీయ ఖగోళశాస్త్ర ఆధారిత సూర్య సిద్ధాంతంలో ఇవ్వబడింది. దీనిలో భూమి గుండ్రంగా ఉందని ప్రతిపాదిస్తూ, ప్రైమ్ మెరీడియన్ లేదా "జీరో డిగ్రీల రేఖాంశం" అవంతీ నగరం ( ఉజ్జయినికి (23ళీ10ః58?%చీ 75ళీ46ః38?జు? / ?23.18278ళీచీ 75.77722ళీజు%), పూర్వపు పేరు) , రోహితక ( కురుక్షేత్ర యుద్ధభూమి దగ్గరలోని నగరం రోహ్‌తక్) (28ళీ54ః%చీ 76ళీ38ఃజు? / ?28.900ళీచీ 76.633ళీజు%) గుండా వెళుతుందని నిర్వచించ బడింది. రోహితక, అవంతి నగరాలు (భూమధ్యరేఖ, 76ళీ తూ) , దేవతల ఆవాసమైన కైలాస పర్వతం (ఉత్తర ధృవం) గుండా వెళుతున్న సరళ రేఖపై ఉన్నాయి.సాధారణ ఉపయోగములో ఉన్న సమయమే గణించగల సమయము. ప్రాణంతో (ఒక శ్వాసకు పట్టే సమయం) ప్రారంభమై, ఆరు ప్రాణాలు ఒక విఘటిక లేదా పలం, 60 విఘటికలు ఒక ఘటిక, 60 ఘటికలు ఒక నక్షత్ర అహొరాత్రి, లేదా ఒక ఖగోళ దినంగా గణిస్తారు. ఒక నక్షత్ర మాసం లేదా ఖగోళ మాసంలో 30 అహొరాత్రులు లేదా రోజులు ఉంటాయి. ఒక రోజుకు 24 గంటలుగా పరిగణిస్తే, ఈ కాలమానంలోని అత్యంత చిన్న కొలత, ప్రాణం, లేదా ఒక ఉచ్ఛ్వాసనిశ్వాసం నాలుగు సెకన్లకు సమాన మవుతుంది. ఇది ఆధునిక వైద్యశాస్త్ర పరిశోధనలు సాధారణ ఉచ్ఛ్వాసనిశ్వాస పౌనపున్యంగా భావించే నిమిషానికి 15 శ్వాసలకు సరిపోతుంది. సూర్య సిద్ధాంతం, స్థానిక సమయము నుండి ఉజ్జయినీ ప్రామాణిక సమయాన్ని గణించే పద్ధతిని కూడా వివరించింది. భారతీయ కాలమానం చాలా ముందే ఈ ప్రగతిని సాధించినప్పటికీ, ప్రామాణిక సమయం, ఖగోళ శాస్త్రంలో తప్ప వేరెక్కడా విరివిగా ఉపయోగించ బడలేదు. భారతదేశాన్ని పరిపాలించిన రాజులు, తమ సామ్రాజ్యాలలో, చాలా వరకు భారతీయ పంచాంగం సహాయముతో గణించిన స్థానిక సమయాన్నే పాటించారు.పూర్వపు భారతీయ ఖగోళ శాస్త్రజ్ఞులు ఉపయోగించే రోజు ఉజ్జయిని లోని ప్రైమ్ మెరీడియన్ వద్ద సూర్యుడు ఉదయించ డముతో ప్రారంభ మవుతుంది. అలా ప్రారంభ మయిన రోజు చిన్న చిన్న సమయ ఖండాలుగా విభజించ బడినది. 1884లో, వాషింగ్టన్, డి.సిలో జరిగిన అంతర్జాతీయ వెరిడియన్ సమావేశం ప్రపంచమంతటా ప్రామాణిక కాలమండలాలను వ్యవస్థీకరించింది. ఆ సమావేశంలో భారతదేశంలో రెండు కాల మండలాలు ఉండాలని నిర్ణయిం చింది. కలకత్తా తూర్పు 90 డిగ్రీల రేఖాంశంను, బొంబాయి తూర్పు 75డిగ్రీల రేఖాంశం ఉపయోగించేది. కలకత్తా సమయం గ్రీన్విచ్ కంటే 5 గంటల 30 నిమిషాల 21 సెకన్లు, బొంబాయి సమయం గ్రీన్విచ్ కంటే 4 గంటల 51 నిమిషాలు ముందు ఉండేట్టు నిర్ణయమైంది. 1880ల చివరికల్లా, చాలామటుకు రైల్వే కంపెనీలు రెండు కాలమండలాలకు మధ్యేమార్గంగా రైల్వే సమయంగా పేరొందిన మద్రాసు సమయంను ఉపయోగించడం ప్రారంభించాయి. అండమాన్ నికోబార్ దీవులు రాజధాని అయిన పోర్ట్ బ్లెయిర్ లో పోర్ట్ బ్లెయిర్ మీన్ టైం అనే మరొక ప్రత్యేక కాలమండలం స్థాపించ బడింది. పోర్ట్ బ్లెయిర్ సమయం, మద్రాసు సమయం కంటే 49 నిమిషాల 51 సెకన్లు ముందు ఉండేది. భారత ప్రామాణిక కాలమానాన్ని 82.5ళీతూర్పు రేఖాంశం ఆధారంగా లెక్కకడతారు. ఈ రేఖాంశం ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని అలహాబాదు నగరం దగ్గరున్న మిర్జాపూర్ పట్టణానికి కొంచెం పశ్చిమంగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోని కాకినాడ నగరం మీదుగా వెళుతుంది. మిర్జాపూరు, యునై టెడ్ కింగ్‌డం యొక్క గ్రీన్‌విచ్ లోని రాయల్ అబ్జర్వేటరీల మధ్య రేఖాంశ అంతరం కచ్చితంగా 5 గంటల 30 నిమిషాలు. ఆధికారిక సమయపాలనా యంత్రాగం ఢిల్లీ లోని భారత జాతీయ భౌతిక ప్రయోగశాలకు సమయ పాలన బాధ్యతను అప్పగించినా, స్థానిక సమయాన్ని అలహాబాద్ అబ్జర్వేటరీ (25.15ళీ %చీ 82.5ళీ జు%) వద్ద ఉన్న గడియార స్తంభం నుండి లెక్కకడతారు. భారతదేశంలో అనేక పట్టణాలు 1850లలో రైల్వేలు వచ్చిన తర్వాత కొద్ది సంవత్సరాలకు కూడా తమ సొంత స్థానిక సమయాన్నే ఉపయోగించేవి. రైల్వేల రాకతో ఒక సమైక్య ప్రామాణిక సమయం యొక్క ఆవశ్యకత ఏర్పడింది. అప్పటి బ్రిటీషు ఇండియాలోని రెండు ముఖ్యపట్టణాలైన బొంబాయి , కలకత్తాల స్థానిక సమయాలు ప్రాధాన్యత సంతరించు కున్నాయి. క్రమేణ వాటి చుట్టుపక్కల ప్రాంతాలు , సంస్థానాలు ఈ ప్రామాణిక సమయాన్ని అవలంబించాయి. 19వ శతాబ్దంలో గడియారాలను టెలిగ్రాఫు ద్వారా ఒకే సమయము ఉండేట్టు చేసేవారు (సింక్రొనైజ్) ఉదాహ రణకు రైల్వేలు తమ గడియా రాలని ప్రతిరోజూ ఒక నిర్ణీత సమయంలో ముఖ్య కార్యాలయం లేదా ప్రాంతీయ కార్యాలయం నుండి పంపే సమయ సంకేతం ద్వారా సింక్రొనైజ్ చేసేవారు. అయితే బ్రిటీషు ఇండియా 1905 వరకు అధికారికంగా ప్రామాణిక కాలమండలాలను నిర్ణయించ లేదు. 1905లో ఏకైక ప్రామాణిక సమయాన్ని స్థాపిస్తూ అలహాబాదుకు తూర్పుగా వెళ్ళే 82.5 డిగ్రీల తూర్పు రేఖాంశాన్ని భారత దేశ కేంద్ర మెరిడియన్ గా ఎంచు కున్నది. ఇది 1906, జనవరి 1 నుండి భారత దేశంతో పాటు శ్రీలంకలో కూడా అమలులోకి వచ్చింది. కానీ, కలకత్తా సమయంను మాత్రం 1948 వరకు అధికారికముగా, ప్రత్యేక కాలమండలంగానే నిర్వహించారు. ఇతర సరిహద్దు దేశాలతో సంబంధంలో భాప్రాకా 1925లో, టైం సింక్రొనైజేషన్ సంకేతాన్ని ఆమ్నిబస్ టెలిఫోన్ వ్యవస్థ ద్వారా, నియంత్రిత సర్క్యూట్ల ద్వారా కచ్చితమైన సమయం కావలసిన సంస్థలకు ప్రసారం చేసేవారు. ఈ పద్ధతి 1940ల వరకు కొనసాగింది. తర్వాత ప్రభుత్వ సమయ సంకేతా లను రేడియో ద్వారా ప్రసారం చెయ్యటం ప్రారంభించింది. 1947లో భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత, భారత ప్రభుత్వం భారత ప్రామాణిక సమయాన్ని దేశం మొత్తానికి అధికారిక సమయంగా ప్రకటించింది. వాణిజ్య , అధికారిక ఉపయోగాల కోసం అధికారిక సమయ సంకేతాలు కొత్త ఢిల్లీలోని జాతీయ భౌతిక పరిశోధనశాల వద్ద ఉన్న సమయ, పౌనఃపున్య ప్రామాణిక పరిశోధనశాల ద్వారా వెలువడ తాయి. ఈ సంకేతాలు విశ్వవ్యాప్త సమన్వయ సమయ మునకు మద్దతునిచ్చే ప్రపంచ వ్యాప్త గడియార వ్యవస్థతో అను సంధానించ బడిన అటామిక్ క్లాక్ ఆధారంగా వెలువడుతాయి. నిర్దిష్టమైన సమయాన్ని దేశ మంతటా ప్రభుత్వాధీనంలో ఉన్న ఆలిండియా రేడియో , దూర దర్శన్ టెలివిజన్ నెట్‌వర్కుల ద్వారా ప్రసారం చేస్తారు. టెలిఫోన్ కంపెనీలు వినియోగదారులకు కచ్చితమైన సమయాన్ని తెలియ జేసేందుకు ప్రత్యేకంగా నియమిం చిన టెలిఫోన్ నంబర్లు టైం సర్వర్ మిర్రర్లకు అనుసంధా నించబడి ఉంటాయి. కచ్చితమైన సమయం తెలుసుకోవటానికి గణనీయంగా పెరుగు తున్న మరో ప్రాచుర్యమైన పద్ధతి గ్లోబల్ పొజిషనింగ్ సిస్టం (జి.పి.ఎస్) రిసీవర్లు.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595494**

## భారత శాస్త్ర పరిశోధనల పితామహుడు భట్నాగర్

### జనవరి 1.. శాంతి స్వరూప్ భట్నాగర్ వర్ధంతి



శాస్త్ర సాంకేతిక రంగంలో నూతనోన్నత మార్గాలను అన్వేషించిన శాస్త్రవేత్తగా, శాంతి స్వరూప్ భట్నాగర్ భారతదేశానికి అజరామరమైన సేవలు చేశారు. ఆయన దేశీయ పరిశోధనలకు ఆధునిక దిశానిర్దేశం కల్పించారు. పరిశోధకుడు, నాయకుడు, వ్యవస్థాపకుడు, మార్గదర్శిగా ఆయన అందించిన సేవలు భారత శాస్త్రరంగానికి ఎనలేని తోడ్పాటు అందించాయి.

**జననం, విద్యాభ్యాసం...** భట్నాగర్ 1894 ఫిబ్రవరి 21న ప్రస్తుతం పాకిస్తాన్‌లోని షాహ్‌పూర్ (శాన్‌సి జిల్లా) గ్రామంలో జన్మించారు. ఆయన చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయి, తన మామ పండిట్ పరమేశ్వరి సహాయంతో విద్యను కొనసాగించారు.

**విద్య:** లాహెూర్‌లోని దయానంద ఆంగ్లో-వెదిక్ హైస్కూల్‌లో విద్యనభ్యసించి, ఆ తరువాత పంజాబ్ విశ్వవిద్యాలయం నుంచి రసాయన శాస్త్రంలో బి.ఎస్సీ పట్టా పొందారు.

జర్మనీలోని ఎమిల్ ఫిషర్ శిష్యుడిగా బర్లిన్ విశ్వవిద్యాలయంలో రసాయన శాస్త్రంలో డాక్టరేట్ పూర్తి చేశారు.

**సాహిత్య, సాంకేతిక ప్రేరణ..** భట్నాగర్ కేవలం శాస్త్రవేత్తగా మాత్రమే కాకుండా, మంచి రచయితగానూ పేరు పొందారు. ఆయన రచనల్లో శాస్త్రం, సాంకేతికత, జీవిత చింతన సమన్వయంగా కనిపిస్తాయి. ఆయన తాత్విక భావనలు యువ శాస్త్రవేత్తలకు ప్రేరణగా నిలిచాయి.

**సాంకేతిక పరిశోధనా ప్రస్థానం...** కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ 1942లో భారత ప్రభుత్వ ఆధ్వర్యంలో భట్నాగర్ %జూ×=% ను స్థాపించారు. ఇది భారత పరిశోధనా రంగానికి ఒక కేంద్ర బిందువుగా నిలిచింది. భట్నాగర్ దేశంలోని వివిధ ప్రాంతాల్లో 12 నేషనల్ లాబొరేటరీలను స్థాపించారు, ఇవి పరిశోధనల్లో కీలక పాత్ర పోషించాయి.

**రసాయన శాస్త్ర సేవలు..** భట్నాగర్ రసాయన పరిశోధనలో అమూల్యమైన కృషి చేశారు... సెర్రా కంట్రోల్ ప్రాసెస్: ఆయన సాంకేతిక పరిజ్ఞానం పారిశ్రామిక పరిశోధనల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చింది.

ఖనిజ వస్తువుల శుద్ధి: భారతదేశంలో పారిశ్రామిక ముడిసరుకుల ప్రాసెసింగ్‌కు మార్గదర్శకత్వం వహించారు.

**అంతర్జాతీయ గుర్తింపు...** భారత శాస్త్రరంగంలో చేసిన కృషికి భట్నాగర్ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు.

**ప్రభావం, విశేషతలు... సంస్థాగత మార్పులు:** CSIR స్థాపనతో పరిశోధనా రంగానికి వ్యవస్థాగత పునాది వేశారు. సాంకేతికత, పరిశోధన, మరియు పరిశ్రమల మిళితం కల్పించారు. భవిష్యత్ శాస్త్రవేత్తల తయారీలో కీలక పాత్ర పోషించారు. స్వాతంత్ర్యానికి ముందే భారత పరిశోధన రంగాన్ని అభివృద్ధి చేయడం ఆయన విశిష్టత.

**పురస్కారాలు, గౌరవాలు:** 1941లో బ్రిటిష్ ప్రభుత్వం నైట్ హుడ్ బిరుదును ప్రదానం చేసింది. ఆయన భారత శాస్త్ర అకాడమీ (ఇన్సా) వ్యవస్థాపక సభ్యుడిగా వ్యవహరించారు. 1958లో సిఎస్ఐఆర్, ఆయన పేరుమీదుగా శాంతి స్వరూప్ భట్నాగర్ అవార్డు ప్రారంభించింది. ఇది భారతీయ శాస్త్రవేత్తలకు అత్యున్నత గౌరవం.

**మరణం:** భట్నాగర్ 1955 మార్చి 1న కన్నుమూశారు. కానీ ఆయన కృషి భారత శాస్త్రరంగానికి పునాది వేసినట్లుగా భావించ బడింది. శాంతి స్వరూప్ భట్నాగర్ జీవిత చరిత్ర పరిశోధన రంగంలో ప్రేరణగా నిలిచే ఆదర్శం. ఆయన శ్రద్ధ, కృషి, ప్రతిభ భారత శాస్త్ర సాంకేతికతను నూతన శిఖరాలకు చేర్చింది. ఆయన చూపిన మార్గం, నియమించిన సంస్థలు, అందించిన సూచనలు తరతరాల శాస్త్రవేత్తలకు మార్గదర్శిగా ఉంటాయి. భట్నాగర్ గురించి చెప్పుకుంటే, "భారత శాస్త్ర పరిశోధనల పునాది శిల" అని అభివర్ణించడంలో ఏమాత్రం అతిశయోక్తి లేదు.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595494**

## మహాత్ముని ఆంతరంగికుడు మహదేవ్ దేశాయ్

### జనవరి 1...మహదేవ్ దేశాయ్ జయంతి




మహదేవ్ దేశాయ్ పేరు చాలా మందికి తెలియక పోవచ్చు. ఈ తరం వారికి ఈ పేరు అపరిచితమై ఉండవచ్చు. జాతిపిత మహాత్మాగాంధీ సేవకోసం సర్వం త్యాగం చేసిన గొప్ప వ్యక్తి. అంతకన్నా ఆంతరంగికుడు. ఆయన లేకుండా మహాత్ముని జీవితం గురించి సంపూర్ణంగా తెలిసేది కాదంటే అతిశయోక్తి కాదేమో. ఆయన ఆయన మహాత్మా గాంధీ యొక్క వ్యక్తిగత కార్యదర్శి. గాంధీకి సంబంధించిన ప్రతి విషయం ఆయనే స్వయంగా దేశాయే చూసేవారు. మహదేవ్ దేశాయ్ (1 జనవరి 1892%-% 15 ఆగస్టు 1942) భారత స్వాతంత్ర్య సమర యోధులు, రచయిత. మహదేవ్ దేశాయ్ 1892 జనవరి 1 న గుజరాత్ లోని సూరత్ జిల్లాలో సారస్ అనే గ్రామంలో ఉపాధ్యాయుడైన హరిభాయి, జన్మాబెన్ దంపతులకు జన్మించారు. 13 సంవత్సరాల వయసులో మహదేవ్ దుర్గాబెన్ ను వివాహ మాడారు. ఆయన సూరత్ ఉన్నత పాఠశాల, ముంబయిలోని ఎల్ఫిన్‌స్టోన్ కాలేజిలో చదివారు. ఆయన బి.ఎ పట్టభద్రుడు. మహదేవ్ దేశాయ్ మొదటిసారి 1915 లో గాంధీని కలిసారు. దేశాయ్ 1917లో సబర్మతీ ఆశ్రమంలో ఆయన భార్య దుర్గాబెన్‌తో పాటు చేరారు. ఆ సంవత్సరం చంపారన్ ఉద్యమం జరిగింది. ఆయన డిసెంబర్ 13,1917 నుండి ఆగస్టు 14,1942 వరకు ఆయన మరణించే తేదీ ముందురోజు వరకు ఒక డైరీని నిర్వహించారు. దానిలో ఆయనకు మహాత్మాగాంధీ సాన్నిహిత్యం గురించి వ్రాసారు. బ్రిటిష్ ప్రభుత్వం గాంధీజీని 1919లో అరెస్టు చేసినపుడు గాంధీజీ తన వారసునిగా దేశాయ్ ను ప్రకటించారు. దేశాయ్ మొదటిసారి 1921 లో అరెస్టు కాబడి ఒక సంవత్సరం పాటు జైలు శిక్ష అనుభవించారు. ఆయన 25 సంవత్సరాలపాటు గాంధీజీకి వ్యక్తిగత కార్యదర్శిగా ఉన్నారు. ఆయన నిజానికి గాంధీకి హెూం, విదేశాంగ కార్యదర్శి. ఆయన ప్రతీ విషయాన్ని నిర్వహించేవారు. అన్ని యేర్పాట్లు చేసేవారు. ఆయన కార్యాలయాన్ని ఒక అతిథి గృహంగా, వంటగదిగా నిర్వహించే వారు. ఆయన అనేక మంది అతిథులను చూసేవారు.

గాంధీజీ కంటే ముందే వేకువ జామున లేచేవారు. రెండవది గాంధీతో నిరంతరం గడపేవారు. ఆరోజు జరిగిన విషయలను డైరీలో నమోదు చేసేవారు. 1920 లో మోతీలాల్ నెహ్రూ తన వార్తాపత్రిక అయిన ఇండిపెండెంట్ ను అలహాబాద్ నుండి నడపడానికి గాంధీ నుండి మహదేవ్ దేశాయ్ సేవలను కోరారు. ఇండిపెండెంట్ ప్రింటింగ్ ప్రెస్‌ను బ్రిటిష్ ప్రభుత్వం జప్తు చేసిన తరువాత చేతితో వ్రాసిన సైక్లోస్టైల్ వార్తాపత్రికను బయటకు తీసుకురావడం ద్వారా దేశాయ్ ఒక సంచలనాన్ని సృష్టించారు దేశాయ్. 1921 లో దేశాయ్‌ను తన రచనలకు ఒక సంవత్సరం కఠినమైన జైలు శిక్ష విధించారు. దేశాయ్ 1924 లో నవజీవన్ సంపాదకుడిగా బాధ్యతలు స్వీకరించారు. 1925 నుండి గాంధీ ఆత్మకథ, యంగ్ ఇండియాలో దాని సీరియల్ ప్రచురణ కోసం ఆంగ్లంలోకి అనువాదం ప్రారంభించారు. మరుసటి సంవత్సరం ఆయన సత్యాగ్రహ ఆశ్రమ కార్యనిర్వాహక కమిటీ ఛైర్మన్ అయ్యారు. నవజీవన్ లో ప్రచురించిన తన వ్యాసానికి గుజరాతీ సాహిత్య పరిషత్ నుండి బహుమతిని వచ్చింది. ఆయన సర్దార్ పటేల్‌తో కలిసి బార్డోలి సత్యాగ్రహంలో పాల్గొన్నారు. గుజరాతీలోని సత్యాగ్రహ చరిత్రను వ్రాసారు. దీనిని అతను ఆంగ్లంలోకి ది స్టోరీ ఆఫ్ బార్డోలిగా అనువదించారు. ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్నందుకు ఆయన్ను అరెస్టు చేసి జైలులో పెట్టారు. కాని గాంధీ-ఇర్విన్ ఒప్పందాన్ని అనుసరించి, జైలు నుండి విడుదలయ్యారు. గాంధీతో పాటు మిరాబెన్, దేవదాస్ గాంధీ, ప్యారేలాల్ లతో కలిసి రెండవ రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరయ్యాడు. కింగ్ జార్జ్ %ఎ% ను కలిసేందుకు వెళ్ళిన గాంధీతో పాటు వెళ్ళిన ఏకైక వ్యక్తి ఆయన. 1932 లో దేశాయ్‌ను మళ్లీ అరెస్టు చేసి గాంధీ, సర్దార్ పటేల్‌తో కలిసి జైలుకు పంపారు. 1933 లో విడుదలైన తరువాత, ఆయన్ను తిరిగి అరెస్టు చేసి బెల్గాం జైలులో అదుపులోకి తీసుకున్నారు. జైలులో ఉన్న ఈ సమయంలోనే ఆయన ''గీత ప్రకారం గాంధీ'' పుస్తకాన్ని రాశారు. ఇది ఆయన మరణానంతరం 1946 లో ప్రచురించ బడింది. దేశాయ్ 1939 లో రాక్‌కోట్, మైసూర్ రాచరిక రాష్ట్రాలలో ప్రజల ఉద్యమాలను నిర్వహించడంలో కీలక పాత్ర పోషించారు. 1940 వ్యక్తిగత సత్యాగ్రహ సమయంలో సత్యాగ్రహాలను ఎన్నుకునే బాధ్యతను తీసుకున్నారు. దేశాయ్ యొక్క చివరి జైలు శిక్ష 1942 ఆగస్టు 8 నాటి క్విట్ ఇండియా ప్రకటన తరువాత జరిగింది. ఆయన 1942 ఆగస్టు 9 ఉదయం అరెస్టు చేయబడ్డారు. ఆరు రోజుల తరువాత భారీ గుండె పోటుతో మరణించే వరకు గాంధీతో పాటు అగా ఖాన్ ప్యాలెస్‌లో ఉన్నారు. ఆగస్టు 15 1942 న ఉదయం మరణించేటప్పుడు దేశాయ్‌కు 51 సంవత్సరాలు. గాంధీజీ స్వయంగా దేశాయ్ భౌతిక కాయానికి స్నానం చేయించారు. ఆ పాలెస్ మైదానంలో ఆయనను దహనం చేసారు. ఆ ప్రదేశంలో ప్రస్తుతం ఆయన సమాధి ఉంది. భారత తపాలా శాఖ దేశాయ్ గౌరవార్థం 1983లో తపాలా బిళ్ళపై ఆయన బొమ్మను ముద్రించింది. మహదేవ్ దేశాయ్ గౌరవార్థం ఆయన పేరుతో మహదేవ్ దేశాయ్ సమాజసేవ మహావిద్యాలయ, గుర్జాత్ విద్యాపీఠ్ యొక్క సైన్స్, ఆర్ట్స్ విభాగం ఆయన పేరుతో నామకరణం చేసారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595494**

## హైదరాబాద్ రాష్ట్ర అభివృద్ధికి చందూలాల్ బహుముఖ సేవలు

### జనవరి 1...మహారాజా చందు లాల్ జయంతి



మహారాజా చందు లాల్ 18వ శతాబ్దపు చివరలో జన్మించి 19వ శతాబ్దం మధ్య కాలంలో హైదరాబాద్ రాష్ట్రానికి ప్రధాన మంత్రి (దివాన్)గా పనిచేసిన గొప్ప రాజకీయవేత్త, సాహితీ కవి, ధార్మిక నేతగా పేరొందారు. ఆయన ఆర్థిక సంస్కరణలు, ప్రాజా సంక్షేమం, ధార్మిక కార్యకలాపాల కోసం పాటుపడటం ద్వారా నిజాం పాలనలో ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించారు.

**ప్రారంభ జీవితం మరియు కుటుంబ నేపథ్యం...** మహారాజా చందు లాల్ 1766 జనవరి 1న హైదరాబాదులో జన్మించారు. ఆయన తండ్రి రాయ్ నారాయణ్ దాస్ రాయ్ బరేలి నుండి వలస వచ్చి నిజాం రాజ్యంలో స్థిరపడ్డారు. కుటుంబ నేపథ్యంగా, ఆయన ముత్తాత రాజా తోడర్ మల్ మొఘల్ చక్రవర్తి అక్బర్ దర్బారులో ఆర్థిక మంత్రిగా పనిచేశారు. ఈ కుటుంబం మొదటి నిజాం అసఫ్ జా కాలంలో ఆర్థిక వ్యవహారాల నిర్వహణలో కీలక పాత్ర పోషించింది. ఆ చిన్న వయస్సు నుంచే చందు లాల్ వివిధ రంగాల్లో తన ప్రతిభను చూపించారు. ఇది ఆయనకు భవిష్యత్తులో రాజకీయ రంగంలో వెలుగొందేందుకు పునాది వేసింది.

**రాజకీయ జీవితం...** మహారాజా చందు లాల్ సికిందర్ జా నవాబు హయాంలో 1833 నుండి 1844 వరకు ప్రధానమంత్రిగా (దివాన్)గా పనిచేశారు.

**ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి:** భూమి పన్ను విధానాన్ని పునర్వ్యవస్థీకరించి, వ్యవసాయానికి పునాది వేస్తూ ఆర్థిక వ్యవస్థకు నూతన ఉత్సాహాన్ని తెచ్చారు. వసూళ్ల విధానాన్ని సరళతరం చేసి, హైదరాబాదు రాజ్యానికి ఎక్కువ ఆదాయం వచ్చేలా చూశారు.

**సైనిక సంస్కరణలు:** సైన్యంలో నైపుణ్యాన్ని పెంచి, సమర్థవంతమైన అధికారుల నియామకం ద్వారా దళాలను పటిష్ఠం చేశారు. బ్రిటిష్ ప్రభావం వలన జరిగే ఒత్తిళ్లను సమర్థవంతంగా ఎదుర్కొన్నారు.

**ప్రజా సంక్షేమం:** నగరంలో నీటి సరఫరా, రోడ్ల నిర్మాణం వంటి మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యత ఇచ్చి ప్రజల జీవన ప్రమాణాలను మెరుగు పరిచారు. వైద్యం, విద్యా రంగాలలో ఆధునికతను తీసుకురావడంలో ముందడుగు వేశారు.

**ధార్మిక కార్యక్రమాలు...** మహారాజా చందు లాల్ హైందవ ధర్మం పట్ల విశేషమైన భక్తి చూపారు. తిరుపతి, అహెూబిలం, శ్రీశైలం వంటి పుణ్యక్షేత్రాలకు ఆర్థిక సాయం అందజేశారు.

అహెూబిలం ఆలయానికి ప్రతి సంవత్సరం 1,000 రూపాయల చొప్పున విరాళం అందించి ఆలయ నిర్వహణకు తన వంతు సహకారాన్ని అందించారు. కర్నూలు నవాబుల ప్రభావం నుండి పుణ్యక్షేత్రాలను రక్షించడంలో ముఖ్యపాత్ర పోషించారు.

**సాహిత్య రచనలు...** మహారాజా చందు లాల్ ఉర్దూ, పర్షియన్ భాషలలో అనేక సాహిత్య కృతులను రాశారు. ఆయన కవిత్వం మానవత్వం, ధార్మికత, మరియు సామాజిక సమతను ప్రతిబింబిస్తుంది. సాహిత్య రచనల ద్వారా కళా, సాంస్కృతిక రంగాలను ప్రోత్సహించారు.

**చరిత్రలో స్థానం...** మహారాజా చందు లాల్ హైదరాబాదు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిన నాయకుడు. ఆర్థిక, సాంస్కృతిక, ధార్మిక రంగాలలో ఆయన చేసిన కృషి హైదరాబాద్ రాష్ట్రము ఎదుగుదలకు పునాది వేసింది.

ఆయనను "హైదరాబాద్ రాజ్యానికి ఆభరణం"గా భావిస్తారు.

**మరణం మరియు వారసత్వం...** మహారాజా చందు లాల్ 1845 ఏప్రిల్మ 15న మరణించారు. కానీ, ఆయన చూపిన మార్గం, అందించిన సేవలు, ప్రేరణగా నిలిచాయి. చందు లాల్ స్మారకంగా చరిత్రలో నిలిచిన అనేక ప్రదేశాలు, రచనలు, ధార్మిక కృషులు ఇప్పటికీ గుర్తించ బడుతున్నాయి. మహారాజా చందు లాల్ ఒక గొప్ప దివాన్ మాత్రమే కాదు, ఓ మానవతావాది, కళా ప్రేమికుడు, ధార్మిక నాయకుడుగా హైదరాబాదు చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595494**

# చురకలు

## సంపాదకీయం

### మోడీ అమిత్ షా దుర్యోధన దుశ్శాసనులట !


కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోడీ హోం మంత్రి అమిత్ షాలకు దుర్యోధను డు దుశ్శాసనులు అంటూ కొత్త పేర్లు పెట్టారు పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ. ఈ ఇద్దరూ ఎన్నికలు జరిగే రాష్ట్రాలలో ప్రత్యక్షం అవుతారు అని నిప్పులు కురిపించారు. శకుని శిష్యుడు దుశ్శాసనుడు అంటూ అమిత్ షా మీద ఒక రేంజిలో మాటలతో చెలరేగిపోయారు దీదీ. బెంగాల్ లోని బంకురా లో బిర్సింగ్ పూర్ లో జరిగిన తృణమూల్ కాంగ్రెస్ ర్యాలీలో మమత మాట్లాడుతూ మోడీ అమిత్ షాలనే లక్ష్యంగా చేసుకుని విమర్శలతో రారెత్తించారు.

**పహల్గాం దాడి కేంద్రానిదా** : కాశ్మీర్ లోని పహల్గాంలో జరిగిన దాడి కేంద్రానిదా అని మమత ఒక వింత అయిన వేడెక్కించే ప్రశ్నను సంధించారు. పశ్చిమ బెంగాల్ ఉగ్రవాదులకు అడ్డా అయిందని చెబుతున్న మోడీ అమిత్ షాలు కేంద్రం ప్రమేయం తోనే ఢిల్లీ ఎర్ర కోట వద్ద దాడులు జరిగా యని చెబుతాయి అని చెబుతారా అని నిలదీశారు. బెంగాల్ లో ఉగ్ర క్యాంపు లు ఎందుకు ఉంటాయని ఆమె గద్దిం చారు. మిగిలిన సమయాల్లో కంటే ఎన్నిక లు వస్తే చాలు మోడీ అమిత్ షాలు బెంగాల్ లో ప్రత్యక్షం అవుతారు అని ఆమె నిందించారు.

**సర్ తో ఓట్ల గల్లంతు** : కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివి జన్ సర్ వల్ల బెంగాల్ లో పెద్ద ఎత్తున ఓట్లు గల్లంతు చేస్తున్నారు అని మమత ఆరోపించారు. ఇప్పటిదాకా కోటీ యాభై లక్షల ఓట్లను తొలగించారని ఆ ఓట్లు అన్నీ కూడా రాజ్ బన్సీలు, మతువాలు, ఆదివాసీలు వంటి అణగారిన వర్గాల ఓట్లే అని ఆమె ఫైర్ అయ్యారు. మొత్తం బెంగాలీ ఓట్లను తొలగించే ప్రయత్నం చేస్తున్నారని ఇది ప్రజాస్వామ్యానికే ఇబ్బందికరమైన పరిస్థితి అని ఆమె అన్నారు.

**చొరబాటుదారులకు ఆశ్రయం** : పశ్చిమ బెంగాల్ లో తాజాగా పర్యటించిన అమిత్ షా మమత బెనర్జీ ప్రభుత్వం మీద ఘాటు విమర్శలు చేశారు. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం సరిహద్దు కంచె కోసం భూమిని కేటాయించడం కంటే చొరబాటుదారులకు బెంగాల్ లో ఆశ్రయం అందించడానికి ప్రాధాన్యత ఇస్తుందని ఆయన విమర్శిం చారు. మతపరమైన సంతృప్తికరణ రాజకీయాల కారణంగా రాష్ట్రంలో అభివృద్ధి నిలిచిపోయిందని కూడా ఆయన ఆరోపించారు. అవినీతి చొరబాట్లకు రాచ బాటగా సాగుతున్న మమత ప్రభుత్వాన్ని గద్దె దించుతామని ఆయన చెప్పారు. మమత మాజీ అవుతారని, బీజేపీ నాయకత్వంలో సుపరిపాలన పేదల సంక్షేమంపై దృష్టి సారించిన ప్రభుత్వం వస్తుందని ఆయన చెప్పుకొచ్చారు. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ రాజకీయ ప్రయోజనాల కోసం చొరబాటును ప్రోత్సహిస్తున్నారని ఉగ్రవాదులకు అడ్డాగా రాష్ట్రం మారిందని తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. ఎన్నికల ఏడాదిలోకి ప్రవేశిస్తున్న వేళ ఈ విమర్శల జోరు ఇంకా హీటెక్కించేలా సాగుతుందని అంటున్నారు.

## కథా రచయితలకు మార్గదర్శకాలు చాసో కథలు - జనవరి 1: కథకులకు కథకులు చాగంటి సోమయాజులు వర్ధంతి



తెలుగు కథకు దిశానిర్దేశం చేసిన కొద్ది మంది ప్రముఖులలో చాసో ఒకరు. తెలుగు సాహిత్యంలో 'కథకులకి కథకుడు' అని పేరు ఆయన పేరెన్నిక గన్నారు. చాసో పూర్తి పేరు చాగంటి సోమయాజులు. "ఏలూరెళ్ళాలి ' "వాయులీనం" "కుంకుడాకు" "కుక్కుటేశ్వరము" చాసో పేరు చెప్పగానే మొదటగా గుర్తొచ్చే కథలు. ఈ నాలుగు కథలు ప్రధానంగా పేర్కొన్న బడినా, 1943–79 మధ్య కాలంలో చాసో రాసిన కథల నుంచి ఎంపిక చేసిన నలభై కథలతో విశాలాంధ్ర సంకలనం 'చాసో కథలు పేరున వెలువరించింది. మళ్ళీ మళ్ళీ చదువుకునే కథలు ఇవి. కొత్తగా కథలు రాయాలనుకునే వారికి చాసో కథలు మార్గదర్శకాలు. ఒక కథకు మరో కథకు ఏ మాత్రం పోలిక పరంగా సంబంధం లేక పోవడమనే అంశం ఆయనను గొప్ప కథకుడిని చేసింది. చాగంటి సోమయాజులు ( 1915, జనవరి 15 - 1994 జనవరి 1) ప్రముఖ తెలుగు రచయిత. ఆయన మొట్ట మొదటి రచన "చిన్నాజీ" 1942లో భారతి పత్రికలో ప్రచురితమైంది. ఆ తరువాత ఎన్నో కథలు, కవితలు రాశారు. ఆయన రాసిన కథల్లో పీడిత ప్రజల బాధలు, సమస్యలు, సమ కాలీన వ్యవస్థ అయన రచనలో ప్రధానంగా ఉన్నాయి. ఆయన రాసిన చాలా కథలు హిందీ, రష్యన్, కన్నడ, మరాఠి, మలయాళం, ఉర్దూ భాషలలోకి అనువదించ బడ్డాయి. 1968లో చాసో కథలుగా పుస్తక రూపంలో చాసో కథా సంకలనం వెలువడింది. 1915 జనవరి 15 న శ్రీకాకుళంలో జన్మించిన చాగంటి సోమయాజులు తల్లితండ్రులు కానుకొలను లక్ష్మీనారాయణ శర్మ, తులసమ్మ. తర్వాత పెదతల్లి తులసమ్మకు దత్త పుత్రునిగా విజయ నగరం వెళ్ళారు. చాసో అయిదో ఫారం వరకు శ్రీకాకుళంలో చదివారు. విజయ నగరం ఉన్నత పాఠశాలలో ఎస్.ఎస్.ఎల్.సి. పూర్తి చేసి మహారాజా కళాశాల విజయ నగరంలో పై చదువులు చదివారు. కళాశాల విద్యార్థిగానే ఆయన కవితా రచనకు శ్రీకారం చుట్టారు.

తోరుదత్, సరోజినీ నాయుడుల కవిత్వం, లియో టాల్‌స్టాయ్, మాక్సిం గోర్కీల కళాత్మక వ్యక్తీకరణ, ప్రగతిశీల మార్క్సిస్టు దృక్పథం చాసోను ప్రభావితం చేశాయి. సృజనాత్మక ప్రక్రియలైన కథ, కవిత్వం, రెండింటినీ దాదాపు ఒకే సమయంలో వ్రాస్తూ వచ్చినా, తర్వాతి కాలంలో ఆయన కథా రచనకే ప్రాధాన్య మిచ్చారు. అచ్చయిన చాసో తొలి కవిత 'ధర్మక్షేత్రము' (భారతి : 1941 జూన్), కాగా తొలి కథ చిన్నాజీ (భారతి: 1942). చాసో కథల రెండో కూర్పు విశాలాంధ్ర ప్రచురణాలయం 1983లో ముద్రించింది. ఇందులో మొత్తం 40 కథలున్నాయి. అభ్యుదయ రచయితల సంఘం స్థాపించిన వారిలో చాసో ఒకరు. ఆయన నిత్యజీవితంలో చాలా ఆదర్శాల కోసం పనిచేసారు. అభ్యుదయ సాహిత్యోద్యమ వేదిక, అభ్యుదయ రచయితల సంఘం మొదటి మహాసభలు తెనాలిలో 1943లో జరిపారు. కన్నుమూసే వరకూ ఆయన 'అరసం'లోనే ఉంటూ కార్యకర్తగా నాయకునిగా తెలుగునాట అభ్యుదయ సాహిత్య ఉద్యమానికి విశేష సేవలందించారు. చాసో 1994 జనవరి 1 న మరణించారు. మరణానంతరం తన భౌతిక కాయాన్ని మెడికల్ కాలేజీకి పరిశోధనల నిమిత్తం ఇమ్మని కోరటం ఆయన అభ్యుదయ జీవన దృక్పథానికి నిదర్శనం. చాసో కథల్లో ఉన్న మనుషులకి అంటే ప్రధాన పాత్రలకి ఆవేశాలుండవుబీ కామం, ప్రేమ, ఈర్ష్య, క్రోధం, ఇలాంటి ఉద్రేకాలుండవు. వాళ్ళు ఏ కోరికకీ లొంగిపోరు ఒక్క బతకాలనే కోరిక తప్ప. మనిషి సుఖంగా బతకాలంటే ఏం చెయ్యాలో చాసో పాత్రలు అన్యాపదేశంగా వివరిస్తాయి. సుఖం దానంతట అది రాదు. సుఖం నువ్వు చేసుకునేది. అది అదృష్టం వల్లో, మరో సదుపాయం వల్లో వచ్చే వొస్తువు కాదు. ఆలోచనల వల్ల, లౌక్యం వల్ల, చాకచక్యం వల్ల మాత్రమే సౌఖ్యం సాధ్యం. నీతి, స్నేహం, న్యాయం, ధర్మం ఇవి నిజాలు కావు. కాని ఇవి ఉన్నాయని తెలివితక్కువ వాళ్ళు నమ్ముతారు. అవి నిజంగా ఉన్నాయని నువ్వు నమ్మేవో నువ్వూ లోకంలో నానా కష్టాలూ పడే వాళ్ళలో చేరిపోతావు. ఇలా చాసో కథలలో పాత్రల ద్వారా చెపుతారు. తెలుగు కథా విమర్శకులలో చాసోని మెచ్చుకున్న వాళు ్ళ చాలామంది ఉన్నారు. వేళ్ళ మీద లెక్కపెట్ట దగిన పదిమంది తెలుగు కథానికా రచయితలలో చాసో పేరుంటుందని రోణంకి అప్పలస్వామి కితాబిచ్చారు. తెలుగు మరిచి పోయినప్పుడే చాగంటి సోమయాజులుని మరిచి పోవడమని ఆరుద్ర పేర్కొన్నారు. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

## తెలుగు సాహిత్య చరిత్రలో వెలుగుదీపం ముకురాల రామారెడ్డి - జనవరి 1...ముకురాల రామారెడ్డి జయంతి



ముకురాల రామారెడ్డి తెలుగు సాహిత్యంలో ప్రత్యేకమైన స్థానం పొందిన వ్యక్తి. ఆయన కవి, రచయిత, స్వాతంత్ర్య సమరయోధుడు, సామాజిక శ్రేయోభిలాషి, సంఘ సంస్కర్తగా భారతీయ చరిత్రలో గౌరవప్రదమైన స్థాయిని పొందారు. తెలుగు సాహిత్యానికి అంకితభావంతో ఆయన చేసిన కృషి, ఆర్థిక వెనుకబడిన వారి కోసం ప్రదర్శించిన శ్రద్ధ, ప్రజాస్వామిక విలువల పట్ల ఆయన చూపిన చైతన్యం ఆయన జీవితాన్ని చిరస్మరణీయంగా నిలిపాయి.

**ప్రారంభ జీవితం...** ముకురాల రామారెడ్డి మహబూబ్‌నగర్ జిల్లాలో 1929 జనవరి 1న ఒక సాధారణ రైతు కుటుంబంలో జన్మించారు. గ్రామీణ వాతావరణంలో పెరిగినప్పటికీ, ఆయనలో ఉన్న అక్షరాస్యతా కోరిక, విజ్ఞాన దాహం, ప్రజల సమస్యలను అర్థం చేసుకునే సామర్థ్యం చిన్న వయస్సు నుంచే స్పష్టంగా కనిపించాయి. పాఠశాల విద్యను పూర్తి చేసిన తర్వాత, ఆయన సాహిత్యం వైపు దృష్టి సారించారు.

**స్వాతంత్ర్య సమరంలో పాత్ర....** రామారెడ్డి స్వాతంత్ర్య సమరంలో చురుగ్గా పాల్గొన్నారు. బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా ఉద్యమాలు నిర్వహించడంలో, గ్రామీణ ప్రజలను చైతన్యవంతులను చేయడంలో కీలక పాత్ర పోషించారు. జాతీయోద్యమ సమయంలో రాసిన ఆయన గీతాలు, పాటలు ప్రజల్లో దేశభక్తిని పెంపొందించాయి.

**సాహిత్య ప్రస్థానం...** స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత రామారెడ్డి తన జీవితాన్ని పూర్తిగా సాహిత్యానికి అంకితం చేశారు. ఆయన రాసిన కవిత్వం, గేయాలు, వ్యాసాలు తెలుగు సాహిత్యానికి ఒక గొప్ప ఆభరణంగా నిలిచాయి.

**ప్రధాన రచనలు...** జన నీతి కవిత్వం: సామాజిక సమస్యలపై వేదికగా రాసిన ఈ సంకలనం సామాజిక స్పృహను పెంచేందుకు మార్గదర్శకంగా నిలిచింది.

స్వరాజ్య దీపం: భారత స్వాతంత్ర్య ఉద్యమంలో భారతీయుల త్యాగాలను, దేశభక్తిని ఆవిష్కరించిన గొప్ప రచన.

గ్రామ గీతాలు: గ్రామీణ జీవన సౌందర్యాన్ని, అక్కడి కష్టాలను, ఆత్మబలాన్ని ప్రతిబింబించిన రచన.

**సామాజిక సేవలు...** రామారెడ్డి రచయితగా మాత్రమే కాకుండా, ఒక సామాజిక శ్రేయోభిలాషిగా కూడా సేవలందించారు. నిరక్షరాస్యతను దూరం చేసేందుకు గ్రామీణ ప్రజలకు విద్యను అందించడం ఆయన ప్రాధాన్యకరమైన లక్ష్యంగా ఉంచుకున్నారు. గ్రామీణ ప్రాంతాల ఆర్థిక స్థితిని మెరుగుపరచడానికి స్వావలంబన పాఠాలు నేర్పించారు. సంఘ సంస్కరణలు: వితంతు వివాహాలు, కుల వివక్ష నిర్మూలన, బాల్య వివాహాల నిరోధం వంటి సామాజిక అంశాల్లో చైతన్యం కలిగించారు.


**గౌరవాలు, గుర్తింపులు..** 1976లో ఢిల్లీలోని ఆకాశవాణి వారిచే రామారెడ్డిని "జాతీయ కవి"గా సన్మానించడం ఆయన ప్రతిభకు నిదర్శనం. తెలుగు భాషాభివృద్ధికి, ప్రజల సాంస్కృతిక చైతన్యానికి ఆయన చేసిన కృషికి అనేక సంస్థల నుంచి ప్రశంసలు అందాయి.

**ఆధ్యాత్మికత, కవిత్వం..** రామారెడ్డి కవిత్వంలో ప్రధానంగా ఆధ్యాత్మికత కనిపిస్తుంది. తన పద్యాల ద్వారా సామాన్య ప్రజలకు సులభంగా అర్థమయ్యేలా భావోద్వేగాలను, జీవన సత్యాలను చర్చించారు.

**మరణానంతర గౌరవం...** 2003 ఫిబ్రవరి 24న ముకురాల రామారెడ్డి మరణించగా, తర్వాత కూడా, ఆయన సాహిత్య కృషి తెలుగు ప్రజల గుండెల్లో నిలిచి ఉంది. పాఠశాలలలో ఆయన రచనలు చదివించే ప్రయత్నాలు జరిగాయి. ఆయన పేరుతో సాంస్కృతిక, సాహిత్య సభలను నిర్వహించడం ద్వారా ఆయన జ్ఞాపకాలను సజీవంగా ఉంచుతున్నారు. ముకురాల రామారెడ్డి జీవితమూ, సాహిత్యమూ మనకు ఒక స్పష్టమైన సందేశాన్ని ఇస్తాయి: వ్యక్తి కృషి, అంకితభావం, ప్రజల పట్ల చూపే ప్రేమ, దేశ సేవ పట్ల ఉన్న నిబద్ధత ద్వారా మన జీవితం గౌరవప్రదంగా మారుతుంది. ఆయన చూపిన మార్గం, రచించిన సాహిత్యం, చేసిన సేవలు తరువాతి తరాలకు ప్రేరణగా నిలుస్తాయి. "స్వాతంత్ర్యం కోసం పోరాడిన కవి, సమాజంలో మార్పు తీసుకొచ్చిన సంస్కర్తగా ముకురాల రామారెడ్డి పేరును తెలుగు ప్రజలు ఎల్లప్పటికీ గౌరవిస్తారు." **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

## తెలుగువారికి బృహత్సంహితలు...పానుగంటి సాక్షి వ్యాసాలు - జనవరి 1.. ఆంధ్రా షేక్స్పియర్ వర్ధంతి


పానుగంటి ప్రతిభ అనన్యం. ప్రజ్ఞ బహుముఖీనం, నాటకకర్తగా, వ్యాసరచయితగా ఆయన పేరు సుస్థిరం. ప్రక్రియ ఏదైనా ఆయన రచనలకు హాస్యం ఆలంబనం. పదాలు గుప్పించడంలోను, ఒకమాటకు పది మాటలు వాడి వ్యంగ్యాన్ని, వర్ణనను, హాస్యాన్ని రంగరించడంలోను ఆయనకు ఆయనే సాటి. సాక్షి వ్యాసాల శైలి వరద గోదావరిలాగా ఝరీవేగంతో పరుగులెట్టేది. కొందరు ఆయనను "ఆంధ్రా అడిసన్" అంటారు. మరికొందరు ఆయనను "ఆంధ్రా షేక్స్పియర్" అంటారు. గ్రాంథిక భాషలో సామాజిక రుగ్మతలను ఎండగడుతూ ఆయన రాసిన సాక్షి వ్యాసాలు తెలుగు సాహితీ వినీలాకాశంలో ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించు కున్నాయి. ఆయన రాసిన నాటకాలు కూడా ఆనాటి సాహితీ అభిమానుల ఆదరణను పొందాయి. " పాను గంటి సాక్షి వ్యాసాలు చదవడం మాననంటి.. ఎంచేతనంటే వాటిలో పేను లాంటి భావానికాయన ఏను గంటి రూపాన్నియ్యడం నేనుగంటి" అని శ్రీశ్రీ సైతం కొనియాడిన మేటి సాహితీ శిఖరం పానుగంటి. పానుగంటి లక్ష్మీ నరసింహారావు తెలుగు సాహితీవేత్త. తెలుగు సాహిత్యానికి అనేక అమూల్యా భరణాలు అందించిన నరసింహా రావును పాఠక లోకం 'కవిశేఖరుడ'నీ, 'అభినవ కాళి దాసు' అనీ బిరుదులతో అభినందించింది. నవంబరు 2, 1865వ తేదీన రాజమహేంద్రవరం తాలూకా సీతానగరంలో రత్నమాంబ, వెంకట రమణయ్య దంపతులకు జన్మించారు. 1884లో మెట్రిక్యులేషన్, 1886లో ఇంటర్, 1888లో బి.ఎ. పరీక్షలలో ఉత్తీర్ణు లైనారు. పెద్దాపురం హైస్కూలులో ఉపాధ్యాయుడిగా చేరిన పాను గంటి, ఆ రోజుల నుండే తన రచనా వ్యాసంగాన్ని ప్రారంభించారు. అయితే ఉపాధ్యాయుడిగా తన సంపాదన చాలక పోవడంతో తొలుత లక్ష్మీనరసాపురం సంస్థానంలో దివానుగా చేరారు. ఆ తర్వాత ఉర్లాం, అనెగొంది, పిఠాపురం మొదలైన సంస్థానాల్లో కూడా పనిచేశారు. ఆయన లక్ష్మీ పురం జమిందారిణి రావు చెల్లయమ్మ గారి దివానుగా చేరారు. ఆరు సంవత్సరాల తర్వాత అభిప్రాయ భేదాల మూలంగా ఉద్యోగం మాని వేశారు. తరువాత ఉర్లాము సంస్థానం లోను, బళ్ళారి జిల్లాలోని ఆనెగొంది సంస్థానంలోను దివానుగా కొంత కాలం పనిచేశారు. పిఠాపురం మహారాజా శ్రీ సూర్యారావు బహదూరు పానుగంటి రచనల గురించి వినగా, రాజాకు మైనారిటీ తీరగా రాజ్యాధికారం చేపట్టిన తర్వాత పంతులు గారిని 1915–16 మధ్య 'నాటక కవి'గా తమ ఆస్థానంలో నియమించారు. ఆయన కోరికపై అనేక నాటకాలు వ్రాసారు. వాటి నన్నింటిని మహా రాజుగారే అచ్చు వేయించారు. పానుగంటి వారి రచనలల్లో ప్రముఖ మైనవి సాక్షి వ్యాసాలు. సువర్ణముఖి, ఆంధ్రపత్రిక లలో 1913 నుండి 1933 మధ్యకాలంలో ప్రచురించ బడ్డాయి. వ్యాసాలన్నీ అచ్చమైన గ్రాంథిక భాషలో ఉన్నా, వ్యవహారానికి దగ్గరగా ఉండే శైలితో రాయడం రచయిత ప్రత్యేకత. వినోద ప్రధానశైలిలో రాస్తూ.. ఆనాటి సామాజిక రుగ్మతలను ఎండ గట్టడం ఈ వ్యాసాల ప్రధాన ఉద్దేశం. 1711 - 12 లో స్పెక్టేటర్ అనే ఆంగ్ల పత్రికలో జోసెఫ్ అడ్డిసన్, రిచర్డ్ స్టీల్ వ్రాసిన స్పెక్టేటర్ పేపర్స్ వ్యాసాలతో ప్రేరణ పొందిన పానుగంటి ఈ వ్యాసాలను రాశారంటారు. ఈ వ్యాసాలలో కాలాచార్యుడు, జంఘాల శాస్త్రి, వాణీదాసు, బొర్రయ్య శెట్టి అనే పాత్రల ద్వారా సామాజిక విషయాలపై చర్చలను పెడతారు రచయిత. వారి సంభాషణల ద్వారా పాఠకుడికి అందాల్సిన సందేశాన్ని అందిస్తారు. "సాక్షి వ్యాసాలు" పుస్తకంగా వచ్చాక, అనతికాలం లోనే పానుగంటి వారి పేరు ఆంధ్రదేశంలో మారుమ్రోగి పోయింది. ఆ వ్యాసాలు విశేష పాఠకాదరణ పొందాయి. సాక్షి వ్యాసాల రాసిన తర్వాత పిఠాపురం జమీందరు ప్రేరణతో ఇంకా అనేక రచనలు చేశారు పానుగంటి. సారంగ ధర చరిత్ర, వృద్ధ వివాహము, రాధాకృష్ణ, నర్మదా పురుకుత్సీయము, సరస్వతి, దుష్టప్రధాని, ఆనందనాథ, కల్యాణ రాఘవము, కంఠాభరణము, విజయ రాఘవము, కోకిల, విప్రనారాయణ చరిత్ర, బుద్ధ బోధసుధ, వీరమతి, పూర్ణిమ అందులో ప్రముఖమైనవి. ఆయన రాసిన నాటకాలే పానుగంటి వారి అభినవ కాళిదాసు బిరుదును పొందేలా చేశాయి. తన రచనల వలన తొలినాళ్లలో ఆయన విశేషంగా ధనమార్జించినా, అవసాన దశలో పేదరికానికి, ఋణబాధకు గురవడం గమనార్హం. సంస్థానం అందించే గౌరవ వేతనంపైనే ఆయన ఆధారపడాల్సి వచ్చింది. "నాకెవరును దానధర్మము చేయనక్కర లేదు. తగ్గింపు ధరలకు నూటయాభై సెట్ల పుస్తకాలు యాభై మంది కొని, నా మానుషమును కాపాడినను, నాకు సివిలు ఖైదు తప్పును" అని తన చివరిదశలో ఆ మహా రచయిత వాపోయాడంటేనే అతని పరిస్థితి అప్పుడు ఎలా ఉండేదో అర్థం చేసుకోవచ్చు. ఆ తర్వాత అనారోగ్యం కూడా అతన్ని బాగా కుంగదీసింది. తెలుగు పాఠకులపై చెరగని ముద్ర వేసిన సాక్షి వ్యాసాలను ఆ రోజుల్లో కుర్రకారుతో సహా ఎందరో ఎంతో ఆసక్తిగా చదివేవారు. ఆ రోజుల్లో అవి కలిగించిన సంచలనం అంతా యింతా కాదు. "జంఘాలశాస్త్రి" అనే పాత్ర ముఖతః



పానుగంటి వారు సమకాలిక సాంఘిక దురాచారాల మీద, మూఢ విశ్వాసాల మీద పదునైన విమర్శలు చేసేవారు అని నండూరి రామమోహనరావు అభిప్రాయం వ్యక్తం చేశారు. మృదుమధుర నవార్థభాసుర వచనరచనా విశారదులైన" మహాకవి ఆధునిక కాలమున ఎవరు అని ప్రశ్నించినచో నా ప్రత్యుత్తరము "పానుగంటి లక్ష్మీనరసింహారావు"గారని. .. నిబ్బరమైన పానుగంటి వచనమున కబ్బురపడని గద్యప్రేమికు లుండరని, నాటకములలో కన్యాశుల్కము ఎట్టిదో గద్య రచనములలో సాక్షి అటువంటిదని మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి పేర్కొన్నారు. ఆయన తెలుగు సాహితీ లోకాన్ని విడిచి తిరిగి రాని లోకాలకు పానుగంటి వారు వెళ్లినా, సాక్షి వ్యాసాలు మాత్రం చరిత్రలో చిరస్థాయిగా ఉండి పోయాయి. ఇప్పటికీ తెలుగు విద్యార్థుల పాఠ్యాంశాలలో ఈ వ్యాసాలను ప్రచురించడం ఆయనకు దక్కిన గొప్ప గౌరవమే. సుమారు ఇరవై సంవత్సరాలు ఆయన జీవితం సుఖంగా జరిగింది. ఆ రోజుల్లో దివాణం తరువాత వ్యయానికి వీరి గృహమే అనేవారు. ఆధునిక శ్రీనాధునిగా జీవించారు. ఉద్యోగాల వలన, రచనల వలన విశేషంగా డబ్బు గడించినా దానిని నిలువ చేయడంలో శ్రద్ధ కనపరచ లేదు. ఆధునిక శ్రీనాధుని వలెనే అనుభవించి నన్నాళ్ళూ బాగా అనుభవించి, తుది రోజులలో పేదరికానికి ఋణ బాధకు లోనయ్యారు. మహారాజా వారు బాగా పోషించినా, పంతులుగారికి తుదిదశలో వైషమ్యాలేర్పడి, తమదగ్గర ఏనాడో చేసిన ఋణం కొరకు వారికి ఇచ్చే నూట పదహారు రూపాయల గౌరవ వేతనంలో కొంతభాగం తగ్గించ డానికి ఉత్తర్వులు జారీ చేశారు. వృద్ధాప్యంలో ఆయన అటు ఇటు తిరిగి సంపాదించ లేకపోయారు. చేతికి అందివచ్చిన కుమారులు ఉన్నా వారిని ఉద్యోగాలకు పంపలేక పోయారు.

పానుగంటి కవి శేఖరుని దుస్థితి గురించి ఆయన వ్రాసిన లేఖను ఆంధ్రపత్రికలో యర్రవల్లి లక్ష్మీనారాయణ ప్రచురించాడు ... "నాకెవరును దానధర్మము చేయనక్కర లేదు. తగ్గింపు ధరలకు నూటయాభై సెట్ల పుస్తకాలు యాభై మంది కొని, నా మానుషమును కాపాడినను, నాకు సివిలు ఖైదు తప్పును". 1933 నుండి శారీరకంగా, మానసికంగా ఆయన ఆరోగ్యం చెడి పోయింది. 1935 లో పిఠాపురంలో ఉత్సవాలు నిర్వహించి పురజనులు ఘనంగా సన్మానించారు. ఈ ఉత్సవానికి చిలకమర్తి లక్ష్మీనరసింహం అధ్యక్షత వహించారు. పరిస్థితులు మారి, తీవ్ర మనస్తాపంతో జనవరి 1 న , 1940లో మరణించారు.
**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

## నూతన సంవత్సరాది పూర్వాపరాలు




ప్రపంచంలో వివిధ ప్రాంతాలలో సంవత్సరాది పండగను వివిధ దినాలలో జరుపుకుంటారు. ఇలా జరుపుకోవడానికి కారణం సంవత్సర పరిగణన వేరువేరు మాసాలలో జరగడమే. ప్రపంచంలో అత్యధికులు ఆచరించేది ప్రస్తుత గ్రెగేరియన్ క్యాలెండర్ క్రీ.శ.1582లో రూపొందించినది. జనవరి 1వ తేదీన నూతన సంవత్సర తొలి రోజును పండగలా జరుపుకోవడం సాపేక్షంగా కొత్త దృగ్విషయం. క్రీ.పూ.2000లో వసంత సమరాత్రి సమయాన మార్చి మధ్య కాలంలో మెసపొటేమియాలో నూతన సంవత్సర ఉత్సవాలు తొలి నాళ్ళలో జరుపుకునే వారు. అలాగే వివిధ ప్రాంతాలలో రుతు సంబంధంగా ప్రాచీనులు విభిన్న రోజులలో సంవత్సరాదిని పాటించేవారు. ఈజిప్టియన్లు, ఫొయెనిషియన్లు, పర్షియన్లు సమరాత్రి ప్రారంభం, గ్రీకులు శీతకాల ఆయనాంత సమయాన జరుపుకునే వారు. పూర్వపు రోమన్లు మార్చి నెల 1వ తేదీని కొత్త సంవత్సర ఆరంభ దినంగా నియమం పెట్టుకున్నారు. ఆనాటి క్యాలెండర్ మార్చితో ప్రారంభమై 10నెలలతో కూడి ఉండేది. లాటిన్ లో "సెప్టెం" అనగా ఏడు అని, "అక్టో" అనగా ఎనిమిది అని "నొవం" అనగా తొమ్మిది అని, "దశం" అనగా పది అని అర్థం. క్రీ.పూ.153లో ప్రప్రథమంగా జనవరి 1న నూతన సంవత్సర తొలి రోజుగా పరిగణించారు. వాస్తవానికి క్రీ.పూ.700 వరకు జనవరి మాసం ఉనికే లేదు. రోమ్ రెండవ రాజైన నుర్మా పొంటిలియస్ జనవరి, ఫిబ్రవరి మాసాలను జత చేయడం జరిగింది. రోమ్ సామ్రాజ్యంలో పౌర యుద్ధం చోటు చేసుకుని, గణతంత్ర రాజ్యంలో ఇరువురు ఉన్నతాధికారులైన అమాత్యులు కొత్తగా ఎన్నికైన సందర్భాన వారి పదవీ కాలాన్ని ఏడాదిగా నిర్ణయించారు. ఆ సందర్భంగా మార్చి నుండి జన వరికి తొలి రోజును మార్చినా, అది ఖచ్చితంగా పాటించ బడలేదు. అప్పటికీ మార్చి 1ననే కొత్త సంవత్సర వేడుకలు జరిగేవి. క్రీ.పూ.46లో జూలియస్ సీజర్ ప్రాచీన చాంద్రమానాధారిత రోమన్ క్యాలెండర్ ను మెరుగు పరిచి, సౌర మాన ఆధారిత నూతన క్యాలెండర్ ను పరిచయం చేయగా, సదరు క్యాలెండర్ జనవరి 1ననే కొత్త సంవత్సర ప్రారంభ దినంగా పరిగణింప చేయగా, అది క్రమేణ నిలకడగా పాటించ బడింది. మధ్యయుగాన ఐరోపాలో నూతర వత్సర సంబరాలు అన్యమత సంబంధమైనవిగా భావించ బడగా, క్రీ.శ.567లో జనవరి 1వ తేదీన నూతన సంవత్సర ప్రారంభ దినాన్ని పాల కులచే రద్దు చేయబడింది. మధ్యయుగ క్రైస్తవులు ఐరోపాలో చాలా వరకు కొత్త సంవత్సర దిన వేడుకలను జీసస్ జన్మదిన సందర్భంగా డిసెంబర్ 25న, మార్చి 1న, మార్చి 25న, ఈస్టర్ సందర్భంగా పాటించేవారు. 1582వ సంవత్సరంలో సంస్కరింపబడి, పునరుద్దరింప బడిన గ్రెగేరియన్ క్యాలెండర్ జనవరి 1వ తేదీని ప్రకటింపగా, వెనువెంటనే చాలా వరకు క్యాథలిక్ దేశాలు స్వీకరించాయి. తర్వాత క్రమంగా ప్రొటెస్టెంట్ దేశాలు కూడా స్వీకరించాయి. అయితే 1752 వరకు బ్రిటిషర్లు స్వీకరించలేదు. అప్పటికీ బ్రిటిష్ సామ్రాజ్యం, వారి అమెరికన్ కాలనీలు మార్చి మాసంలోనే నూతన సంవత్స వేడుకలు జరుపుకునే వారు. 1752 తర్వాత బ్రిటిష్ రాచరిక పాలకులు తమ ఆధీనంలోని దేశాలన్నింటిలో జన వరి 1వ తేదీని నూతన సంవత్సర తొలి రోజుగా ఆచరించే చర్యలు గైకొన్నారు. మొట్టమొదటి సారిగా గ్రెగేరియన్ క్యాలెండర్ కు, జూలియస్ సీజర్ క్యాలెండర్ కు గల రోజుల వ్యత్యాసాన్ని సవరించి, 1582 అక్టోబర్ మాసంలో 5 నుండి 14వ తేదీలను ఇటలీ, పోర్చుగల్, స్పెయిన్, పోలండ్ దేశాలలో లేకుండా చేసి, 4తర్వాత 15ను మార్చడం జరిగింది. 1752 సెప్టెంబరులో 3నుండి 13 తేదీలు తొలగించి, 11రోజులను లేకుండా సరి చేశారు.. జనవరి 7 ఈజిప్టియన్లు, 11న ఓల్డ్ స్కాటిష్, 14న ఈస్టర్న్ ఆర్థడాక్స్, 21న కొరియన్లు, మార్చి 1న రోమన్లు, ఏప్రిల్ 13,14ను (బైసాకి) నానక్ సాహి క్యాలెండర్ ఆధారంగా సిక్కులు, ఉగాదిని తెలుగువారు, ఏప్రిల్ 14ను అగ్నేయాసియా దేశాలు, ఏప్రిల్ మొదటి వారంలో పౌర్ణమిని బౌద్ధులు, మొహర్రం నెల మొదటి రోజు ఇస్లాం, జూన్ 21ని ఏనిషియెంట్ గ్రీక్, జూలై 8ని ఆర్మేనియన్, ఆగస్టు 8ని మళయాళీలు, 23ను జొరాస్ట్రియన్, సెప్టెంబర్ 1ని రష్యన్ ఆర్థడాక్స్ క్రిస్టియన్, 11ను ఇథియోపియన్, అక్టోబర్ 3ను మొరాకో, నవంబర్ లో దీపావళిని జైనులు, డిసెంబర్ లో సిక్కిం న్యూ ఇయర్ డేగా పాటించడం అనవాయితీ. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

చురకలు



# స్వార్థమే పరమార్థం... కుటుంబ వ్యవస్థ అస్తవ్యస్తం - జనవరి 1... గ్లోబల్ ఫ్యామిలీ డే




ఏటా నూతన సంవత్సర తొలి దినాన్ని, ఐక్య రాజ్య సమితి మిలీనియం డే గా, గ్లోబల్ ఫ్యామిలీ డే గా జరుపు కుంటారు. ప్రతి సంవత్సరం జనవరి 01న ప్రపంచ జనాభాలో మూడింట రెండు వంతుల మంది ప్రపంచ కుటుంబ దినోత్సవాన్ని జరుపు కుంటారు. కుటుంబాలకు సంబంధించిన సమస్యలపై అవగాహన పెంపొందించడానికి, కుటుంబాలను ప్రభావితం చేసే సామాజిక, ఆర్థిక మరియు జనాభా ప్రక్రియల జ్ఞానాన్ని పెంచుకోవడానికి ఈ రోజు ఒక ఉపకరిస్తుంది. కుటుంబాలు ఒక దేశం నుండి మరొక దేశానికి, అలాగే ప్రతి జాతీయ సమాజంలో విభిన్న రూపాలు, లక్షణాలను కలిగి ఉంటాయి. కుటుంబాలు వ్యక్తిగత ప్రాధాన్య తలు, సామాజిక పరిస్థితుల వైవిధ్యాన్ని తెలియ జేస్తాయి. భూమిపై ఒక గ్లోబల్ కుటుంబం అంటే వసుదైక కుటుంబంగా అందరూ శాంతి, సామరస్యంతో జీవించాలనే ఆలోచనను ప్రోత్సహించమే ఈ వంబర్ 1997లో, ఐక్య రాజ్య సమితి జనరల్ అసెంబ్లీ కొత్త సహస్రాబ్ది మొదటి సంవత్సరం (2000) ప్రపంచ పిల్లల కోసం శాంతి మరియు అహింస సంస్కృతి కోసం అంతర్జాతీయ దశాబ్దాన్ని ప్రారంభించాలని ఒక ప్రకటన చేసింది. ఆ సందర్భంగా "శాంతి యొక్క ఒక రోజు"గా ప్రకటించ బడింది. అలా గ్లోబల్ ఫ్యామిలీ డేతో పాటు, జనవరి 01ని ప్రపంచ శాంతి దినోత్సవంగా కూడా పాటిస్తారు. కుటుంబం అంటే ఒకే గృహంలో నివసించే కొంత మంది మానవుల సమూహం. వీరు సాధారణంగా పుట్టుకతో లేదా వివాహముతో సంబంధమున్న వారు. సమాజంలో వివిధ మతపరమైన వివాహ చట్టాలు కుటుంబ వ్యవస్థను గుర్తించాయి. భారతీయ సంస్కృతికి, సంప్రదా యాలకు, నాగరికత పురోగతికి మూలమైనది ఉమ్మడి కుటుంబ వ్యవస్థ. నాగరికత విస్తరణకు పూర్వమే మనదేశంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ ఉందని వివిధ గ్రంథాలలో పొందు పరచబడి ఉంది. నాగరిక ప్రపంచంలోనూ మన దేశంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ మూడుపువ్వులు ఆరు కాయలుగా వర్థిల్లింది. రక్త సంబం ధము, సహచరత్వము, ఒకే నివాసం అంశాల విషయంలో కుటుంబ నైతిక, సామాజిక సూత్రాలు ఇమిడి ఉన్నాయి. ప్రాచీన కాలం నుండి ఉమ్మడి కుటుంబాలు సిరి సంపదలతో తూల తూగా యనడంలో సందేహం లేదు. ఒక కుటుంబంలో తాత మొదలు వారి పిల్లలు వారి పిల్లలు ఇలా మూడు నుంచి నాలుగు తరాలు ఉమ్మడి అనే గొడుగు కింద ఒదిగి పోయేవి. ఇంటి లోని పెద్దకు అందరూ గౌరవం ఇవ్వాల్సిందే. ఆయన మాటే వేదవాక్కు. అంద రిదీ ఉమ్మడి వ్యవసాయమే. సమష్టి సంపదనే, సమష్టి భోజనాలే ఉంటే ఆత్మీయత అనురాగం, ఉట్టి పడేలా చేసేవి. తల్లిదం డ్రులు, అత్తమామలు, అక్క చెల్లెళ్లు, అన్నదమ్ములు, బావా మర దళ్లు, బంధు మిత్రులు, తాతలు, బామ్మలు, మనవలు, మనవ రాండ్ర తో కళకళలాడే ఉమ్మడి కుటుం బాలు సిరి సంపదల నిల యాలు. పిల్లలు చిన్న వయస్సులో ఉన్న పుడు తల్లిదండ్రుల చెంతనే ఉంటారు. వారు పెద్దవారై పెళ్ళిళ్ళు అయిపోతే ఎవరి కుటుం బాలు వారివే అంటే ఒక కుటుంబం నుంచి మరిన్ని కుటుంబాలు ఉదయిస్తాయి. ఒక కుటుంబం మరెన్ని కుటుంబాలను సృష్టించి నప్పటికీ వంశవృక్షపు వేళ్ల మూలాలు మాత్రం మొదటి కుటుంబంను అల్లుకునే ఉంటాయి. అందుకే సంవత్సరంలో ఒక రోజైనా అందరూ కలుసు కోవాలని సరదాగా గడపాలని కోరుకోవడం అత్యంత సహజం. ఆధునిక యుగంలో ఒకే ఇంట్లో ఉన్నప్పటికీ ఒకరినొకరు పలుకరించు కునే సమయం చిక్కని కుటుంబాలు ఎన్నో విదేశీ పాలకుల పాలనలో ఉమ్మడి కుటుంబాలుగా చెలామణి అయిన ఎన్నో కుటుంబాలు నవనాగరిక ప్రపంచంలో విచ్ఛిన్న మయ్యాయి. ఆధునికత పెరగడం, నాగరికత పురోభివృద్ధి, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం వెరసి ఉమ్మడి వ్యవస్థ మీదా తీవ్ర ప్రభావాన్ని చూపింది. నవ నాగరిక ప్రపంచంలో రెండు కుటుంబాలు, రెండు మనసులు కూడా కలసి జీవించ లేని పరిస్థితి నెలకొంది. ఆధునిక యుగంలో ఒకే ఇంట్లో ఉన్నప్పటికీ ఒకరినొకరు పలుకరించుకునే సమయం చిక్కని కుటుంబాలు ఎన్నో కేవలం ఫోన్ లోనో, మొబైల్లోనో యోగక్షేమాలు కనుక్కునే కుటుంబాలు కూడా లేకపోలేదు. ఒకప్పుడు ఉమ్మడి కుటుంబాలకు మనదేశం పుట్టిల్లు. ఇప్పుడు ఆ సంస్కృతి భూతద్దం పెట్టి వెతికినా దొరకదంటే అతిశ యోక్తి కాదు. అనేక కుటుంబాలు వ్యక్తిగత కారణాలతో విచ్ఛిన్నం కావడం మనం రోజూ చూస్తూ ఉన్నదే. అయినప్పటికీ మన దేశంలో అనేక కుటుంబాల మధ్య కనిపించే అన్యోన్యతా భావం మరే దేశంలోనూ కనిపించదు. డబ్బు సంపాదన కోసం కనీసం భార్యభర్తలు కూడా ఒక చోట కూర్చుని ఒకరినొకరు పలకరించు కునే సమయం చిక్కడం లేదంటే కుటుంబాలు ఎంతగా విచ్ఛిన్న మయ్యాయో అర్థం చేసు కోవచ్చు. ఉమ్మడి కుటుంబాలలో కలిసి మెలిసి మనగలిగే మనస్తత్వాలు లోపించి పెళ్లయిన మరు నాడే వేరు కాపురాలు పెట్టుకుని జంటలుగా ఒంటరై పోతున్నారు. దీంతో సలహా లిచ్చే పెద్ద దిక్కులు లేకపోవడం, ఆపదలో ఆదుకునే ఆత్మీయులు దూరం కావడం, కనీసం మనసు లోని బాధలను పంచుకునే బంధువులు కరువవ్వడం నేటి సమాజంలో మనకు నిత్యం కని పించే దృశ్యం. కుటుంబాలలో నెలకొన్న విభేదాలను తొలగించి ఆయా కుటుంబాలలో సుఖ శాంతులు నెలకొల్పడం కోసం స్వచ్ఛంద సంస్థలు కూడా కృషి చేయాల్సి ఉంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595494**

# లక్ష్మణ రావు భౌతిక కాయానికి నివాళులర్పించిన టీడబ్ల్యూజేఎఫ్ నేతలు

## -లక్ష్మణ రావు మరణం జర్నలిజానికి తీరని లోటు




హైదరాబాద్,డిసెంబర్ 31: అనారోగ్యంతో మరణించిన సీనియర్ జర్నలిస్టు టీకే లక్ష్మణ రావు భౌతిక కాయానికి తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) నాయకులు నివాళులర్పించారు. ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య బుధవారం మధ్యాహ్నం గోపన్నపల్లిలోని జర్నలిస్టు కాలనీలో గల ఆయన నివాసానికి వెళ్లి లక్ష్మణ రావు భౌతిక కాయంపై పూలమాల ఉంచి నివాళులర్పించారు. ఆయనతో పాటు ఫెడరేషన్ రాష్ట్ర కో-కన్వీనర్, ఐఎఫ్ డబ్ల్యూజే కార్యదర్శి పులిపలుపుల ఆనందం, రాష్ట్ర నాయకులు కె.పాండురంగారావు లు కూడా లక్ష్మణ రావు భౌతిక కాయానికి నివాళులర్పించారు. ఈ సందరరేగా శోకసంద్రంలో ఉన్న లక్ష్మణ రావు సతీమణి లక్ష్మీప్రసన్న,కుమారుడు శరత్ చంద్ర లను ఓదార్చారు. సీనియర్ జర్నలిస్టు, ప్రెస్ అకాడమీ మాజీ ఛైర్మన్,రాష్ట్ర బీసీ కమీషన్ సభ్యులు తిరుమలగిరి సురేందర్, సహ జర్నలిస్టులు రమణ్ రావు, మహారధి దయానంద్,యాజులు, శ్రీనివాస్ రెడ్డి తదితరులు నివాళులర్పించారు. సాయంత్రం ఫిలిం నగర్ లోని మహాప్రస్థానంలో లక్ష్మణ రావు అంత్యక్రియలు జరిగాయి.

**లక్ష్మణరావు సేవలు మరువలేనివి -మామిడి సోమయ్య...** సీనియర్ పాత్రికేయులు టీకే లక్ష్మణ రావు అత్యంత సౌమ్యుడని, పత్రికారంగంలో ఆయన సేవలు మరువలేనివని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) వ్యవస్థాపక అధ్యక్షుడు, రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య కొనియాడారు. దాదాపు నలభై ఏళ్లకు పైగా జర్నలిజం వృత్తిలో పలు ప్రముఖ పత్రికల్లో పని చేసిన లక్ష్మణ రావు ఎంతోమంది జర్నలిస్టులకు చేయూతనిచ్చారని, అనేక మందికి అక్షరాలు నేర్పించి ఉత్తమ జర్నలిస్టులుగా తీర్చిదిద్దారని అన్నారు.

ఉదయం, వార్త, సాక్షి దినపత్రికల్లో ఉన్నత పదవుల్లో పనిచేసిన ఆయన ఎంతో మంది జర్నలిస్టులకు ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో జర్నలిస్టుల పక్షాన నిలిచి ఆంధ్ర ప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ స్థాపనకు తోడ్పడ్డారని ఆయన గుర్తు చేశారు. లక్ష్మణ రావు మరణం పత్రికా రంగానికి, జర్నలిజం వృత్తికి తీరని లోటని పేర్కొంటూ నివాళులర్పించారు.

# సీఎం చంద్రబాబు కేసులో తీర్పు ప్రతులు ఇచ్చేలా ఆదేశించండి: హైకోర్టును ఆశ్రయించిన సువర్ణరాజు




అమరావతి, డిసెంబర్ 31: ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడిపై నమోదైన కేసుల రికార్డులకు సంబంధించి తీర్పు ప్రతులను ఇవ్వాలంటూ ఏసీబీ ప్రత్యేక కోర్టును ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు సువర్ణ రాజు ఇటీవల ఆశ్రయించారు. వీటిని ఇచ్చేందుకు సదరు కోర్టు నిరాకరించింది. ఏసీబీ ప్రత్యేక కోర్టు నిర్ణయాన్ని సవాల్ చేస్తూ ఏపీ హైకోర్టులో సువర్ణరాజు పిటిషన్ దాఖలు చేశారు.

ఈ పిటిషన్‌పై బుధవారం హైకోర్టులో విచారణ జరిగింది. ఈ కేసుకు సంబంధించిన వివరాలు సమర్పించాలంటూ ఏపీ సీఐడీని కోర్టు ఆదేశించింది. అనంతరం ఈ కేసు విచారణను వారం రోజులకు వాయిదా వేస్తూ నిర్ణయం తీసుకుంది.

**ఇంతకీ ఏం జరిగిందంటే..** గత వైసీపీ ప్రభుత్వం.. నాటి ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడిపై స్కిల్ డెవలప్‌మెంట్, ఫైబర్ నెట్ కేసులు నమోదు చేసింది. ఫైబర్ నెట్ కేసును విజయవాడ ఏసీబీ కోర్టు ఇటవల కొట్టివేసింది. స్కిల్ డెవలప్‌మెంట్ కేసును సైతం సీఐడీ మిస్టేక్ ఆఫ్ ఫ్యాక్ట్ అంటూ నోటీసు జారీ చేసింది. దాంతో ఈ కేసుల మూసివేతకు సంబంధించిన కోర్టు రికార్డులు, తీర్పు ప్రతులను తనకు అందించాలంటూ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందవ సువర్ణరాజు ఏసీబీ కోర్టులో పిటిషన్ వేశారు. ఆయన పిటిషన్‌ను ఏసీబీ ప్రత్యేక కోర్టు తిరస్కరించింది. దాంతో ఆయన ఏపీ హైకోర్టును ఆశ్రయించారు.

# "మహిళా విద్య చైతన్య దీప్తి" సావిత్రి బాయి పూలే

## (జనవరి 3న సావిత్రి బాయి పూలే 195వ జయంతి సందర్భంగా)

సాంఘిక 'సామాజిక'రాజకీయ రంగాల్లో నూతన ఉత్తేజానికి అభ్యుదయ రకరమైనఆలోచనలకు విద్య ఆయుధం లాంటిది. మహిళా విధ్యావ్యాప్తితో మహిళా హక్కుల రక్షణ ఉద్యమ ప్రథాతగా సావిత్రి బాయి పూలే చరిత్రలో చిరస్మర ణీయులుగా నిలవడం గమనార్హం. నాటి సమాజంలో వేళ్ళూనుకున్న పితృస్వామ్యవ్యవస్థకువ్యతిరేకంగా పోరాడుతూ కుల పునాదులను కూకటివేళ్లతో పెకిలించి అంటరాని వారిగా ముద్రపడిన మహిళలు శూద్రులహక్కుల కోసం పోరాటం చేసిన దీరవనిత. సావిత్రిబాయిపులే గొప్ప రచయిత సంస్కరణవాది సావిత్రిబాయి. పూలే స్త్రీ పురుషులు కులమతాలకు అతీతంగా చదవాలి .అందరూ సమానంగా బతకాలని అనునిత్యం తపించిన సామాజిక విప్లవ మూర్తి సావిత్రిబాయి పూలే .

**మొదటి మహిళా ఉపాధ్యాయురాలు బి సావిత్రీ బాయి పూలే...** సావిత్రిబాయిపూలే ఆధునిక భారతదేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు. స్త్రీల విద్యా వ్యాప్తికి కృషి చేసిన తొలి తరం మహిళా ఉద్యమకారిణి. స్త్రీల విముక్తి కోసంఅహర్నిశలుశ్రమించిన నాయకురాలు.గొప్పసంఘసంస్కర్త' రచయిత్రి' స్త్రీ' పురుషులుకులమతాలకు అతీతంగా విద్యను అభ్య సించాలని విద్య సహజమైన హక్కుగా ఉంటుందని అందుకే అందరు చదువుకోవాలని అందరు సమానంగా బ్రతకాలని నిరంతరం తపించిన సామాజిక విప్లవ మాత్రు మూర్తి పూలే.నాటి నేటికీ సమాజంలో సావిత్రిబాయి పూలే వ్యక్తిత్వం ప్రభావశీలమైంది.

**సావిత్రిబాయి పూలే జననం...** మహారాష్ట్రలోని సతారా జిల్లా నమ్ గావ్ లో 1831 జనవరి 3న సావిత్రిబాయి జన్మించింది.

**సావిత్రిబాయి పూలే బివివాహం...** 1840 లో 9ఏళ్ళవయసులో సావిత్రిబాయి పూలేకు 12 ఏళ్ల జ్యోతిరావు పూలే తో వివాహం జరిగింది.ఈ వివాహం సమాజానికి గొప్ప మేలుచేసింది. సామాజిక చైతన్యానికి మేలుకొలుపు అయ్యింది.ఈ జంట పూజారికి కట్న కానుకలు లేకుండా అతి తక్కువఖర్చుతోపెళ్లిచేసుకున్నారు.

**సావిత్రిబాయి పూలే విద్యాభ్యాసం..** సావిత్రి బాయి పూలే విద్యాబ్యాసం పెళ్లి తర్వాత ప్రారంభమైంది. సావిత్రి బాయి పూలే చదువుకొవా నే తపనను చూసి భర్త స్వయంగా రాయడంనేర్పించాడు. సావిత్రిబాయిపూలే4వతరగతిలోఉత్తీర?తసాధించింది.జ్యోతి రావు పూలే సావిత్రి బాయి పూలే కు తొలిగురువైనాడు.

**జ్యోతిరావు మిత్రుల సహకారం సావిత్రిబాయి పూలే విద్యాభ్యాసం...** జ్యోతిరావు మిత్రులు సఖరాంయశ్వంత్ కేశవ శివరాం భావెల్కర్ సహాయముతో అహ్మద్నగర్ ఫారార్స్ సంస్థలో పూణే లోని MS మిచెల్ నిర్మల్ స్కూల్లో టీచర్స్ ట్రైనింగ్ స్కూల్లో సావిత్రిబాయి పూలే చదువు కోవటానికి సహకరించారు.

1847 నాటికి భర్తతో కలిసి బాలికల కోసం పూనేలో మొదటి పాఠశాల ప్రారంభించింది. పాఠశాల నడపడం కొందరికి నచ్చలేదు.

**ధైర్యం పట్టుదలకు నిదర్శనం బి సావిత్రిబాయి పూలే...** పాఠశాల నడపడంలో సావిత్రి బాయి అనేక ఇబ్బందులకు అవమానాలకు గురైంది. శూద్రుల విద్యాభివృధికొరకు ఆమె చేస్తున్న పని నచ్చలేదు. ఆమెపై భౌతిక దాడులు చేశారు. పాఠశాలకు నడిచే దారిలో ఆమెపై బురద చల్లడం' రాళ్లు విసరడం

అసభ్య పదజాలాన్ని వాడటం అనేక ఇబ్బందులకు గురి చేశారు. బురదతో మలినమైన చీరను పాఠశాలకు వెళ్లిన తర్వాత మార్చుకొని మళ్ళీ తిరిగి ఇంటికి వచ్చేటప్పుడు బురధ చీరకట్టుకొని వచ్చేది. ఎవరైనా అడిగినప్పుడు ధైర్యంగా నా విధిని నేను నిర్వహిస్తున్నాను అని చెప్పేది. పట్టు వీడక అవమానాలకు వెరువక వారు సాగించిన విద్యా ఉద్యమానికి తక్కువ కాలంలోనే గుర్తింపు వచ్చింది. స్త్రీ విద్యాభివృదికి కృషి చేసిన తొలి తరం ఉద్యమకారిణి. మాంగ్ మహర్ బాలికల కోసం పాఠశాలను ప్రారంభించారు.వీరి కృషికి సమాజంనుంచిసహకారంలభించింది. సమాజ భాగస్వామ్యంబి విద్యాభివృద్ధిలి విద్యాభివృద్ధి కొరకు సావిత్రిబాయి పూలే చేసిన కృషికి సమాజం నుండి దాతల నుండి సహకారం లభించింది. విద్యాభివృద్ధిలో సమాజ భాగస్వామ్యాన్ని పెంచింది. విద్యాభివృద్ధి కొరకు మంచి ప్రోత్సహిం లభించింది. ఒకరు తమ ఇంటి ఆవరణను బడి కోసం ఇస్తే. కొంతమంది పుస్తకాలను సేకరించారు. మోరే విఠల్' వాల్వేకర్ ' దియోరావు వంటి ప్రముఖులు పాఠశాల నిర్వాహణకు సహకరించారు. 1851లో బాలికలపాఠశాల ప్రారంభించారు. బాలికల చదువు కోసం విద్యాభివృద్ధి కోసం సహకరించాలని చేసిన విజ్ఞప్తికి స్పందిస్తూ సమాజంలో చాలామంది సహకరించారు.

**రైతులకోసం రాత్రి పాఠశాల...**సావిత్రిబాయిపూలే దంపతులు 1855లో పూణేలో వ్యవసాయ కూలీల కోసం రాత్రి పాఠశాల ప్రారంభించారు. వ్యవసాయ విధానాల మీద అవగాహన కల్పించే వారు.

**ఉపకార వేతనాలు** సావిత్రిబాయి పూలే మధ్యలో బడి మానేసిన బాలకార్మికుల కొరకు ఉపకార వేతనాలు ఇచ్చే పద్ధతిని ప్రారంభించారు.

**వేగుచుక్క బిసావిత్రీ బాయి పూలే...** సావిత్రిబాయి అన్ని వర్గాల మహిళలకు విద్యను అందించిన తొలి మహిళా ఉపాధ్యాయురాలు. మూఢనమ్మకాలు రాజ్యమే లుతున్న కాలంలో వేగుచుక్కలాగ ఉదయించిన సావిత్రిబాయి పూలే నిరంతర సామాజిక చైతన్యంతో మహిళా హక్కుల రక్షణ సాధికారిత ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించారు . సావిత్రీ బాయిపూలే విద్యా విప్లవ శక్తిలి జ్యోతిరావు పూలే సావిత్రిబాయి పూలే సాంఘిక విద్యా విప్లవ శక్తి వీరి ద్వారా సూర్తి పొందిన అంబేడ్కర్ భారత రాజ్యాంగంలో విద్యను ప్రాథమిక హక్కుగా చేర్చడం వల్ల సమాజంలో అన్ని వర్గాల వారికి విద్య అందుబాటులోకి వచ్చింది. పూలే దంపతులు 1848 జనవరి 1న పూణేలోని బుధవార పేటలో బాలిక పాఠశాల స్థాపించి తొలి మహిళా ఉపాధ్యా యురాలిగా విప్లవాత్మక మార్పులకు నాంది పలికింది. సాంప్రదాయాలు అవమానాలు 'ఛీత్కారాలను స్త్రీలను బానిసలుగా చూసే పితృస్వామ్య 'ఫూడల్ వ్యవస్థ' ప్రగతి నిరోధక శక్తుల ను ఆడ్డుకొని విద్య సహజ హక్కని అందరు చదువాలని తపించిన సామాజిక విప్లవ మూర్తీ సావిత్రి బాయ్ పూలే సంకల్పించిన కార్యదీక్షతో మొక్కవోని ధైర్యంతో శూద్రులకు అతి శూద్రులకు విద్యను అందించిన విద్యా ఉద్యమ ప్రదాత . గ్రామీణ ప్రాంతాలలో బాలికలకు52 పాఠశాలలు స్థాపించి మధ్యాహ్న భోజన వసతి కల్పించి మహిళ విద్య సామాజిక సంపదగా బావించారని విజ్ఞానం వికాసం సమాజానికి వెలుగు లాంటివని 'సావిత్రి బాయి పూలే చైతన్య శక్తిగా ప్రజాతంత్ర విద్యా విప్లవ ప్రదాతగా చరిత్రలో నిలవడం గమనార్హం.

**మహిళా సంఘంస్థాపన...** మహిళా సేవ మండల్ పేరిట మహిళా సంఘాన్ని 1852 లో స్థాపించారు. వితంతువుల పట్ల వివక్ష 'అక్రమ సంతానం పేరిట శిశువుల హత్యలకు వ్యతిరేకంగా అనేక పోరాటాలు నడిపారు. అనాథ బాలలు 'బాలికలు అందరూ తమ బిడ్డలేనని భావించారు. 1874లో కాశీ బాయి అనే ఒక బ్రాహ్మణ వితంతు బిడ్డను పూలేదంపతులు దత్త పుత్రుడిగా స్వీకరించారు. దీని ద్వారా సమాజానికి ప్రగతి శీల సందేశం ఇచ్చారు.అతనికి యశ్వంత్ అనే పేరు పెట్టి చదివించి డాక్టర్ ను చేశారు. కులాంతర వివాహాలులి ముఢాచారలకు వ్యతిరేకంగా జ్యోతి రావు మరణాంతరం సత్యశోధక సమాజ ద్వారా సంస్కరణల ఉద్యమాన్ని కొనసాగించారు.

1873లో సత్యశోధక్ సమాజం మహిళావిభాగం పేరిట కులాంతర వివాహాలు జరిపించారు. భార్యని కోల్పోయిన ఒక యువకుడికి తన స్నేహితురాలి బిడ్డ తో పెళ్లి చేశారు. సావిత్రిబాయి భర్తతో పాటు తాను కూడా కష్టాల్ని అవమానాలు సహించింది. సావిత్రిబాయి ప్రపంచ చరిత్రలోనే భర్తతోపాటు ఉద్యమ జీవితంలో కలిసి నడిచిన ఆదర్శ సహచరిగా నిలిచిపోయింది. సావిత్రిబాయి తన వ్యక్తిగత జీవితాన్ని త్యాగం చేసి విద్యా బోధనకు బాలికల అభివృద్ధికి అంకితమైంది. సాంఘిక దురాచారాల నిర్మూలన కోసం పెద్దలతో ఘర్షణపడినసంఘటనలు అనేకంచోటుచేసుకున్నాయి. జ్యోతిరావు పూలే వితంతువుల వివాహాలను సమర్థిస్తే సావిత్రిబాయి పూలే బాల్య వివాహాలు సతీ సహగమనం సాంఘిక దురాచారాలకు వ్యతిరేకంగా పనిచేశారు.

**ఆశ్రమాల ఏర్పాటు...** అనాథ స్త్రీలకు పిల్లలకు ఆశ్రమాలు ఏర్పాటు చేశారు. సత్యశోధక సమాజంలో మహిళ విభాగం ఏర్పాటు చేసే కులాంతర వితంతువుల వివాహాలను ప్రోత్సహించారు. 1890లో భర్త జ్యోతిరావు పూలే మరణిస్తే అంత్యక్రియలు జరిపే సందరరేలో బంధువులు' దత్తపుత్రులు ఘర్షణ పడుతుంటే తానే చితికినిప్పు అంటించారు.ఆమె తెగువకు యావత్ భారత దేశం దిగ్గ్రారేతి చెందింది.

**మహిళా సాధికారితబి సావిత్రిబాయి పూలే...** ఆధునిక ఆంగ్లవిద్యనుఅభ్యసించిన తొలి ఉపాధ్యాయురాలు సావిత్రి బాయి పూలే .బోధనలో సమాజ సేవలో ముందుండేవారు .మహిళల సాధికారిత కోసం ఎనలేని కృషి చేశారు. మహిళా మండలి స్థాపించారు. మహిళా సమస్యలు హక్కులు కోసమే కాకుండా అంటరానితనానికి వ్యతిరేకంగా పోరాటాలు చేశారు. చిన్న వయసులో భర్త చనిపోయి నిరాశ్రయులైన వారికోసం బాల హత్య ప్రతిబంధక్ పేరుతో ఒక గృహాన్ని సావిత్రిబాయి పూలే ప్రారంభించారు. ఈ గృహంలో భర్త చనిపోయిన బాల వితంతువులకు అనేకమంది అనాధలకు ఆశ్రమం కల్పించారు.

**సావిత్రిబాయిపులే గొప్ప రచయిత...**1854లో కావ్యపూలే అనే కవిత సంపుటిని రచించారు. అభంగ్ పేరున పుస్తకాన్ని ప్రచురించారు. ఈ పుస్తకం ఆనాటి పరిస్థితులకు అద్దం పుట్టింది. ప్రకృతి వర?న ప్రకృతి రక్షణ జానపదుల స్థితిగతులను విస్తృతంగా అధ్యయనం చేశారు .1891 లో ప్వాన్వాశీ శుభోద్ రత్నాకర్ 11 పేరిట ప్రచురించిన కవిత సంపుటి విద్యాభివృద్ధిపై తల్లిదండ్రులు యొక్క సమిష్టి కృషిని గుర్తించింది. శ్రీవిద్య ప్రాముఖ్యతపై కవితలు రాశారు. కుల వివక్ష మత వివక్ష

లింగ వివక్ష తాత్వికత చరిత్ర విద్య గురించి విస్తృత రచనలు చేశారు. 1893లో బాలహత్య ప్రతిభంధక్ అనే సంరక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఇదీ దేశంలోనే మొదటిది కావడం గమనార్హం . పాతకాలపు సాంప్రదాయాలను వ్యతి రేకించి ఆధునికతవైపు సమాజాన్ని జాగృతపర్చిన సావిత్రిబాయి పూలే సంస్కరణలు వారసత్వంగా తీసుకొని నేటి తరం ముందుకు పోవాలి. సామాజిక ఉద్యమ కారిణిలి సావిత్రి బాయిపూలే అంటరానితనం 'అస్పృశ్యత 'ఆడశిషువుల హత్య' సతి' బాల్య వివాహాలు 'వైధవ్యం వితంతువుల వివాహాలు'మూఢనమ్మకాలనురూపుమాపడానికిఉద్యమాలుచేశారు .అత్యాచార బాధితులకు ప్రత్యేక సంస్థ స్థాపించారు. కార్మిక స్త్రీల హక్కుల పోరాటం లో కీలక పాత్ర పోషించారు. వారి సూర్తితో మహిళా సంఘాలు యువజన సంఘాలు సమాజంలో ఉన్న లింగ వివక్షతను' వేతన వ్యత్యాసాలను కుల వివక్షతను రూపిమాపి కుల రహిత సమాజ స్థాపనకు చేసే కృషియే సావిత్రిబాయి పూలే ఆశయాల సాధనకు నిజమైన కార్యాచరణ అని "మహిళా హక్కులే మానవహక్కులు "అని తొలిసారి నినదించిన ధీశాలి సావిత్రి బాయ్ పూలేను మహిళా లోకం సూర్తిగా తీసుకొని మహిళా వికాసానికి చైతన్యానికి మహిళా సంక్షేమానికి ఉద్యమించాలి. అగ్రవరా?ల దురహంకార నిచ్చెన మెట్ల కుల వ్యవస్థ వేళ్లూనుకున్న సామాజికఅంతరాలుదురాచారాలను అంతం చేయడానికి చివరి వరకు పోరాడిన సావిత్రిబాయి పూలేను మహిళలు 'యువత విద్యార్థులు ఆదర్శంగాతీసుకోవాలి.

**ప్రభుత్వాలకుబి దిశ దశ కావాలి..** స్వేఛ్ఛ సమానత్వం 'సౌభ్రాతృత్వం మహిళా విద్య మహిళా హక్కులు రక్షణ అందరికీ ఉచితంగా ఉన్నత విద్య ఇవ్వాలని సావిత్రి బాయ్ చేసిన భోధనలు ప్రభుత్వాలకు నూతన దిశ దశ కావాలి . దేశ జనాభాలో 50 శాతం వున్న మహిళలకు విద్య అందించి లింగ వివక్షతను స్త్రీ పురుష అసమానతలు అంతం చేయటానికి విద్య ఆయుధం లాంటిదని బాలికలకు మహిళకు ఉచిత విద్య వృత్తి విద్యఅందించాలి.చట్టసభల్లో మహిళా రిజర్వేషన్స్ చట్టాలు అమలుచేయాలి.మహిళలో ఆర్థిక స్వశక్తి సాధికారిత సాధన కు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను ప్రభుత్వాలు అమలు చెయ్యాలి. లిప్లేగు వ్యాధి సావిత్రి బాయి మరణంలి 1890లో ప్లేగు వ్యాధి బారినపడిన పిల్లల కోసం వైద్య శిబిరాలను నిర్వహించారు.1896 లో ప్లేగు వ్యాధి నివారణకు విరాళాలు సేకరించారు. మహారాష్ట్రలో 52 ఉచిత ఆహార వసతి గృహాలు ఏర్పాటు చేశారు. తమ కుమారుడు యశ్వంత్ వైద్యుడిగాసేవలుఅందించాడు. దురరేమైన కరువు పరిస్థితుల్లో కూడా రోజుకు 2000 మందికి పిల్లలకు భోజనాలు పెట్టించిన సావిత్రిబాయి పూలే 1897 వ సంవత్సరం మార్చి 10 ఒక పిల్లవాడికి సేవ చేస్తుండగా ఆమెకు ప్లేగు వ్యాధి సోకి మరణించింది.

లివిద్య సహజ హుక్కులి అని సమాజంలో అన్ని వర్గాలకు విద్య అందాలని సామాజిక అభివృద్ధిలో విద్య ప్రామాణికతను గుర్తించిన సావిత్రి బాయ్ పూలే ఆశయాల సాధనకు ప్రభుత్వాలు విద్యా విధానాన్ని అమలు చేయాలి. ప్రభుత్వాలు బహుజనులకు ఉచిత విద్య అందించి సామాజిక ఉన్నతికి పాటుపడాలి.



**నేదునూరి కనకయ్య**
రాష్ట్ర అధ్యక్షులు
తెలంగాణ ఎకనామిక్ ఫోరం
తెలంగాణ వికాస వేదిక
తెలంగాణ ఎడ్యుకేషన్ ఫోరం
సామాజిక ఆర్థిక అధ్యయన వేదిక
9440245771
కరీంనగర్

చురకలు



# సీఎండీకే 'షాక్'

హైదరాబాద్: విద్యుత్తు సంస్థలో కొందరు సిబ్బంది, అధికారుల అక్రమాలపై ఫిర్యాదులు రావడంతో విచారణ చేపట్టి బాధ్యులైన వారిపై చర్యలకు విజిలెన్స్ విభాగం సిఫార్సు చేసింది. నివేదిక ఆధారంగా క్రమశిక్షణ చర్యలకు ఆదేశించి నెలలు గడుస్తోంది. అయినా చర్యలు తీసుకోకపోవడంపై ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ ఇటీవల ఓ సమావేశంలో ఆగ్రహం వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో ఏఈ, పైస్థాయిలో సీఎండీకి తప్ప మధ్యలో ఎవరికీ బాధ్యతలు పట్టవా అంటూ అసహనం వ్యక్తం చేశారు. అవినీతికి పాల్పడటం, అనుమతి లేకున్నా, సరైన పత్రాలు లేకుండా విద్యుత్తు కనెక్షన్లు, మీటర్లు ఇవ్వడం, ఆక్యుపెన్సీ పత్రం లేకుండా బహుళ అంతస్తులకు కరెంట్ సరఫరా చేయడం వరకు కొందరు సిబ్బంది పలు అక్రమాలకు పాల్పడ్డారు. ప్రతి సర్కిల్‌లో ఓ అండ్ ఎం విభాగంపై ఫిర్యాదులు వచ్చాయి. ఏఈ, డీఈలను బాధ్యులను చేశారు.

**సర్కిళ్ల వారీగా ఆదేశాలు ఇలా..**

హైదరాబాద్ సౌత్ సర్కిల్‌లో చర్యలకు నవంబరు 28న ఎస్ఈని ఆదేశించారు. మరో కేసులో అక్టోబరు 10న చర్యలకు సిఫార్సు చేశారు. సంగారెడ్డి సర్కిల్‌లో విజిలెన్స్ విచారణ జరిపి సీఈ చర్యలు తీసుకోవాలని నవంబరు 15న సిఫార్సు చేసినా మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఓసీ లేకుండా బహుళ అంతస్తుల భవనానికి మీటర్ల జారీలో బోయిన్




పల్లి ఆపరేషన్ ఏఈ, ఏడీఈ బోయిన్‌పల్లి ఐఎస్ఎస్ఈ ఏడీఈపై చర్యలకు మెట్రోజోన్ సీఈని ఆదేశించారు.

సైబర్‌సిటీ, రాజేంద్రనగర్ సర్కిళ్లలో బాలాజీనగర్ సెక్షన్ లైన్‌మెన్, కేపీహెచ్‌బీ సెక్షన్ లైన్ ఇన్‌స్పెక్టర్, గతంలో అల్లాపూర్ సెక్షన్‌లో పనిచేసిన ఏఈ, ప్రైవేటు మీటర్ రీడర్, ఇబ్రహీంబాగ్ లైన్‌మెన్‌పై చర్యలకు నవంబరు 6న ఆదేశాలు వెళ్లాయి.

హబ్సిగూడ సర్కిల్‌లో చర్యలకు మేడ్చల్ జోన్ సీఈని ఆదేశించారు. మరో కేసులో అల్విన్‌కాలనీ లైన్‌మెన్, పేట్‌బషీరాబాద్ లైన్‌మెన్‌పై చర్యలకు అక్టోబరు 30న ఆదేశించారు.

ఈ నెల 3న సరూర్‌నగర్ సర్కిల్‌లో చర్యలకు రంగారెడ్డి జోన్ సీఈని ఆదేశించారు. మేడ్చల్‌సర్కిల్‌లో కేటగిరీ-8 కింద కాకుండా కేటగిరీ 1, 2 కింద కనెక్షన్ల జారీ, డిస్కం ఆదాయానికి గండి కొట్టడంతో కూకట్‌పల్లి లైన్‌ఇన్‌స్పెక్టర్, ఏఈ, ఏడీఈ, బాచుపల్లి లైన్‌ఇన్‌స్పెక్టర్, ఏఏఈ, ఏడీఈ, మియాపూర్ ఏడీఈపై చర్యలకు ఆదేశించారు.

# జాతీయ వనం.. మురుగు కూపం

మన్సూరాబాద్: విశాలమైన పచ్చని వనంలో వన్యప్రాణులు స్వేచ్ఛగా ఉండే పరిస్థితి క్రమంగా తగ్గిపోతోంది. సమీప ప్రాంతాల మురుగు వెళ్లేందుకు సరైన డ్రైనేజీలైన్ లేకపోవడంతో మురుగు అడవిలోకి వస్తోంది. జాతీయ వనంలోని కొంత ప్రాంతం మురుగు కూపంగా మారిపోతోంది. మురుగు, వర్షపు నీరు అటవీప్రాంతంలోని చెరువులోకి చేరుతోంది. ఆ నీరు కొన్ని రకాల జంతువులకు ప్రాణాంతకంగా మారుతోంది. ఈ సమస్య 20 ఏళ్లుగా ఉన్నా.. ఈ ఏడాది అధిక వర్షాలతో మరింత ఇబ్బందికరంగా మారింది. సమస్యకు పరిష్కారం చూపించడంలో ఆటోనగర్, అటవీశాఖ, జీహెచ్ఎంసీ అధికారులు విఫలమవుతున్నాయి. అక్కడే కొంతమంది ట్యాంకర్లతో రసాయనాలు తీసుకొచ్చి వదిలేస్తున్నారు.

**చెట్లు ఎండిపోయి..:** మురుగు, వ్యర్థాలతో సుమారు 15 ఎకరాల అటవీ స్థలం నిండిపోయింది. మురుగు ఉన్న చోట చెట్లు ఎండిపోయాయి. వన్యప్రాణులకు జరిగే నష్టం వివరాలను అధికారులు బయటపెట్టడం లేదు. ఆటోనగర్ పారిశ్రామిక వాడలో మురుగు శుద్ధి కేంద్రం నిర్మించినా సమస్య పరిష్కారం కాలేదు. దాని సామర్థ్యం తక్కువగా ఉండటం, నిర్వహణ లోపంతో మురుగు అలాగే బహిరంగ ప్రదేశంలోకి వెళ్లిపోతోంది.

ఆటోనగర్ పారిశ్రామికవాడ నుంచి వరద కాలువ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. దాన్ని సౌత్ ఎండ్ పార్కు కాలనీ దాకా నిర్మించి వదిలేశారు. పనులు పూర్తి చేస్తే అడవిలోకి మురుగు వెళ్లకుండా నివారించవచ్చు.

మహావీర్ హరిణ వనస్థలి జాతీయ ఉద్యానవనం: 14.50కి.మీ విస్తీర్ణంలో ఉంది. విజయవాడ జాతీయ రహదారి పక్క నుంచి కుంట్లూర్, బండ్లగూడ, మన్సూరాబాద్, తట్టిఅన్నారం, మర్పల్లి, కుత్బుల్లాపూర్ ప్రాంతాల్లో విస్తరించింది.

**వన్యప్రాణులు:** చుక్కల జింకలు: 1000, కృష్ణ జింకలు: 500, దుప్పులు, నెమళ్లు: లెక్కలు లేవు. కుందేళ్లు, పక్షులు ఎక్కువ సంఖ్యలో ఉన్నాయి.

**బెజవాడ సాయిప్రకాశ్, ఎఫ్ఆర్వో**

మురుగు వద్దకు జంతువులు రాకుండా కంచె ఏర్పాటు చేశాం. రసాయన ట్యాంకర్లు రాకుండా నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. ప్రహరీ పూర్తయితే మురుగు రాకుండా ఉంటుంది.

# ఆకాశహర్మ్యాల్లో.. అగ్నిని ఆర్పేదెలా?

హైదరాబాద్: బృహత్‌నగరంలో సూపర్ హైరైజ్ భవనాలు రాబోతున్నాయ్.. ప్రస్తుతం నగరంలోని అత్యధిక ఎత్తయిన భవనం కోకాపేట్‌లో(60 అంతస్తుల భవనం) ఉండగా త్వరలో ఘట్‌కేసర్‌లో 72 అంతస్తుల భవనం నిర్మించబోతున్నారు. ప్రొవిజినల్ ఎన్వోసీ కోసం దరఖాస్తు చేసుకోగా.. అనుమతులు జారీ చేసినట్టు అగ్నిమాపకశాఖ డైరెక్టర్ జనరల్ విక్రమ్‌సింగ్‌మాన్ ఇటీవల వెల్లడించారు. దక్షిణాసియాలోనే ఇంత ఎత్తయిన భవనం లేదన్నారు. ఇలాంటి భవనాల్లో ప్రమాదాల సమయంలో మంటలార్పే అధునాతన పరికరాలు ఇకపై కొనుగోలు చేస్తామని, సాంకేతికతను వినియోగించుకుంటామని తెలిపారు. 850కి పైగా ఎత్తయిన భవనాలు.. ఎత్తయిన భవనాల విషయంలో ముంబయి తర్వాత రెండోస్థానంలో కొనసాగుతుండగా.. ప్రస్తుతం నగరంలో 850కి పైగా ఎత్తయిన భవనాలున్నాయి. అయితే మంటలు ఆర్పే బ్రాంటోస్కై లిఫ్ట్ వాహనాలు కేవలం 54 మీటర్ల ఎత్తు వరకు (18 అంతస్తులు) మాత్రమే సేవలందిస్తాయి. 72 అంతస్తుల వరకు (220 నుంచి 250 మీటర్ల ఎత్తు) సేవలందించే వాహనాలు, పరికరాలు కొనుగోలు చేయాల్సిన అవసరం ఉంది. 72 అంతస్తుల భవనానికి బయటి నుంచి మంటలార్పే వ్యవస్థ లేనందున పూర్తిగా లోపలి వ్యవస్థలపైనే ఆధారపడాల్సి ఉంటుంది. 2030 నాటికి 112 నుంచి 120 మీటర్ల ఎత్తున్న బ్రాంటో స్కై లిఫ్ట్, 150 మీటర్ల టర్న్‌టేబుల్ లాడర్, ఫైర్ ఫైటింగ్ డ్రోన్‌లు, అగ్నిమాపక సిబ్బంది సహాయక చర్యల్లో బరువు మోసేందుకు ఉపయోగపడే ఎకోస్కెలిటన్ సూట్‌లు కొనుగోలు చేయాల్సిన అవసరం ఉంది. దేశంలో ఏ నగరంలోనూ 100 మీటర్ల పైన మంటలను బయటి నుంచి ఆర్పే వ్యవస్థ లేదు. లోపలున్న స్ప్రింక్లర్, రైజర్, ప్రెజరైజేషన్ వ్యవస్థలపైనే ఆధారపడాలి.

# 'చెక్' పవర్ దుర్వినియోగమైతే వేటే!



కొత్తగూడెం : పంచాయతీ పాలకవర్గంలో సర్పంచి, ఉప సర్పంచికి సంయుక్తంగా చెక్ పవర్ ఉంటుంది. పంచాయతీ అవసరాలు, అభివృద్ధికి ఖర్చుచేసే ప్రతి రూపాయికి ఇద్దరి ఆమోదం తప్పనిసరి. అయితే సంతకాల చుట్టూ జరిగే రాజకీయాలు, పొరపాట్లు ఒక్కోసారి వారి పదవులకే ఎసరుపెడతాయి. అశ్వారావుపేట నియోజకవర్గంలోని ఓ మేజర్ గ్రామపంచాయతీకి చెందిన సర్పంచి, ఉపసర్పంచి చెక్ పవర్‌ను గతంలో కలెక్టర్ రెండు నెలల పాటు రద్దు చేశారు. బ్లీచింగ్ పౌడర్ కొనుగోళ్లలో అవకతవకలకు పాల్పడ్డారనే వార్డు సభ్యుల ఫిర్యాదు మేరకు విచారణ జరిపారు. రూ.5లక్షలు అదనంగా చెల్లించినట్లు నిర్ధారించి సర్పంచి, ఉప సర్పంచి చెక్ పవర్‌ను రద్దు చేశారు.

అనేక గ్రామాల్లో సర్పంచి, ఉప సర్పంచి మధ్య ఆధిపత్య పోరు నడుస్తుంటుంది. సర్పంచి చేసే పనులకు ఉప సర్పంచి సంతకం పెట్టకపోతే నిధులు నిలిచిపోతాయి. కొన్నిసార్లు సర్పంచి చేసే పనులు సక్రమంగా ఉన్నా.. రాజకీయ కారణాలతో ఉప సర్పంచి సంతకం పెట్టకుండా అభివృద్ధికి అడ్డుపడ్డారనుకుందాం.. అలాంటప్పుడు ఉప సర్పంచి చెక్ పవర్‌ను రద్దు చేయటమే కాకుండా పదవి నుంచి తొలగించే అధికారం కలెక్టర్‌కు ఉంటుంది.

**ఇలా చేస్తే పదవికి గండమే..**

పంచాయతీ నిధులను వ్యక్తిగత అవసరాలకు వాడినా, పనులు చేయకుండా బిల్లులు డ్రా చేసినా, అంచనాలకు మించి ఖర్చు చూపినా నేరం కింద పరిగణిస్తారు. విచారణలో నిధులు దుర్వినియోగమైనట్లు రుజువైతే పంచాయతీరాజ్‌చట్టం ప్రకారం పదవుల నుంచి కలెక్టర్ తొలగించవచ్చు. సర్పంచి, ఉప సర్పంచి సంతకాలను పరస్పరం ఫోర్జరీ చేసినా, అధికారులను మభ్యపెట్టి నిధులు తీసుకున్నా క్రిమినల్ కేసులు నమోదవుతాయి. కేవలం పదవి పోవటమే కాకుండా జైలుశిక్ష పడే అవకాశముంది.

గ్రామసభ తీర్మానాలను అతిక్రమించి నిధుల వినియోగం చెక్కులపై సంతకాలు చేయటాన్ని అధికార దుర్వినియోగం కింద పరిగణిస్తారు. సర్పంచి, ఉప సర్పంచిపై ఫిర్యాదులు అందినప్పుడు కలెక్టర్ విచారణకు ఆదేశిస్తారు. సరైన వివరణ ఇవ్వకపోయినా, లెక్కల్లో తేడాలున్నా.. వారి చెక్ పవర్ రద్దు చేయటం లేదా పదవుల నుంచి తొలగించే అధికారం కలెక్టర్‌కు ఉంటుంది.

**పారదర్శకంగా వ్యవహరించటమే మేలు**

అధికారం బాధ్యతతో కూడుకున్నది. చెక్ పవర్ అనేది ప్రజాధనాన్ని కాపాడేందుకు ఇచ్చిన నమ్మకం. ప్రతిపైసా ఖర్చుకు గ్రామసభ తీర్మానం తప్పనిసరి. నగదు రూపంలో కాకుండా ఆన్‌లైన్ చెల్లింపులకే ప్రాధాన్యమివ్వాలి. నిధుల వినియోగం వివరాలను ఎప్పటికప్పుడు పంచాయతీ దస్త్రాల్లో నమోదుచేయటం వల్ల సర్పంచి, ఉప సర్పంచులు తమ పదవీకాలంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురుకావని రాజకీయ నిపుణులు సూచిస్తున్నారు.

# పోడు భూముల్లో 'జలసిరులు'



ఖమ్మం : గిరిజనుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ప్రవేశపెట్టిన ఇందిర సౌర గిరి జల వికాసం పథకం కింద లబ్ధిదారుల గుర్తింపునకు ఐటీడీఏ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. పట్టాలు కలిగి, నీటి వసతిలేని పోడు భూములను సాగు యోగ్యంగా మార్చటానికి రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకొచ్చింది. ఈఏడాది జూన్‌లో పైలెట్ ప్రాజెక్టులో భాగంగా భద్రాద్రి జిల్లా చంద్రుగొండ మండలం బెండాలపాడులో ఇద్దరు రైతులకు ఈ పథకాన్ని వర్తింపజేసింది. ఆ తరువాత పురోగతి కనిపించలేదు. ఇటీవల ఖమ్మం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో పథకం అమలుకు ప్రతిపాదనలు రూపొందించాలని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశించటంతో గిరిజనుల్లో ఆశలు చిగురించాయి. భద్రాచలం పరిసరాల్లో బురద నేలలు(లూజ్ సాయిల్) ఉండటంతో అక్కడ బోరు వేస్తే కూరుకుపోవచ్చు. గట్టినేలలు లేనిచోట ట్యూబ్ బోర్లు వేసేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. బోర్లు వేస్తే నీళ్లు పడే గ్రామాల వారీగా లబ్ధిదారులను ఎంపిక చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించినట్లు తెలిసింది. 'ఈ నెలాఖరు వరకు కొత్త జీఓ రావొచ్చు. అందుకు అనుగుణంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తాం' అని ఐటీడీఏ పీఓ రాహుల్‌కు తెలిపారు.

**మూడేళ్లలో లబ్ధి..**

భద్రాద్రి జిల్లాలో 62వేలు, ఖమ్మం జిల్లాలో 10వేల మంది రైతులు నీటివసతి లేని పోడు భూములు కలిగి ఉన్నారని అధికారులు గుర్తించారు. 'ఇందిర సౌర గిరి జల వికాసం' కింద రూ.6లక్షలతో ఒక్కో రైతు వ్యవసాయ క్షేత్రంలో బోరు వేసి 5హెచ్‌పీ మోటారు బిగించి నీటివసతి కల్పిస్తారు. విద్యుత్తు సరఫరా కోసం 5కిలోవాట్ల సామర్థ్యమున్న సౌర విద్యుత్తు ప్లాంటు ఏర్పాటుచేస్తారు. బిందుసేద్యం పరికరాలు అందిస్తారు. ఆయిల్‌పామ్ లాంటి ఉద్యాన పంటల సాగుకూ చర్యలు తీసుకుంటారు. మూడేళ్లలోనే అందరికీ పథకం వర్తింపజేయాలని ప్రణాళికలు రచించారు. తొలి ఏడాదిలో ఖమ్మం జిల్లాలో 550, భద్రాద్రి జిల్లాలో 2,921 మంది గిరిజనులకు లబ్ధి చేకూర్చాలని సంకల్పించారు.

**రాష్ట్రస్థాయిలోనే టెండర్లు**

పథకం అమలుకు టెండర్లు పిలవటానికి తొలుత కలెక్టర్ ఛైర్మన్‌గా జిల్లాస్థాయి కమిటీని ఏర్పాటుచేయాలని సర్కారు నిర్ణయించింది. తరువాత రాష్ట్రస్థాయి కమిటీ ద్వారా ఒకేసారి టెండర్లు ఖరారుచేయాలని భావిస్తోంది. గుత్తేదారు ఎంపికపై జీఓను సవరించి కొత్తదానిని విడుదల చేసే అవకాశముందని సమాచారం.

రెండెకరాల పోడు భూములకు ప్రభుత్వం పట్టాలిచ్చింది. నీటివసతి లేకపోవటంతో 'ఇందిర గిరి జల వికాసం' కింద బోరు వేసి మోటారు బిగించింది. విద్యుత్తు స్తంభాలు అందుబాటులో లేకపోవటంతో సౌర ఫలకాలు ఏర్పాటుచేసింది. ఉచితంగా నీరు, విద్యుత్తు వసతి సమకూరటంతో జూన్‌లో ఆయిల్‌పామ్ మొక్కలు నాటాం. వానాకాలంలో అంతర పంటగా పత్తి వేశాం. యాసంగిలో మొక్కజొన్న సాగుచేస్తున్నాం.

రేసు నాగరాజు, బెండాలపాడు, చంద్రుగొండ మండలం

# పల్లెలకు దారిద్ర్యం



ఆత్మకూరు : జిల్లాలోని పలు గ్రామ పంచాయతీలు, అనుబంధ గ్రామాలకు నేటికీ సరైన రహదారి సౌకర్యం లేదు. నిత్యం ప్రజల రాకపోకలకు ఇబ్బందులు పడటంతో పాటు కనీసం అంబులెన్స్ వెళ్లలేని దుస్థితి నెలకొంది. కొన్ని గ్రామాల దారులకు బీటీ ఉన్నా ఏళ్లతరబడి మరమ్మతులు లేక గతుకుల దారులపైనే ప్రయాణిస్తున్నారు. పంచాయతీలకు నూతన పాలకవర్గాలు ఏర్పాటైన నేపథ్యంలో పల్లెలపై పరిశీలన కథనం. చౌటుప్పల్ డివిజన్ కేంద్రం నుంచి లక్కారం గ్రామానికి పూర్వం నుంచి ఉన్న మట్టి రోడ్డు పరిస్థితి మారడం లేదు. రెండు కిలోమీటర్ల ఈ దారి మీదుగా మోడల్ స్కూల్‌కు, లక్కారం గ్రామానికి రాకపోకలు సాగిస్తున్నారు. వర్షం వస్తే విద్యార్థులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. యాదగిరిగుట్ట మండలం కేంద్రం నుంచి దాతారుపల్లి, జంగంపల్లి, లప్పునాయక్‌నాయక్ తండాకు వెళ్లేదారి గుంతలు తేలి, ధ్వంసమై ప్రమాదకరంగా మారింది. మాసాయిపేట-సాదువెల్లి రహదారి కంకర తేలింది. దాతారుపల్లి-మల్లాపురం, అలాగే మాసాయిపేట-పెద్దకందుకూర్ లింక్ రోడ్డు బీటీకి నోచుకోలేదు. దుప్పల్లి-గోపరాజుపల్లి దారి బీటీకి నోచుకోక అడుగడుగునా గుంతలమయంగా మారింది. దారిని కొందరు రైతులు ఆక్రమించడంతో ఇరుకుగా మారింది. దుప్పల్లి పంచాయతీలోని ఎర్రకాల్వ, బొక్కోనిగూడెం ముద్దాపురం గ్రామాలకు బీటీ లేక మట్టిదారులపైనే ప్రయాణిస్తున్నారు. మోటకొండూరు మండలం అబీద్‌నగర్ నుంచి మండల కేంద్రానికి, ఇతర ప్రాంతాలకు వెళ్లాలంటే అమ్మనబోలు మీదుగా ప్రయాణించాల్సిందే. ఇరు గ్రామాల మధ్య మట్టిదారి గుంతలమయంగా మారింది. గుండాల మండలంలో వంగాలకు బీటీ రహదారి లేదు. మట్టిదారిలో ప్రయాణించేందుకు గ్రామస్థులు అవస్థలు పడుతున్నారు. ఆత్మకూరు(ఎం) మండలం సారగండ్లగూడేన్ని 2018లో పంచాయతీగా ఏర్పాటు చేశారు. ఇరు గ్రామాల మధ్య పెద్ద వాగు ఉంది. మండల కేంద్రం నుంచి 15 కి.మీ దూరంలోని సారగండ్లగూడేనికి చేరాలంటే వాగు దాటాల్సిందే. వాగుపై వంతెన లేకపోవడంతో వానాకాలంలో వాగు ప్రవహిస్తే మోత్కూరు మండల కేంద్రం, గుండాల మండలం మీదుగా 28 కి.మీ ప్రయాణించి గ్రామానికి చేరుకోవాలి.

# ఇంకెన్ని ప్రాణాలు పోవాలో!

మెట్‌పల్లి: జిల్లాలో 63వ నంబరు జాతీయ రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. పలు చోట్ల మలుపులు, ఏటవాలు ఆకృతికి తోడు అజాగ్రత్త, అతివేగంతో వాహనాలు అదుపు తప్పి ప్రాణాలు పోతున్నాయి. ఈ మార్గంలో నాలుగు వరుసలుగా నిర్మించాలని నిర్ణయించగా పనులు ప్రారంభం కాకపోగా ప్రమాదాలు పరిపాటిగా మారాయి.

**విభాగిని లేక.. విస్తరణకు నోచుకోక**

నిజామాబాద్-జగదల్‌పూర్ మార్గంలో దాదాపు 25 ఏళ్ల కిందట అప్పటి అవసరాలకు అనుగుణంగా జాతీయ రహదారిని నిర్మించారు. ప్రస్తుతం వాహనాల సంఖ్య పెరగడంతో ఈ మార్గం నిత్యం రద్దీగా ఉంటోంది. ఛత్తీస్‌గఢ్‌లోని జగదల్‌పూర్‌ను కలిపే రోడ్డు కావడంతో సరకు రవాణా చేసే భారీ వాహనాలు అధిక సంఖ్యలో ప్రయాణిస్తాయి. రోజూ వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుండగా, జాతీయ రహదారి కావడంతో వేగం కొంత ఎక్కువగానే ఉంటోంది.

రహదారి మధ్యలో డివైడర్ లేక ఓవర్‌టేక్ చేసే సమయంలో వాహనాలు ఢీకొంటున్నాయి. చాలా చోట్ల మలుపులు, రోడ్డు వంపుగా ఉండటం,



కొన్ని చోట్ల ఏటవాలుగా ఉండటంతో వేగం పెరిగి అదుపు తప్పుతున్నాయి. గ్రామాలను అనుసంధానించే కూడళ్ల వద్ద వాహనాలు నేరుగా హైవేపైకి దూసుకురావడం ప్రమాదాలకు మరో కారణం.

**14 కిలోమీటర్లు.. 14 ప్రదేశాలు**

జాతీయ రహదారిపై మెట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో సుమారు 14 కిలోమీటర్ల పరిధిలో 14 వరకు ప్రమాదకర ప్రదేశాలున్నాయి. రాజేశ్వర్‌రావుపేట వరద కాలువ వంతెన, బండలింగాపూర్ క్రాస్ రోడ్డు, మేడిపల్లి, ఇబ్రహీంపట్నం క్రాస్ రోడ్డు, వెంకట్రావుపేట కల్వర్టు, బస్సుస్టేజ్, పెట్రోల్ బంక్ మలుపు, శక్తిబార్ నుంచి పోలీస్‌స్టేషన్, ఆరపేట శివాలయం మలుపు, చౌలమద్ది క్రాస్ రోడ్డు, చింతలపేట క్రాస్ రోడ్డు, మారుతినగర్, పెద్దాపూర్ క్యాంప్ క్రాస్ రోడ్డు, పెద్దగుండు శివారు ప్రాంతాల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

**మూడు నెలల్లో నలుగురు మృత్యువాత**

అక్టోబరులో మెట్‌పల్లి శివారు వెంకట్రావుపేట రోడ్డులో వెనుక నుంచి కారు ఢీకొట్టడంతో ద్విచక్రవాహనదారు మృతి చెందాడు.

అదే నెల 26న వెంకట్రావుపేట రోడ్డులో ద్విచక్రవాహనం, కారు ఢీకొని యువకుడు మృత్యువాత పడ్డాడు.

ఈ నెల 23న వెంకట్రావుపేట వద్ద కారు, ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో పెను ప్రమాదం తప్పింది.

27న మెట్‌పల్లి-కోరుట్ల మధ్య పెద్దగుండు వద్ద లారీ, కారు ఢీకొన్న ఘటనలో దంపతులు దుర్మరణం చెందారు.

**హెచ్చరిక బోర్డులేవీ!** ప్రమాదాల నివారణకు ప్రమాదకర ప్రదేశాల్లో వేగ నియంత్రణకు రంబుల్ స్ట్రిప్స్, మలుపు, ఓవర్‌టేక్ చేయొద్దనే సూచికలు ఏర్పాటు చేశారు. డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. అలాగే ప్రమాదకర ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు బిగించాల్సిన అవసరముంది.

# గ'మ్మత్తు'.. యువత చిత్తు!

ఎల్లారెడ్డిపేట: యువత మత్తు పదార్థాలకు బానిస అవుతూ.. గ'మ్మత్తు'లో భవిష్యత్తును చేజేతులా నాశనం చేసుకుంటోంది. పట్టుబడుతున్న వారిలో బాలలు మొదలుకొని 25 నుంచి 30 ఏళ్ల వయసున్న యువకులు ఎక్కువగా ఉండడం ఆందోళన కలిగిస్తోంది.

**చాపకింద నీరులా..** జిల్లాలో గంజాయి విక్రయాలు చాపకింద నీరులా సాగుతున్నాయి. బస్టాండ్లు, జనసమ్మర్థ ప్రాంతాలు, కొన్ని పాఠశాలలు, కళాశాలలు, కొట్ల వద్ద అడ్డాలు వెలుస్తున్నాయి. తక్కువ సమయంలో ఎక్కువ ధనార్జనే ధ్యేయంగా కొందరు అక్రమార్కులు గంజాయి విక్రయాలకు తెగబడుతున్నారు. వీరు ఆంధ్రప్రదేశ్, ఒడిశా, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. వాహనాలు, రైళ్లు, బస్సుల్లో రహస్య ప్రాంతాలకు తరలిస్తున్నారు. చిన్నమొత్తంలో తీసుకొచ్చి, పొట్లాల్లో ప్యాక్ చేస్తూ విక్రయాలకు తెరలేపుతున్నారు. వాట్సప్ ద్వారా సమాచారమిచ్చి దందాను యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. ఎల్లారెడ్డిపేటలోని పాఠశాలలో డిసెంబరు 24న విద్యార్థులు గంజాయి తాగుతున్నారనే సమాచారంతో పోలీసులు దాడి చేశారు. ఇద్దరు పారిపోగా ఒకరు చిక్కారు. హుక్కా పీల్చే పరికరం, పైపు లభ్యమయ్యాయి. విద్యార్థుల తల్లిదండ్రులను పిలిపించి, కౌన్సెలింగ్ ఇచ్చారు. నవంబరు 17న ఎల్లారెడ్డిపేట మండలం దుమాల బ్రిడ్జి వద్ద గంజాయి అమ్మేందుకు వచ్చారనే సమాచారంతో ఎస్సై



రాహుల్‌రెడ్డి ఆధ్వర్యంలోని పోలీసులు గస్తీ నిర్వహించారు. 150 గ్రాముల గంజాయి స్వాధీనపరచుకున్నారు. ముగ్గురిని రిమాండ్‌కు తరలించారు. ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్ ఆలయ కమాన్ వద్ద నవంబరు 10న పోలీసులకు ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా తిరుగుతూ కనిపించారు. వారిని తనిఖీ చేయగా 105 గ్రాముల గంజాయి బయటపడింది. వెంటనే నిందితులను అరెస్ట్ చేశారు. అక్టోబరు 5న ఎల్లారెడ్డిపేట ఎల్లమ్మ ఆలయం వద్ద పోలీసులు తనిఖీ చేశారు. ఇద్దరి వద్ద 160 గ్రాముల గంజాయిని స్వాధీనపరచుకొని, నిందితులను అరెస్ట్ చేశారు. పోలీసులకు చిక్కిన ఇద్దరిలో ఒకరు 25 సంవత్సరాలు, మరొకరు 27 సంవత్సరాల వయసు ఉన్నారు.

నిఘా తీవ్రతరం: సీఐ శ్రీనివాస్‌గౌడ్, ఎల్లారెడ్డిపేట

గంజాయి నిర్మూలనకు నిఘాను తీవ్రతరం చేశాం. వారానికి రెండు గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. అనుమానితులను యూరిన్ టెస్ట్ కిట్‌ల ద్వారా పరీక్షిస్తున్నాం. గంజాయి తాగినట్లు తేలితే కేసు నమోదు చేసి, కోర్టులో హాజరుపరచుతున్నాం. పాత నేరస్థులను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తున్నాం. వారి కదలికలను గమనిస్తున్నాం.

# బీ'డర్'.. రహదారి!



జహీరాబాద్ : జహీరాబాద్ పట్టణ శివారులోని రైల్వేగేటు సమీపంలో లారీ, కారు ఢీకొని ఒకే కుటుంబానికి చెందిన నలుగురు దుర్మరణం పాలయ్యారు. న్యాల్‌కల్ మండలం గణేశ్‌పూర్ వద్ద సోమవారం ద్విచక్ర వాహనాన్ని కర్ణాటక ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతిచెందారు. ఇవీ జహీరాబాద్-బీదర్ అంతర్రాష్ట్ర రహదారిపై జరిగిన ప్రమాద ఘటనల్లో కొన్ని. కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంత ప్రయాణికులు బీదర్ నుంచి హైదరాబాద్, బెంగళూరు పట్టణానికి రాకపోకలు సాగించాలంటే ఈ రహదారి ప్రధానం. దీంతో ఎప్పుడూ రద్దీగా ఉంటుంది. తరచూ ప్రమాదాలు జరుగుతూ పలువురు ప్రాణాలు కోల్పోతుండగా, మరికొందరు దివ్యాంగులుగా మారుతున్నారు. అయినా ప్రమాదాల నివారణపై అధికారులు దృష్టి సారించడంలేదు.

**జాడలేని సూచికలు..**

పాత ఆర్టీఏ చెక్‌పోస్టు నుంచి బీదర్ వరకు 32 కి.మీ పొడవునా రహదారి సాగుతుంది. 19 కి.మీ. జహీరాబాద్, న్యాల్‌కల్ మండలాల మీదుగా తెలంగాణ పరిధి కాగా 13 కి.మీ. బీదర్ కర్ణాటకలోకి వస్తుంది. జిల్లా పరిధిలోకి వచ్చే 19 కి.మీ. దారి మలుపులు, గుంతలు, ఎత్తుపల్లాలుగా ఉంది. ఎక్కడా సూచికలు ఏర్పాటు చేయలేదు. బీదర్ జిల్లా పరిధిలో బోర్డులు ఏర్పాటు చేశారు.

**విస్తరణకు నోచుకోక**..నాలుగు వరుసలుగా విస్తరిస్తామంటూ గతంలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి, అప్పటి మంత్రి హరీశ్‌రావు పలుమార్లు ప్రకటనలు చేసినా మోక్షం దక్కలేదు. రెండేళ్ల క్రితం జాతీయ రహదారుల సంస్థ వికారాబాద్ జిల్లా మన్నెగూడ-తాండూరు మీదుగా జహీరాబాద్-బీదర్ రోడ్డును జాతీయ రహదారిగా గుర్తించేందుకు సర్వే చేపడుతున్నట్లు ప్రకటించిన ప్రతిపాదన కార్యరూపం దాల్చలేదు.

**రహదారి..: జహీరాబాద్-బీదర్**

పరిధి..: జిల్లాలో 19 కి.మీ, బీదర్-13 కి.మీ

ప్రమాదకర ప్రదేశాలు..: జహీరాబాద్ రైల్వేగేటు, దర్గా, డిడ్గి, కొత్తూర్(బి), న్యాల్‌కల్ మం దలం హుసెల్లి, గణేష్‌పూర్, మెటల్‌కుంట, గంగ్వార్, మిర్జాపూర్(బి)

ఘటనలు..: 15 ప్రమాదాల్లో 10 మందికి పైగా మృతి, 22 మందికి పైగా గాయాలు

**నివారణ చర్యలు..:** నాలుగు వరుసలుగా విస్తరించడం, సూచిక బోర్డులు, రేడియం స్టిక్కర్ల ఏర్పాటు

**ప్రమాద నివారణ చర్యలు చేపడతాం..**

శ్రీనివాస్, ఏఈ, ర.భ శాఖ జహీరాబాద్

రహదారిని జాతీయ రహదారిగా అభివృద్ధికి ప్రతిపాదనలు పూర్తయ్యాయి. ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన చర్యలపై క్షేత్రస్థాయిలో సందర్శించి నిర్ణయిస్తాం. సూచికలు, రోడ్డు దెబ్బతిన్న ప్రాంతాల్లో గుంతలకు మరమ్మతు చేయిస్తాం.

## ఆశ 'జావ' గారుతోంది..

దహెగాం :అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు పౌష్టికాహారంతో పాటు రాగిజావ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఓ ట్రస్టు ద్వారా జావ అందించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ఏడాది కిందట ప్రకటించారు. దీనికి సంబంధించిన మార్గదర్శకాలు ఇంకా రాకపోవడంతో జిల్లాలో కార్యక్రమానికి అడుగులు ముందుకు పడటంలేదు. ఆచరణలోకి వస్తే పేద కుటుంబాల చిన్నారుల ఆరోగ్యం మెరుగుపడుతుంది.జిల్లాలో 1193 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. 6 ఏళ్ల వయసులోపు పిల్లలు 53,093 మంది ఉన్నారు. గర్భిణులు 6443, బాలింతలు 5813 మంది లబ్ధిపొందుతున్నారు. చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటా-పాటలతో పూర్వ ప్రాథమిక విద్యను బోధిస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటికే వీరికి ఏకరూప దుస్తువులు అందించింది. మంత్రి ప్రకటన మేరకు రాగిజావ కార్యక్రమాన్ని అమల్లోకి తీసుకొస్తే ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. వారు ఆరోగ్యంగా ఉండేందుకు తగిన పోషకా



లు అందుతాయి. జిల్లాలో తీవ్ర పోషణ, అతి తీవ్ర పోషణ లోపంతో సుమారు 2 వేల మంది వరకు చిన్నారులు బాధపడుతున్నారని అధికారిక లెక్కలు చెప్తున్నాయి.

**అధిక పోషకాలు..**

100 గ్రాముల రాగుల్లో 328 కేలరీల శక్తి ఉంటుంది. ఐరన్ 3.9 మిల్లీ గ్రాములు, సోడియం 11 మి.గ్రా., కాల్షియం 344 మి.గ్రా., పోటాషియం 408 మి.గ్రా. ఉంటాయి. పిల్లల ఎముకలు దృఢంగా మారడానికి కాల్షియం ఉపయోగపడుతుంది. ప్రొటీన్, ఫైబర్‌తో పాటు ఐరన్ మోతాదు ఎక్కువగా ఉండి రక్తహీనతను తగ్గిస్తుంది.

'సి' విటమిన్ రోగనిరోధక శక్తిని పెంచుతుంది. మాంసకృత్తులు ఎక్కువగా ఉంటాయి కండరాలు ఆరోగ్యంగా ఉండటంతో పాటు రక్తం తయారు కావడానికి దోహదపడుతుంది.

ప్రస్తుతం అందజేస్తున్న ఆహారం గ్రాముల్లో బియ్యం 75 నూనె 5 కందిపప్పు 15 కూరగాయలు 25 గుడ్డు 1

## ఆఖరి మజిలీ.. అవస్థల లోగిలి

దహెగాం :ఈ రెండు చిత్రాలు దహెగాం మండలంలోని లగ్గాం, చౌక పంచాయతీలకు సంబంధించిన వైకుంఠధామాలు. ఇవి వాగులకు సమీపంలో ఉండటంతో.. నిర్మించిన ఏడాదిలోనే వరదలకు పూర్తిగా ధ్వంసమయ్యాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు మృతదేహాలను సమీప పెద్దవాగుకు వెళ్లి దహన సంస్కారాలు చేస్తున్నారు. సరైన ప్రణాళిక లేకపోవడంతో నిధులు వరదల పాలయ్యాయని, ఎటువంటి ప్రయోజనం లేకుండా పోయిందని గ్రామస్థులు వాపోతున్నారు. జిల్లాలోని పలు వైకుంఠధామాలు దెబ్బతిని అంతిమ సంస్కారాలకు ప్రజలు అవస్థలు పడుతున్నారు. గ్రామాల్లో ఆఖరి మజిలీకి ఇబ్బందులు ఎదురుకావద్దనే ఉద్దేశంతో.. గత ప్రభుత్వం పంచాయతీకి ఒకటి చొప్పున వైకుంఠధామం నిర్మించిన విషయం విదితమే. అయితే చాలా చోట్ల గ్రామాల్లో వరదలకు ధ్వంసమయ్యాయి. అయినప్పటికీ ప్రభుత్వం వాటిని పట్టించుకోకపోవడంతో.. శిథిలావస్థకు చేరుతున్నాయి. నూతన సర్పంచులైనా వాటిని పట్టించుకుని వినియోగం లోకి తీసుకురావాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఆయా మండలాల గ్రామాల్లోని వైకుంఠధామాలపై పరిశీలన కథనం. **ఒక్కో నిర్మాణానికి రూ.12 లక్షలు** జిల్లాలో 335 వైకుంఠధామాలు నిర్మించారు. ఉపాధిహామీ పథకంలో భాగంగా.. ఒక్కో దానికి రూ.12 లక్షలు కేటాయించారు. జిల్లా వ్యాప్తంగా రూ.40.20 కోట్లతో నిర్మాణాలు పూర్తిచేశారు. కాగా కొన్నిచోట్ల స్లాబులుండగా, మరికొన్ని చోట్ల రేకులతో మమ అనిపించారు. చాలా గ్రామాల్లో వాగులు, చెరువులు, కుంటలకు సమీపంలో నిర్మించడంతో.. కట్టిన ఏడాదికే వర్షాకాలంలో వరదల ప్రభావంతో దెబ్బతిన్నాయి. దీంతో నిరుపయోగంగా మారాయి. మరికొన్ని గ్రామాల్లో వైకుంఠధామాలను కిలోమీటర్ల దూరంలో నిర్మించడంతో అక్కడికి వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారు. కాగా ఉన్న వాటి నిర్వహణపై కూడా పర్యవేక్షణ కొరవడట ంతో.. చాలాచోట్ల ధ్వంసమవుతున్నాయి. కొన్నిచోట్ల



ఉపయోగిస్తున్నా.. పిచ్చిమొక్కలతో అధ్వానంగా మారాయి. నీటి సౌకర్యం కూడా కల్పించకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఫలితంగా అంతిమ సంస్కారాలకు సరైన సౌకర్యాలు లేక ఇప్పటికీ చాలా గ్రామాల్లో చెరువు శిఖం భూములు, పంట పొలాలు, కాలువ గట్లపైన, వాగుల్లో మృతదేహాలకు దహన సంస్కారాలు చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయించాలని ఆయా గ్రామాల ప్రజలు విన్నవిస్తున్నారు.వాంకిడి మండలంలోని కమాన గ్రామ పంచాయతీ వైకుంఠధామం ఇది. నిర్మించిన సంవత్సర కాలంలోనే వరదలకు సగంమేర కొట్టుకుపోగా.. మిగతా భాగం ఎవరూ పట్టించుకోక పోవడంతో శిథిలావస్థకు చేరుకుంది. పిల్లరు కుంగిపోయింది. మరమ్మతులు చేపట్టకపోవడంతో ఇక్కడ తుమ్మచెట్లు, పిచ్చిమొక్కలు పెరిగి అధ్వానంగా మారింది. దీంతో గ్రామస్థులు ఇక్కడ దహన సంస్కారాలు చేసేందుకు రావడం లేదు.

## మిషన్ ఖమ్మం కార్పొరేషన్!

ఖమ్మం : కమాన్‌బజార్ న్యూస్‌టుడే: ఖమ్మం నగరపాలక సంస్థ ప్రస్తుత పాలకవర్గం పదవీ కాలం మరికొద్ది నెలల్లో పూర్తికానుంది. వచ్చే ఏడాది ప్రథమార్థంలో జరగనున్న నగర పాలక సంస్థ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కాంగ్రెస్ పార్టీ కసరత్తు ప్రారంభించింది. నగరపాలక పీఠమే లక్ష్యంగా సంస్థాగత ప్రక్షాళనకు శ్రీకారం చుట్టింది. ఇటీవల నగర పార్టీ అధ్యక్షుడిగా నాగండ్ల దీపక్‌చౌదరిని నియమించింది. ఈ నేపథ్యంలోనే నామమాత్ర కమిటీలతో సరిపెట్టకుండా 'మిషన్ ఖమ్మం కార్పొరేషన్' లక్ష్యంగా క్షేత్ర స్థాయిలో పార్టీని బలోపేతం చేసే పనిలో నిమగ్నమైంది. సుదీర్ఘ కాలం తర్వాత నగర కాంగ్రెస్ కమిటీని పూర్తిస్థాయిలో నియమించేందుకు కసరత్తు ముమ్మరం చేసింది. బూత్ స్థాయి నుంచే.. ఖమ్మం పురపాలికగా ఉన్నపుడు కాంగ్రెస్ నేతృత్వంలో రెండుసార్లు పాలకవర్గం ఏర్పాటైంది. కార్పొరేషన్‌గా విస్తరించిన తర్వాత 2016 నుంచి ఇప్పటివరకు రెండుసార్లు ఎన్నికలు జరిగినా కాంగ్రెస్‌కు అధికారం దక్కలేదు. ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉండటం, జిల్లాలో ఇటీవల పంచాయతీ ఎన్నికల్లో మెజారిటీ స్థానాలు కైవశం చేసుకోవటంతో ఈసారి కేఎంసీపై జెండా ఎగురవేయాలని భావిస్తోంది.

**కసరత్తు ఇలా..**ప్రణాళికలో భాగంగా గతంలో లేనట్టు ప్రతి బూత్‌కు ఇద్దరు చొప్పున క్రియాశీలక కార్యకర్తల పేర్లను సేకరిస్తున్నారు. వీరి పేర్లను ఎంపిక చేసే బాధ్యత స్థానిక కార్పొరేటర్లు, ముఖ్య నాయకులకు అప్పగించారు. జనంలో ఉంటూ సేవలందించే వారికి ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించారు. ఇదే క్రమంలో పాత, కొత్త మేళవంగా కమిటీలు ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. బూత్ కమిటీల్లో చోటు దక్కకున్నా నగర, జిల్లా కమిటీల్లో ప్రాధాన్యం కల్పించేందుకు డివిజన్ల వారీగా ఆశావహుల పేర్లను జిల్లా శాఖ కోరుతోంది. రెండు నెలల క్రితం ఏఐసీసీ, టీపీసీసీ పరిశీలకులు డివిజన్ల వారీగా ఇలాంటి జాబితా సేకరించారు. ఎంపికలో తాజాగా తీసుకునే పేర్లతోపాటు వాటిని కూడా పరిగణలోకి తీసుకునే అవకాశం ఉందని నాయకులు చెబుతున్నారు.

## మారని బతుకులు.. వలస కూలీల వెతలు



పెద్దపల్లి : మండలం గౌరెడ్డిపేటలోని ఓ ఇటుక బట్టీలో గతేడాది విషపూరిత ఆహారం తిని ఇద్దరు కూలీలు మృత్యువాత పడ్డారు. మరికొందరికి దీని ప్రభావంతో డయాలసిస్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.బట్టీలో పని చేసే కూలీల పిల్లలకు ఏర్పాటు చేసిన పాఠశాలలు మొక్కుబడిగా మారాయి. బడికెళ్లే పిల్లల ట్యూటర్ రికార్డులో ఉండగా.. పిల్లలు పని కేంద్రాల్లోనే పనులు చేయడం నిత్యకృత్యమైంది. సాధారణంగా అక్టోబరు, నవంబరులో మొదలయ్యే ఇటుకల తయారీ సీజన్ వివిధ కారణాలతో ఈ ఏడాది ఆలస్యం అయింది. ప్రస్తుతం ఈ పనులు మొదలుకావడంతో ఒడిశా, ఛత్తీస్‌గఢ్, ఝార?ండ్ రాష్ట్రాల నుంచి వలస కూలీలు జిల్లాకు వరుస కడుతున్నారు.

జిల్లాలో 200కిపైగా ఇటుక బట్టీలున్నాయి. కూలీలు ఏడాదిలో ఆరు నెలలపాటు బట్టీల్లో పని చేస్తారు. మిగతా సమయంలో స్వరాష్ట్రానికి వెళ్లి నవంబరు, డిసెంబరులో తిరిగి వస్తారు. వీరి పిల్లల చదువుకు గతేడాది పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో డిజిటల్ తరగతి గదులను ఏర్పాటు చేశారు. కానీ ఇవి మున్నాళ్ల ముచ్చటగానే మారిపోయాయి.

వీరికి వైద్య సేవలు సక్రమంగా అందం లేదు. రాఘవపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోనే 60కిపైగా బట్టీలున్నాయి. ఒక్కో బట్టీలో కనీసం రెండు వందల మంది కూలీలు పని చేస్తున్నారు. వీరికి అత్యవసర వైద్య సేవలను బట్టీ యజమాని వద్ద పని చేసే సూపర్‌వైజర్లే అందిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

ఎప్పటి మాదిరిగా ఈ సారి కూడా వలస కూలీలకు కనీస వసతులు కల్పించాలనే నిబంధన అమలు కావడం లేదు. పని కేంద్రాలకు దూరంగా ఉండాల్సిన నివాసాలు, బట్టీల చెంతనే అరకొర వసతులతో ఏర్పాటు చేస్తున్నారు. అధికారుల తనిఖీలు జరిగిన సమయంలో మినహా శుద్ధజలం అందించడం లేదు. పిల్లలకు విద్య అందించడం ప్రచారానికే పరిమితమవుతోంది. ఇటుకలు పేర్చిన గోడలపై రేకులు లేదా కవర్లు కప్పి అందులోనే కూలీలకు ఆవాసం కల్పిస్తున్నారు. ఆవాసాలకు సమీపంలో చేతిపంపు లేదంటే నీటి డ్రమ్ములను ఏర్పాటు చేస్తుంటారు. ఆ నీటితోనే వంటలు చేసుకోవడం, తాగడం తప్పనిసరి. బహిరంగ ప్రదేశాల్లో బహిర్భూమికి వెళ్లడం, స్నానాలు చేస్తున్నారు.

**పర్యవేక్షణ ఏదీ**ఒక బట్టీలో పని చేసే కూలీలు ఎంత మంది. వారు ఎక్కడి నుంచి వచ్చారు.. కూలీలను పంపించిన ఏజెన్సీకి ప్రభుత్వ గుర్తింపు ఉందా. నిబంధనల ప్రకారం కూలీలకు వేతనాలు అందుతున్నాయా. పని గంటలు, పని కేంద్రాల్లో పరిస్థితులు, నివాస ప్రాంతాల్లో వసతులు తదితర అంశాలపై జిల్లా అధికార యంత్రాంగం ఏనాడూ దృష్టి సారించలేదు. ఫలితంగా తరచూ ఒడిశా సంక్షేమాధికారులు జోక్యం చేసుకోవాల్సి వస్తుందంటే జిల్లా కార్మికశాఖ పనితీరు ఏ విధంగా ఉందో ఇట్టే అర్థం అవుతోంది.

## అక్రమార్కులకు.. చెట్టా'పట్టా'ల్



నిజామాబాద్ : నిజామాబాద్ మండలంలోని గుండారం శివారు ప్రాంతం నుంచి మాక్లూర్ మండలం వరకు మూడో రైల్వేలైన్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఇందుకు పెద్ద ఎత్తున మొరం అవసరం. ఇక్కడి అవసరాల కోసం పట్టాల సమీపంలోని ప్రభుత్వ స్థలాల గుట్టలను యథేచ్ఛగా తొలిచేస్తున్నారు. దాదాపు ఆరు కిలోమీటర్ల దూరాన.. ఎక్కడ కనిపిస్తే అక్కడ తవ్వేసి పనులకు మొరం తరలిస్తున్నట్లు గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా.. మల్లారం, గుండారం సమీప గుట్టల్లో రాత్రీ, పగలనే తేడాల్లేకుండా తవ్వేస్తున్నారు. ఇంకొందరు బయట మార్కెట్‌కు తరలించి టిప్పరు రూ.4 వేల నుంచి రూ.5 వేలకు విక్రయించి సొమ్ము గడిస్తున్నారు.నిజామాబాద్ నగరం పరిసరాలతో పాటు పలు మండల కేంద్రాల్లో మొరం అక్రమ రవాణా నిత్యకృత్యమైంది. పొక్లెయిన్ల సహాయంతో గుట్టలను కొల్లగొడుతున్నారు. ఏ అనుమతులు లేకుండానే భారీగా నిల్వలు తరలించేస్తున్నారు. ప్రకృతి వనరులకు తీరని నష్టం కలుగజేస్తున్నారు. కొన్నిప్రాంతాల్లో నేతలు, అధికారుల అండదండలతోనే ఇదంతా సాగుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రహదారుల విస్తరణతో పాటు స్థిరాస్తి వెంచర్లు, రైల్వే లైన్ వంటి పనులకు భారీగా మొరం అవసరం అవుతోంది.

**అన్ని చోట్లా.. మొరం దందా**

ఆర్మూర్ పట్టణంలోని యానం గుట్ట, అంకాపూర్ సమీపంలోని వృద్ధాశ్రమం వెనుకనున్న కొండ ప్రాంత ప్రభుత్వ భూముల్లో, పెర్కిట్ దగ్గర మొరం తవ్వకాలు కొనసాగుతున్నాయి. మాక్లూర్ మండలంలోని చిన్నాపూర్ కొండల్లో, కోటగిరి మండలంలోని ఎత్తోండ, రుద్రూర్ మండలంలోని రాయగిరి గుట్ట వద్ద రాత్రి 11 గంటలు దాటితే వాహనాల రొద మొదలవుతోందని పరిసర గ్రామాల వాసులు పేర్కొంటున్నారు. బోధన్ మండలం ఊట్పల్లి, మోస్రా మండలం 6వ నంబరు తండాలోనూ కొండలను మైదానాలుగా మార్చేస్తున్నారు. ఆయాప్రాంతాల్లో జిల్లా గనుల శాఖ నుంచి అనుమతులు పొందిన క్వారీలేవీ లేవు.

**రూ. లక్షల ఆదాయానికి నిత్యం గండి** అనుమతి పొందిన క్వారీల్లోంచి టన్ను మొరం తరలిస్తే గుత్తేదారులు ప్రభుత్వానికి రూ.40 చొప్పున రాయల్టీ చెల్లించాలని గనుల శాఖ చెబుతోంది. కానీ, జిల్లావ్యాప్తంగా అనధికారిక క్వారీల్లోంచి నిత్యం వందల సంఖ్యలో ట్రాక్టర్లు, టిప్పర్లలో మొరం తరలుతోంది. దీనివల్ల విలువైన ప్రకృతి వనరులు తరిగిపోతుండగా, సర్కారు ఖజానాకు రోజుకు రూ.లక్షల్లో గండి పడుతోంది. తవ్వకాలు చేపట్టిన గుంతలు తటాకాలను తలపిస్తుండగా.. మూగజీవాలతో పాటు మనుషులు సైతం ఊహించని ప్రమాదాల్లో విగతజీవులుగా మారుతున్నారు. ఇకనైనా తనిఖీలతో అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

## ఆక్రమణలకు అడ్డుకట్ట!

ఆదిలాబాద్ :పట్టణానికి ఆనుకొని దాదాపు 114 ఎకరాల్లో విస్తరించిన ఖానాపూర్ చెరువుకు మూడువైపులా కట్ట నిర్మించి ఉండగా వెనుక వైపు లేదు. దీంతో కొన్నేళ్లుగా చెరువు స్థలం ఆక్రమణకు గురవుతూ వస్తోంది. భవిష్యత్తులో చెరువు ఆక్రమణకు గురికావొద్దంటే.. చుట్టూ కట్ట నిర్మించాలని నిర్ణయించారు. ఖానాపూర్ చెరువు పరిస్థితి అధ్వానంగా తయారైంది. పట్టణానికి ఆనుకుని 114 ఎకరాల్లో విస్తరించిన చెరువు.. పర్యాటకానికి అన్నివిధాలా అనుకూలించే పరిస్థితులు ఉన్నా సుందరీకరణకు నోచుకోవడం లేదు. చెరువు స్థలం ఆక్రమణకు గురై ఆహ్లాదాన్ని పంచకపోగా ఇటు మత్స్యకారుల ఉపాధికి తీరని నష్టం కలుగుతోంది. అమృత్ 2.0 పథకం కింద చెరువు పునరుద్ధరణకు రూ.3.14 కోట్లు మంజూరుకాగా, డీపీఆర్‌లో చెరువు చుట్టూ కట్ట నిర్మించాలని నిర్ణయించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

**ఎలా ముందుకెళ్తారో?**

చెరువు స్థలం ఆక్రమణకు గురికావడంతో గతేడాది సెప్టెంబరులో అధికారులు సర్వే నిర్వహించిన విషయం తెలిసిందే. చెరువు పూర్తిస్థాయి నీటిమట్టం, బఫర్‌జోన్‌లో ఎన్ని నివాసాలు ఉన్నాయో లెక్క తేల్చేందుకు బల్దియా, రెవెన్యూ, నీటిపారుదల శాఖల అధికారులు సంయుక్తంగా సర్వే చేశారు. చెరువు వాస్తవ ఎఫ్‌టీఎల్ పరిధిలోని కొన్ని ఇళ్లకు మార్కింగ్ చేశారు. కొన్నేళ్లుగా నివాసాలు ఏర్పాటు చేసుకున్న వారు అభ్యంతరం వ్యక్తం చేయడం రాజకీయంగా తీవ్ర దుమారం రేపింది. దీంతో రెండు రోజులకే సర్వే నిలిపివేశారు. ప్రస్తుతం అమృత్ 2.0 పథకం కింద చెరువుకు వలయాకార కట్ట నిర్మించాల్సి ఉంది. దీంతో అధికారులు కట్టను ఎలా నిర్మిస్తారు..? ఆక్రమణల విషయంలో ఎలా ముందుకెళ్తారోనని సర్వత్రా ఆసక్తి నెలకొంది.



**చిగురించిన ఆశలు**

గతంలో ప్రభుత్వం మినీ ట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్దుతామని 2017లో మిషన్ కాకతీయ పథకం కింద రూ.4.83 కోట్ల నిధులను వెచ్చించింది. అధికారుల పర్యవేక్షణ లోపంతో పనులు నాసిరకంగా జరిగాయి. చాలాచోట్ల చెరువు కట్ట కోతకు గురైంది. సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసినా వెలగడం లేదు. చెరువంతా గుర్రపు డెక్క వ్యాపించింది. గతంలో ఇదే చెరువు కింద ఏటా 100-150 టన్నుల చేపల దిగుబడి వచ్చేదని, వందలాది మత్స్యకార కుటుంబాలకు జీవనోపాధి లభించేదని మత్స్యకారులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం చెరువు అభివృద్ధి చేయాలని తలపించడంతో అటు ఆహ్లాదంతో పాటు మత్స్యకారుల్లో ఆశలు చిగురించాయి.

**కలెక్టర్ ఆదేశం మేరకు**

అరుణ్, డీఈ, పబ్లిక్ హెల్త్, మున్సిపల్ ఇంజినీరింగ్ శాఖ

అమృత్ 2.0 పథకం కింద రూ.3.14 కోట్లు మంజూరయ్యాయి. ఖానాపూర్ చెరువు చుట్టూ కట్టను నిర్మించాల్సి ఉంది. గుత్తేదారుతో ఒప్పందం చేసుకోవాల్సి ఉంది. ఆక్రమణల విషయంలో కలెక్టర్ ఆదేశానుసారం ముందుకెళ్తాం.

## ఆగదు కాలం.. ఆపేకు పయనం


దండేపల్లి : ఓ అడుగు ముందుకు పడిందంటే.. దాన్ని వెనక్కి తీసుకోవచ్చు. సమయం అలా కాదు. గడిచిన కాలం వెనక్కి రాదు. వచ్చే రెండు నెలల్లో ఇంటర్ తర్వాత పది, డిగ్రీ తదితర పరీక్షలు జరగనున్నాయి. ఉద్యోగాలకు సంబంధించిన పోటీ పరీక్షలకు సైతం ప్రకటనలు వెలువడనున్నాయి. ఈ నేపథ్యంలో విలువైన సమయాన్ని ఎలా సద్వినియోగం చేసుకోవాలనే దానిపై 'న్యూస్‌టుడే' కథనం.

**డబ్బుకన్నా మిన్న** గడిచిన రోజు రద్దు చేసిన చెక్కు లాంటిది. చేతిలో ఉన్న డబ్బును ఎలా సద్వినియోగం చేస్తామో అలాగే సమయాన్ని వినియోగించుకోవాలి. ప్రధానంగా చదువు, నిద్రకు సమయాన్ని కేటాయించుకోవాలి. సమయానికి విలువ ఇవ్వాలి. అప్పుడే విజయతీ రాలకు చేరుస్తుంది.

**కబుర్లతో కాలక్షేపం..**కళాశాలకు వెళ్లే విద్యార్థులు పాఠ్యాంశాలంటే బోరు అంటూ తరగతి గదుల నుంచి బయటకు వచ్చేస్తున్నారు. బేకరీ, చరవాణులతో సమయం గడుపుతున్నారు. కబుర్లకు గుడ్‌బై చెబితేనే బంగారు జీవితం సొంతమవుతుంది.

**ఇవి పాటిస్తే ప్రయోజనం**1.చరవాణి అవసరం మేరకే వాడండి. వినియోగానికి తగిన సమయం కేటాయించి పరిమిత సమయం వరకు వాడండి.2.అదే పనిగా చాటింగ్ చేస్తే చదువుపై శ్రద్ధ తగ్గుతుందని గ్రహించండి. అంతర్జాలమంటే కేవలం వినోదం కోసం కాదు అమితమైన విజ్ఞానాన్ని కూడా పొందవచ్చని తెలుసుకోండి. ఏ రోజు పనులను అదే రోజు చేయండి. వాయిదా వేయొద్దు.

3.చదువుతో పాటు నిద్రకు తగిన సమయం కేటాయించండి. ఆరోగ్య



సూత్రాలు పాటించండి.

4.ఖాళీ సమయాల్లో పుస్తకాలు చదవాలి. మేధస్సు పెంచుకోవడానికి ఎక్కువ సమయం కేటాయించాలే తప్ప సరదాలకు వృథా చేయకూడదు. మంచి మిత్రులతో స్నేహం చేస్తే విజ్ఞానం వస్తుంది.

ఉమ్మడి జిల్లాలో పది, ఇంటర్, డిగ్రీ విద్యార్థుల వివరాలు

ఇంటర్ ప్రథమ సంవత్సరం 32,165

ద్వితీయ 29,870

పదో తరగతి 18,475

డిగ్రీ 48,895

లక్ష్యం తెలుసుకోవాలి ప్రతి విద్యార్థికి ఏదో ఒక లక్ష్యం తప్పనిసరి. లేదంటే జీవితం అంధకారమవుతుంది. చాలా మంది పది, ఇంటర్‌కు వచ్చే సరికి జీవిత లక్ష్యం ఏమిటి అని అడిగితే ఇంకా నిర్ణయించుకోలేదని చెబుతారు. మరికొందరు స్థాయికి మించి లక్ష్యం నిర్ణయించుకొని ఒత్తిడికి గురవుతుంటారు. అర్హత, ఆసక్తి అనుకూలత వంటి అంశాలను ఆధారంగా తీసుకొని లక్ష్యం ఏర్పరుచుకోవాలి. దీనిని సాధించాలంటే ప్రణాళిక అవసరం. అంటే కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

అస్మిత, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, దండేపల్లి

**ఎవరికైనా 24 గంటలే..** ఎవరికైనా రోజుకు ఇరవై నాలుగు గంటలు సమయమే ఉంటుంది. సమయానికి పేద, ధనిక లాంటివి ఉండదు. తరగతి గదుల్లో కొందరు విజేతలుగా ఉంటే మరికొందరు పరాజితులవుతున్నారు. చదువుపై దృష్టి పెట్టడం, ప్రణాళికాబద్ధంగా చదువుకోవటంలో ఉన్న వ్యత్యాసమే దానికి కారణం. బలిజపెల్లి కిషన్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు

చురకలు



## శాఖలు మూడు.. చోద్యం చూడు

కందుకూరు :సహజ వనరులను చెరబట్టి యథేచ్ఛగా అమ్మేస్తున్న కబ్జాదారుల నుంచి భూములను స్వాధీనం చేసుకోవడంలో రెవెన్యూ, జలవనరులు, పంచాయతీరాజ్ శాఖల అధికారులు మూడుముక్కలాట ఆడుతున్నారు. యర్రగొండపాలెం పట్టణంలోని విలువైన వాగు పోరంబోకు భూముల ఆక్రమణలతోపాటు ఏకంగా శ్మశానాలను సైతం వదలని అక్రమార్కులపై అధికారులు దాటవేత ధోరణితో వ్యవహరిస్తున్నారు. సర్వే నంబరు 587–2లోని రాళ్లవాగు భూమి ఆక్రమణలపై శుక్రవారం రాళ్లవాగు...కనుమరుగు శీర్షికన ప్రచురితమైన కథనంపై స్పందించిన తహసీల్దారు మంజునాథరెడ్డి ఆక్రమణలు పరిశీలించారు. నాలుగెకరాలు ఆక్రమణకు గురైనట్లు ప్రాథమికంగా గుర్తించారు. దీంట్లో ఇప్పటికే ఎకరా స్థలంలో ప్రైవేటు వ్యక్తులు ప్లాట్లు వేసి అమ్మేశారు. దీని ఎదురుగా 70 సెంట్ల భూమికి కంచె వేసి ఆక్రమించేశారు. దీనిపై నోటీసులివ్వాలని ఆదేశించారు.



కొలుకుల రోడ్డులో సర్వే నంబరు 600లోని శ్మశాన భూమిని ఆక్రమించిన ప్రైవేటు వ్యక్తులు 37 సెంట్లు వెంచర్‌లో కలిపేసుకుని ప్లాట్లుగా అమ్మేశారు. ఏడాది కిందట సర్వే చేసి బోర్డు ఏర్పాటు చేసిన అధికారులు ఇంతవరకు స్వాధీనం చేసుకోలేదు. హద్దులు చూపించామని, శ్మశానాన్ని స్వాధీనం చేసుకుని కంచె వేసుకోవాల్సిన బాధ్యత పంచాయతీ అధికారులదేనని అప్పటి తహసీల్దారు జవాబిచ్చారు. భూమి స్వాధీనం చేసుకున్నామని కలెక్టరుకు నివేదిక ఇచ్చి చేతులు దులిపేసుకున్నారు. వాగులు కాలువలు ఆక్రమణలకు గురైతే సంబంధిత జలవనరులశాఖ అధికారులే చర్యలు తీసుకోవాలని, తాము హద్దులు మాత్రమే చూపిస్తామని తహసీల్దారు సమాధానమిచ్చారు. జీవో 188 ప్రకారం ఆక్రమణలపై రెవెన్యూశాఖాధికారులే చర్యలు తీసుకోవాలని జలవనరులశాఖ డీఈ రాంబాబు చెబుతున్నారు. ఎవరి పరిధిలో వారు చట్టానికి పని చెప్పాల్సింది పోయి ఒకరిపై ఒకరు నెట్టుకోవడం అక్రమార్కులకు మరింత ఊతమిస్తోంది.

## మట్టి కొల్లగొట్టారు.. గుట్ట గుల్ల చేశారు!

చీడికాడ : చీడికాడ మండలంలోని పలు గ్రామాల్లో గ్రావెల్, మట్టి తవ్వకాలు జోరుగా జరుగుతున్నాయి. ముఖ్యంగా రాత్రి సమయాల్లో, కార్యాలయాలకు సెలవు దినాల్లో అక్రమార్కులు చెలరేగిపోతున్నారు. ప్రభుత్వ భూములు, డీపట్టా, రహదారులు, కాలువల పక్కన మట్టిగుట్టల్లో తవ్వకాలు జరుగుతున్నాయి. ప్రైవేటు లేఅవుట్లకు మట్టి తరలిస్తూ అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. కొండెంపూడి ముఖద్వారంలోని పెద్ద గుట్టను ఏకంగా పొక్లెయిన్‌తో తవ్వి ఇతర ప్రాంతాలకు తరలించారు. అయినా అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడలేదు. వీరభద్రపేట, జైతవరం, అడవి అగ్రహారం, బైలపూడి, చీడికాడ, మంచాల, కోనాం, చుక్కపల్లి, అర్జునగిరి ఇలా పలుగ్రామాల్లో పెద్ద ఎత్తున గ్రావెల్, మట్టి తవ్వకాలు యథేచ్ఛగా చేస్తున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే దాడులు చేయడానికి వెనకాడలేదు. అక్రమ తవ్వకాలపై నిఘా పెంచుతున్నాం.. చర్యలు తీసుకుంటామని అధికారులు చెబుతున్నా..



క్షేత్రస్థాయిలో అక్రమార్కులను అడ్డుకోవడంలో విఫలమవుతున్నారు. మట్టి తవ్వకాలకు అనుమతులు ఇవ్వాలని ఇటీవల చీడికాడలో జరిగిన ప్రజా దర్బార్‌లో సొక్లెయిన్, ట్రాక్టర్ల యజమానులు వినతిపత్రం అందించడం మరో విశేషం.

**ప్రభుత్వ ఆదాయానికి గండి..** సాధారణంగా తవ్వకాలు చేయాలంటే గనుల శాఖ అనుమతి తీసుకోవాలి. సంబంధిత అధికారులు మట్టి, గ్రావెల్ తవ్వకం చేసే ప్రాంతాన్ని పరిశీలించి ఎంత లోతు తవ్వాలి, ఎన్ని ఘనపు అడుగుల మేర తవ్వకాలు చేయవచ్చు అనేది నిర్ధారిస్తారు. ఆ తరవాతే తవ్వకాలకు అనుమతిస్తారు. మండలంలో మాత్రం అలాంటివేమీ లేకుండా ట్రాక్టర్ గ్రావెల్ నుంచి రూ.వెయ్యి, ట్రాక్టర్ మట్టి రూ. 700 వసూలు చేసి రెండుచేతులా ఆర్జిస్తున్నారు.

**అనుమతులు లేకుండా తరలిస్తే చర్యలు**

అనుమతులు లేకుండా ఎక్కడైనా అక్రమంగా మట్టి, గ్రావెల్ తరలిస్తే చర్యలు తీసుకుంటాం. మట్టి, గ్రావెల్, ఇసుక అవసరమైన వారు ఎవరైనా రెవెన్యూ కార్యాలయంలో తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలి. కిశోర్‌లింకన్, తహసీల్దార్, చీడికాడ

## మీరు తవ్వుకెళ్లండి.. మేం కళ్లప్పగిస్తాం

ఆకివీడు : ఉండి, భీమవరం నియోజకవర్గాల్లో మట్టి అక్రమ తవ్వకాలు, రవాణా యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా ట్రక్కుల్లో పరిమితికి మించి మట్టిని లోడు చేస్తూ పైన బరకం కప్పకుండా ట్రాక్టర్లు, లారీల్లో తరలించేస్తున్నారు. ప్రైవేటు లేఅవుట్లు, ఇళ్ల స్థలాల్లో చదును పనులు పెరగడంతో మట్టికి గిరాకీ పెరిగింది. దీంతో అక్రమార్కులు సిండికేటుగా ఏర్పడి భారీ ఎత్తున ఆక్రమణలకు పాల్పడుతున్నారు. ప్రస్తుతం ఇది మంచి లాభదాయక వ్యాపారంగా మారడంతో ఈ దందా మూడు ట్రక్కులు.. ఆరు లారీలుగా సాగుతోంది. అధికారుల ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

**దారులు.. అధ్వాన జోలెలా..** ట్రాక్టర్లు, లారీల్లో ఇష్టారాజ్యంగా మట్టి అక్రమ రవాణా సాగిస్తుండటంతో ఆయా ప్రాంతాల్లో నామమాత్రంగా ఉన్న రహదారులు పూర్తిగా పాడవుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఎక్కువ లోడ్లు తిప్పాలనే లక్ష్యంతో అతివేగంగా రవాణా చేస్తుండటంతో రహదారులపై అనేక చోట్ల మట్టి పెళ్లలు జారీ పడుతున్నాయి. అనంతరం అవి వాహనాల రాకపోకలకు అతుక్కుపోయి జారుడు బల్లలా మారుతున్నాయి. దీంతో వాహన చోదకులు తరచూ ప్రమాదాల బారిన పడుతూ గాయాలపాలవుతున్నారు. ప్రస్తుతం ఆకివీడు మండలంలోని ఆకివీడు, మాదివాడ, కోళ్లపర్రు, తరటావ, గుమ్ములూరు తదితర గ్రామాల పరిధిలో మట్టి రవాణా యథేచ్ఛగా సాగుతోంది. దీనిపై తహసీల్దార్ ఫరూక్ వద్ద ప్రస్తావించగా నిబంధనలకు విరుద్ధంగా చేసే వాహనాలను గుర్తించి కేసులు నమోదు చేస్తామన్నారు.

## ఆక్రమణలు నిజం.. చర్యలు ‘భూ’టకం



కందుకూరు : లింగసముద్రం మండలంలో భూ ఆక్రమణలు నానాటికి పెరిగిపోతున్నాయి. ఆర్ఎస్ఆర్ కాకుండా.. ఎఫ్ఎల్ఆర్ గ్రామాలు కావడం.. రికార్డులు సక్రమంగా లేకపోవడం వంటి కారణాలతో వందలాది ఎకరాలు కబ్జాకు గురయ్యాయి. సదరు భూములు ప్రభుత్వానికి సంబంధించినవి.. ఆక్రమిస్తే శిక్షార్హులవుతారని రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినా.. ఏ మాత్రం ఖాతరు చేయడం లేదు. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు సైతం పట్టించుకోవడం లేదన్న విమర్శలు నెలకొన్నాయి.

**అధికారంలో ఏ పార్టీ ఉన్నా..**

రాళ్లపాడులో సర్వే నంబరు 106–3లో 35 ఎకరాలు, లింగసముద్రంలో సర్వే నంబరు 3లో నకిలీ పట్టాలు సృష్టించడంతో పాటు చెట్టు పట్టాల పేరుతో 150 ఎకరాల వరకు స్వాహా చేశారు. వెంగళాపురంలో 120 ఎకరాల గ్రేజింగ్ భూములు, తిమ్మారెడ్డిపాలెం సర్వే నంబరు 1లో ఇప్పటి వరకు మొత్తం 200 ఎకరాలు ఆక్రమణకు గురైంది. వైకాపా నుంచి తెదేపాలో చేరిన ఓ నాయకుడు ఏకంగా 60 ఎకరాలు ఆక్రమించి.. జామాయిల్ సాగు చేశారు. దీనిపై పెద్దఎత్తున విమర్శలు రావడంతో.. రెవెన్యూ అధికారులు ఆ భూముల్లో హెచ్చరిక బోర్డులు పెట్టారు.

**వందలాది ఎకరాలు** ఆర్.ఆర్.పాలెం పరిధిలోని సర్వే నంబరు 1, 2, 271, 272లోని కందేవారిబీడులో వందల ఎకరాల గ్రేజింగ్ భూములు ఉండగా... సుమారు 400 ఎకరాలను ఆర్.ఆర్.పాలెం, మొగిలిచర్ల గ్రామాలకు చెందిన భూస్వాములు ఆక్రమించుకుని పొగాకు, జామాయిల్ సాగు చేసుకుంటున్నారు.

**ఫిర్యాదులకే పరిమితం**

లింగసముద్రం తహసీల్దారు కోటేశ్వరరావు భూములు ఆక్రమించిన 26 మందిని ప్రాథమికంగా గుర్తించి.. వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇప్పటికీ కేసు నమోదు కాలేదు. హెచ్చరిక బోర్డులు తొలగించినా.. అధికారులు పట్టించుకోవడం లేదు. వీటిపై సబ్ కలెక్టర్ హిమవంశీ మాట్లాడుతూ.. పరిశీలించి, చర్యలు తీసుకుంటామన్నారు.

## ఆకలా.. తిను.. అడగొద్దు మెనూ!



ఏలూరు : ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో అత్యధికులు పేద కుటుంబాల పిల్లలే ఉండి చదువుకుంటున్నారు. వారికి వారానికో సారైనా కడుపు నిండా, పోషకాహారంతో భోజనం అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఆదివారం ప్రత్యేక ఆహార పట్టిక అమలు చేస్తోంది. జిల్లాలో ఈ పట్టిక ఎక్కడా సక్రమంగా అమలు కావడం లేదు. క్రిస్మస్ సెలవులకు వెళ్లిన విద్యార్థులు చాలా మంది ఇంకా వసతి గృహాలకు రాలేదు. ఉన్న కొద్ది మందికీ అరకొర మెనూ అమలు చేసి చేతులు దులుపుకొంటున్నారు. జిల్లాలోని పలు సంక్షేమ వసతి గృహాలను బృందం పరిశీలించగా.. అసలు విషయం వెలుగు చూసింది.

పెదవేగి గురుకుల పాఠశాలలో అయిదో తరగతి నుంచి ఇంటర్ వరకు 650 మంది విద్యార్థులున్నారు. ఆదివారం 50 మంది మాత్రమే ఉండగా.. వారికి ఉదయం బన్సీరవ్వ ఉప్మా, పంచదార, మధ్యాహ్నం తెల్లన్నం, బంగాళాదుంప కూర, సాంబారు, మజ్జిగ వడ్డించారు. అన్నం ముద్దగా ఉండటంతో తినేందుకు విద్యార్థులు అవస్థలు పడ్డారు.

ఉంగుటూరు మండలం బొమ్మిడి సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో 51 మంది విద్యార్థినులున్నారు. చాలా మంది క్రిస్మస్ సెలవులకు ఇళ్లకెళ్లారు. ప్రస్తుతం 10 మంది మాత్రమే వసతి గృహంలో ఉన్నారు. వారికి ఆదివారం ఉదయం ఇడ్లీ.. మధ్యాహ్నం తెల్లన్నం, కోడిగుడ్ల పులుసు, చారుతో మమ అనిపించారు.

పోలవరం ఎస్సీ బాలుర వసతి గృహంలో 30 మందికి ఆరుగురు పిల్లలు మాత్రమే ఉన్నారు. బిర్యానీ ఊసే లేదు. తెల్లన్నం, కోడి కూర, చట్నీతో సరిపెట్టేశారు.

ఏలూరు అమీనాపేట బీసీ బాలికల వసతి గృహం–1లో మొత్తం 84 మంది విద్యార్థినులున్నారు. ఆదివారం 46 మంది మాత్రమే వసతి గృహంలో ఉన్నారు. వారికి మధ్యాహ్నం వడ్డించిన వెజ్ బిర్యానీ ఉప్మాను తలపించింది. కొద్దిగా కోడి కూర వండారు. పెరుగు చట్నీ నీళ్లను తలపించింది. సగం మంది పిల్లలున్నా.. కడుపు నిండా భోజనం పెట్టలేదు. ఆర్వో ప్లాంటు పని చేయకపోవడంతో పిల్లలు ఇబ్బంది పడ్డారు. ఆహార పట్టిక ప్రకారం ఆదివారం వడ్డించాల్సిన వంటకాలు

ఉదయం(అల్పాహారం): పూరి, బంగాళాదుంప, బొఠాణి కుర్మా, ఉడక పెట్టిన గుడ్డు

మధ్యాహ్న(భోజనం): కోడి కూర, బిర్యానీ, పెరుగు చట్నీ, గొంగూర చట్నీ‘నాణ్యతలో రాజీ పడకుండా ఆహార పట్టికను విధిగా అమలు చేయాల్సిందే. ఎక్కడైనా ఇబ్బందులుంటే పరిశీలించి చర్యలు తీసుకుంటాం’ అని సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకుడు విశ్వమోహనరెడ్డి తెలిపారు.

## మేమింతే... మారమంతే




తాడేపల్లిగూడెం : రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో అవినీతి పెచ్చుమీరుతోందనడానికి ఈ ఉదంతాలే నిదర్శనం. జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలపై మూడేళ్లలో 357 ఫిర్యాదులు వచ్చాయంటే అక్రమార్కుల హవా ఏ స్థాయిలో ఉందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. మొగల్తూరు, ఉండి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సిబ్బందిపై చర్యలు తీసుకొని అనిశా సోదాలు చేస్తున్నా వసూళ్ల పర్వం ఆగడం లేదు. సమస్యలు పరిష్కారం కావడం లేదు.

**ఇదే అవకాశమని..** సామాన్యులకు ఇబ్బందులు లేకుండా వారసత్వ ఆస్తిని కుటుంబ సభ్యుల పేరిట నామమాత్రపు ఖర్చుతో రిజిస్ట్రేషన్ చేసుకునే వెసులుబాటు కూటమి ప్రభుత్వం కల్పించింది. ఇదే అదనుగా కొందరు వసూళ్లకు తెరతీశారు. లేనిపోని కొర్రీలు సృష్టిస్తూ ఆస్తి విలువ ఆధారంగా ఒక్కో డాక్యుమెంటుకు రూ.25 వేల నుంచి రూ.50 వేల వరకు వసూలు చేస్తున్నారు.

**ప్రైవేటు వ్యక్తుల హవా** తాడేపల్లిగూడెం, నరసాపురం, పెనుగొండ తదితర సబ్ రిజిస్ట్రారు కార్యాలయాల్లో ప్రైవేటు వ్యక్తుల హవా కొనసాగుతోందని, చేతులు తడిపితే గానీ పనులు కావడం లేదనే ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. భీమవరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఓ అధికారిపై పలు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఆస్తి విలువను బట్టి రిజిస్ట్రేషన్ విలువలో రెండు శాతం వరకు డిమాండ్ చేయడంతో పంచాయితీ ఎమ్మెల్యే వరకు వెళ్లింది. దీనిపై జిల్లా ఇన్‌ఛార్జ్ రిజిస్ట్రార్ శ్రీనివాస్ మాట్లాడుతూ రెండు రోజులకోసారి సబ్ రిజిస్ట్రార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నామని.. ఫిర్యాదులపై తక్షణం విచారణ చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

లేఅవుట్ వేసిన 266.6 చదరపు గజాల మా స్థలాన్ని వేరొకరు వారి కుటుంబ సభ్యుల పేరుతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని, న్యాయం చేయాలని 2022లో జిల్లా రిజిస్ట్రారు కార్యాలయంలో ఫిర్యాదు చేశాను. 2023లో మళ్లీ ఫిర్యాదు చేయగా పరిశీలిస్తున్నామన్నారు. ఇటీవల వెళ్లి అడగ్గా మీ దరఖాస్తు కనిపించడం లేదు, మళ్లీ ఫిర్యాదు చేయాలన్నారు.జోగి నర్సింహులు, పాలకొల్లు

నా భార్య ఇటీవల కాలం చేసింది. ఆమె నుంచి సంక్రమించిన ఆస్తిని కుమార్తె, కుమారుడు పేరిట రాసేందుకు రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లగా రూ.35 వేలు వసూలు చేశారు.

కూనపురెడ్డి వీరవెంకట విజయరంగారావు, నరసాపురం

పెదకాకాని మండలం నంబూరు గ్రామంలో వేర్వేరు సర్వే నంబర్లలో 0.56 సెంట్లు, 0.49 1/2 సెంట్లు 45 ఏళ్లుగా అనుభవంలో ఉన్న వ్యవసాయ భూమిని నిబంధనలకు వ్యతిరేకంగా ఉండి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో వేరొకరి పేరుమీద నకిలీ పత్రాలతో రిజిస్ట్రేషన్ చేశారు.

తమ్మా శివరామిరెడ్డి, గుంటూరు జిల్లా

## పండక్కి రండి.. విడిది సిద్ధమండి

పాలకొల్లు :సంక్రాంతికి వరంగల్ నుంచి స్నేహితులు వస్తున్నారని హోటల్‌లో ఓ గది తీసుకుందామంటే డిసెంబరులోనే మొత్తం నిండిపోయాయని నరసాపురానికి చెందిన వాసు వాపోయారు. దీంతో దర్భరేవులో తన పాత పెంకుటిల్లును శుభ్రం చేయించి అతిథుల కోసం సిద్ధం చేసినట్లు తెలిపారు.కోనసీమ జిల్లా సరిహద్దు వద్ద దిండిలో పర్యాటకశాఖ అతిథి గృహాల్లో 32 గదులుండగా జనవరి 11 నుంచి 20వ తేదీ వరకు బుకింగ్‌లు పూర్తయ్యాయి. జాతీయ రహదారి సమీపాన దొంగరావిపాలెం వద్ద ప్రయివేటు అతిథి గృహాల్లో గదులు కూడా పండగ రోజుల్లో అందుబాటులో లేవు. సంక్రాంతి రోజుల్లో జిల్లాకు వచ్చే అతిథుల సంఖ్య ఏటేటా పెరుగుతూనే ఉంది. యలమంచిలి, కలగంపూడి, పూలపల్లి, ఉండి, అయిభీమవరం, కాళ్ల, పెదఅమిరం, తణుకు, దువ్వ, తాడేపల్లిగూడెం ప్రాంతాల్లో జరిగే సంక్రాంతి సంబరాలు, కోడి పందేలు తెలుగు రాష్ట్రాల్లో పేరుగాంచాయి. పండగ మూడు రోజుల్లో ఆయా ప్రాంతాల్లో గడిపేందుకు లక్షలాది మంది ఆసక్తి చూపిస్తున్నారు. దీంతో ఈ ఏడాది సంక్రాంతికి అన్నిరకాల రిసార్టులు, హోటల్స్‌లో గదులకు నెల రోజుల ముందే బుకింగ్‌లు



పూర్తయ్యాయి.

**అతిథుల కోసం ఏర్పాట్లు..** 50 మంది వచ్చినా సరిపోయే మండువా లోగిళ్లకు జిల్లాలో కొదవలేదు. పల్లెల్లో ఉన్న ఇలాంటి ఇళ్లను దులిపేసి అవసరమైతే రంగులేసి అతిథుల కోసం ముస్తాబు చేస్తున్నారు. పండగ రోజుల్లో ఎక్కడున్నా వేడివేడిగా విందు భోజనం అందించేందుకు భారీసైజు క్యారేజీలను సిద్ధం చేస్తున్నారు. పండక్కి ఎంతమంది వస్తారో రండి.. ఏర్పాట్లన్నీ మేం చూసుకుంటాం అంటూ నగరాల్లో, పట్టణాల్లో అతిథులను చరవాణుల్లో ప్రేమగా ఆహ్వానించే మాటలే ప్రస్తుతం జిల్లాలో ప్రతిచోటా వినబడుతున్నాయంటే అతిశయోక్తిలేదు.

**ప్రత్యేక ప్యాకేజీలు**

సంక్రాంతి సందర్భంగా లాడ్జీలు, హోటళ్లలో బస చేసే వారి కోసం ప్రత్యేక ప్యాకేజీలు ప్రవేశపెట్టారు. సాధారణ రోజుల్లో గది అద్దె రోజుకు రూ.2 వేల నుంచి 3 వేల వరకు ఉంటుంది. పండగ మూడు రోజులు కలిపి ప్రత్యేక ప్యాకేజీ రూ.15 వేలుగా నిర్ణయించారు. అతిథులు ఒక్క రోజు ఉన్నా మొత్తం చెల్లించాల్సిందే. ప్రయివేటు రిసార్టుల్లోనూ గది అద్దెలను రెండింతలు చేశారు.

## పట్టిసీమ.. పెదరావిగూడెం

జంగారెడ్డిగూడెం : పుష్కరాల ఏర్పాట్లపై అధికారులు దృష్టి సారించారు. జిల్లాలో 43 స్నాన ఘట్టాలను గుర్తించారు. ఇందులో అత్యధికంగా పోలవరం మండలంలో 35 ఘాట్లు ఏర్పాటు చేస్తున్నారు. 2015 పుష్కరాల్లో ఎక్కడైతే స్నాన ఘట్టాలు ఉన్నాయో, వచ్చే పుష్కరాల్లో కూడా అదే ప్రాంతాల్లో ఏర్పాట్లు చేస్తున్నారు.

**ఇక్కడే అత్యధికంగా..** ప్రధానంగా పోలవరం మండలం పట్టిసీమ రేవుకు అత్యధికంగా భక్తుల తాకిడి ఉంటుందని అధికారుల అంచనా. ఆ తర్వాత కుక్కునూరు మండలం పెదరావిగూడెం స్నాన ఘట్టానికి అత్యధికంగా వస్తారని అంచనా వేస్తున్నారు. వేలేరుపాడు మండలం కటుకూరు రేవుకు కూడా ప్రాధాన్యం ఇవ్వనున్నారు. మొత్తం 43



స్నాన ఘట్టాలు ఏర్పాట్లు చేస్తున్నా.. వీటికి ప్రాధాన్యం ఎక్కువగా ఇవ్వాల్సి ఉంటుంది. రాజమహేంద్రవరం, కొవ్వూరు రేవులలో రద్దీ అధికంగా ఉన్న రోజుల్లో భక్తులు పట్టిసీమ ఎంచుకుంటారు. అంతేగాక పట్టిసీమలో ప్రసిద్ధ వీరేశ్వరస్వామి ఆలయం ఉండటం కూడా ఇక్కడకు ఎక్కువ మంది రావడానికి మరో ప్రధాన కారణం. **ప్రత్యామ్నాయంగా..** ఇక పెదరావిగూడెం స్నాన ఘట్టం, భద్రాచలం సమీపంలో, ఆంధ్రా–తెలంగాణ సరిహద్దు ప్రాంతంలో ఉంది. భద్రాచలంలో భక్తుల తాకిడి ఎక్కువైన సమయంలో, ప్రత్యామ్నాయంగా పెదరావిగూడెం స్నాన ఘట్టానికి ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి వస్తుంటారు.

**ఏర్పాట్లకు ప్రణాళికలు..** ఈ పరిణామాలను దృష్టిలో ఉంచుకొని ఏర్పాట్లు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. 2015లో నిర్మించిన స్నాన ఘట్టాల మెట్లు, మరుగుదొడ్లు, మహిళలు దుస్తులు మార్చుకొనే గదులు, జల్లు స్నానాల ఏర్పాట్లు అన్నీ పాడయ్యాయి. వీటికి మరమ్మతులు చేయడంతోపాటు, కొత్త నిర్మాణాలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

## ‘గుంతల’కల్లు రహదారి

చిప్పగిరి: ఆలూరు–గుంతకల్లు రహదారి అధ్వానంగా మారింది. ఫలితంగా వాహనదారులు నిత్యం నరకయాతన అనుభవిస్తున్నారు. రాకపోకలు సాగించాలంటే హడలుతున్నారు. 32 కి.మీ. పొడవైన ఈ మార్గంలో అడుగడుగునా గుంతలున్నాయి. ఈ మార్గంలో ప్రతిరోజూ 500కుపైగా వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. నిబంధనల ప్రకారం ఈ రోడ్డుపై 25 టన్నుల బరువు కలిగిన వాహనాలు మాత్రమే నడవాల్సి ఉంది. కానీ 40 టన్నుల బరువైన వాహనాలు సైతం తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

రెండుసార్లు పనులు చేపట్టినా..ఆదోని–గుత్తి రహదారి గుంతలు పడి అధ్వానంగా మారడంతో చాలా వాహనాలు ఆదోని, ఆలూరు, గుంతకల్లు మీదుగా రాకపోకలు సాగిస్తున్నాయి. 10, 12, 14 చక్రాల లారీలు సైతం తిరుగుతున్నాయి. వాహనాల బరువుతో రహదారి రూపు కోల్పోయింది. పలు ప్రాంతాల్లో కంకర తేలి ప్రమాదకరంగా మారింది. ఫలితంగా వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. దీనిపై కథనాలు రావడంతో రహదారులు, భవనాల శాఖ అధికారులు స్పందించారు. రెండుసార్లు తాత్కాలిక మరమ్మతులు చేయించారు. దీనికోసం సుమారు రూ.10 లక్షల వరకు ఖర్చు చేశారు. అయినప్పటికీ ప్రయోజనం లేకపోయింది.శాశ్వత మరమ్మతులు అవసరం

ఆలూరు–గుంతకల్లు మార్గంలో బెంగళూరు, తిరుపతి, అమరావతి తదితర ప్రాంతాలకు నిత్యం వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి.

# అత్యవసర వేళ ఆపసోపాలు..!

విశాఖపట్నం : గమ్యనగరిగా పేరుగాంచిన విశాఖకు ఇటీవల పర్యాటకుల తాకిడి పెరిగింది. ఆర్కేబీచ్, కైలాసగిరి, వుడా పార్కు, రుషికొండ వంటి ప్రాంతాలు ప్రస్తుతం సందర్శకులతో కిటకిటలాడుతున్నాయి. అయితే అందుకు అనుగుణంగా సౌకర్యాలు కల్పించడంలో వీఎంఆర్డీఏ యంత్రాంగం విఫలమవుతోందనే విమర్శలు వస్తున్నాయి. ఆదివారం నగరంలోని పలు ప్రాంతాలను 'ఈనాడు' పరిశీలించగా పర్యాటకులు పడుతున్న ఇబ్బందులు వెలుగులోకి వచ్చాయి. ముఖ్యంగా మరుగుదొడ్లు అందుబాటులో లేక, ఎక్కడికి వెళ్లాలో తెలియక మహిళలు అవస్థలు పడటం కనిపించింది.

**రుషికొండలో కేవలం రెండు మరుగుదొడ్లు:** బ్లూఫ్లాగ్ గుర్తింపు పొందిన రుషికొండ బీచ్‌ను నిత్యం 10వేల మందికిపైగా సందర్శిస్తుంటారు. ఇలాంటి ప్రాంతంలో కేవలం రెండు మరుగుదొడ్లు మాత్రమే ఉండటం గమనార్హం. దీంతో పర్యాటకులు ఆరుబయటకు వెళ్లాల్సి వస్తోంది. జీవీఎంసీ నిధులు రూ.55 లక్షలతో 22 మరుగుదొడ్ల నిర్మాణానికి జులైలో శంకుస్థాపన చేశారు. ఆయా పనులు నత్తనడకన సాగుతున్నాయి. సాగర్‌నగర్ బీచ్‌లో గతంలో ఉన్న కంటైనర్ మరుగుదొడ్లను తొలగించేశారు. బీచ్ రోడ్డులో వుడా పార్కు నుంచి కోస్టల్‌బ్యాటరీ వరకు నాలుగు చోట్ల జీవీఎంసీ ఆధ్వర్యంలో నడిచే ప్రజామరుగుదొడ్లు ఉన్నాయి. కోస్టల్‌బ్యాటరీ నుంచి ఆర్‌కే బీచ్ వరకు ప్రస్తుతం ఒకటి ఉండగా మరో రెండు ఏర్పాటు చేయాల్సి ఉంది. వుడా పార్కు నుంచి కోస్టల్‌బ్యాటరీ మధ్య ప్రస్తుతం నాలుగు ఉండగా, వాటిని రెట్టింపు చేయాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



**ఇతర ప్రాంతాల్లో ఇలా..:** వీఎంఆర్డీఏ ఆధ్వర్యంలో కురుసురా జలంతర్గామి, టీయూ-142, సీహారియర్ యుద్ధ విమానం, యూహెచ్-3హెచ్ హెలికాప్టర్ మ్యూజియం ఉన్నాయి. వీటి నుంచి ఏటా రూ.5 కోట్ల వరకు ఆదాయం వస్తోంది. ఆయా ప్రాంతాల్లో ప్రత్యేకంగా మరుగుదొడ్లు లేకపోవడం గమనార్హం.

ఆర్‌కేబీచ్ కాళీమాత ఆలయం సమీపంలోని మరుగుదొడ్లు నిత్యం రద్దీగా ఉంటున్నాయి. దీన్ని దృష్టిలో ఉంచుకొని అదనంగా రెండు యూనిట్లు ఏర్పాటు చేయాలి.

దీనిపై వీఎంఆర్డీఏ కార్యదర్శి మురళీకృష్ణను సంప్రదించగా పర్యాటక ప్రాంతాలను పరిశీలించి అవసరమైన చోట అదనపు మరుగుదొడ్లు ఏర్పాటు చేయిస్తామని చెప్పారు.

ప్రజా మరుగుదొడ్లు ఉన్న ప్రాంతాలు..కోస్టల్‌బ్యాటరీ: 2 తెన్నేటి పార్క్: 1 ఆర్‌కే బీచ్: 2 పాండురంగా పురం: 1 వైఎంసీఏ: 1 రుషికొండ కూడలి: 1 జోడుగుళ్ల పాలెం: 1

# అడ్డురోడ్డుకు మహర్దశ!

అనకాపల్లి : నక్కపల్లి కేంద్రంగా ఏర్పాటు చేయాల్సిన కొత్త రెవెన్యూ డివిజన్‌ను ప్రభుత్వం మార్చింది. ఎస్.రాయవరం మండలం అడ్డురోడ్డు కూడలిలో దీనిని ఏర్పాటు చేయడానికి నిర్ణయించింది. మంత్రులు, అధికారులతో సీఎం చంద్రబాబునాయుడు అమరావతిలో ఇటీవల నిర్వహించిన మంత్రివర్గ ఉపసంఘం సమీక్షలో రెవెన్యూ డివిజన్ మార్పుపై నిర్ణయం తీసుకున్నారు. దీంతో నక్కపల్లికి బదులు అడ్డురోడ్డు కేంద్రంగా డివిజన్ ఏర్పాటు కానుంది.

పారిశ్రామికాభివృద్ధి పరంగా శరవేగంగా అడుగులు వేస్తున్న నక్కపల్లిలో రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు మంత్రి అనిత చొరవ చూపారు. ఇందుకు మంత్రివర్గ ఉపసంఘంలోనూ ఆమోదం లభించింది. ప్రాథమిక నోటిఫికేషన్ తర్వాత.. రాష్ట్రవ్యాప్తంగా నూతన జిల్లాలు, డివిజన్ల ఏర్పాటుపై అభ్యంతరాలను స్వీకరించింది. ఈ క్రమంలో నక్కపల్లి డివిజన్‌ను తప్పించి.. ఎలమంచిలి కేంద్రంగా నూతన రెవెన్యూ డివిజన్‌ను ఏర్పాటు చేయాలంటూ ప్రతిపక్ష నేతలు, కార్యకర్తలు నిరసనలు తెలిపారు. స్థానిక కూటమి నేతలు సైతం ఎలమంచిలి కేంద్రంగా డివిజన్ ఏర్పాటు చేయాలంటూ ప్రతిపాదించడంతో దీంతో ఇక్కడి ప్రజల మనోభావాలను దృష్టిలో పెట్టుకుని నక్కపల్లికి బదులుగా దీనికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న అడ్డురోడ్డు జంక్షన్‌ను డివిజన్ కేంద్రంగా ఏర్పాటు చేసేందుకు సీఎం సుముఖత వ్యక్తం చేశారు. తద్వారా ఆయా ప్రాంతాల వారికి మరింత అందుబాటులో ఉంటుందని ఆలోచన.

**మునగపాక అనకాపల్లిలోనే:** జిల్లా కేంద్రానికి అతి దగ్గరగా ఉన్న మునగపాక మండలాన్ని అనకాపల్లి రెవెన్యూ డివిజన్‌లోనే ఉంచాలని



స్థానిక నేతలు, ప్రజలు విన్నవించారు. ఇటీవల జిల్లా డీఆర్‌సీ సమావేశంలోనూ అనకాపల్లిలోనే మునగపాక మండలాన్ని కొనసాగించాలని తీర్మానించారు. మరోవైపు చీడికాడ మండలాన్ని నర్సీపట్నం నుంచి అనకాపల్లి డివిజన్‌లో కలిపేలా మారుస్తున్నారు. దీంతో అనకాపల్లిలో 10, నర్సీపట్నం, అడ్డురోడ్డు రెవెన్యూ డివిజన్లలో ఏడేసి మండలాల చొప్పున కొనసాగనున్నాయి. పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం, కోటవురట్ల, ఎలమంచిలి, రాంబిల్లి, అచ్యుతాపురం మండలాలతో అడ్డురోడ్డు కేంద్రంగా కొత్త డివిజన్ ఏర్పాటు కానుంది. ఈ నెలాఖరున ప్రభుత్వ తుది నోటిఫికేషన్ ఇచ్చే అవకాశం ఉంది.

**అభివృద్ధిలో వేగంగా ..** తుని, పాయకరావుపేట తర్వాత అడ్డురోడ్డు వాణిజ్యపరంగా వేగంగా అభివృద్ధి చెందుతోంది. పేరుకే తిమ్మాపురం పంచాయతీలో ఉన్నా.. అందరికీ అడ్డురోడ్డు పేరే సుపరిచితం. ఇక్కడ అనేక విద్యా సంస్థలు, ఆసుపత్రులు, వస్త్ర, ఇతర వాణిజ్య సముదాయాలు, అపార్ట్‌మెంట్లు, స్థిరాస్తి వ్యాపారం.. ఇలా అన్నివిధాలా అభివృద్ధి చెందుతోంది. దీనికి తోడు పర్యాటక ప్రాంతమైన రేవుపోలవరం తీరం కూడా ఇదే మండలంలో ఉంది. మరోవైపు ఆది నుంచి నక్కపల్లి పేరును తెరపైకి తెచ్చి చివరిలో అడ్డురోడ్డు డివిజన్ ఏర్పాటు చేయడంపై స్థానికులు ఆవేదన చెందుతున్నారు.

# కూటమి ప్రభుత్వం.. స్వచ్ఛతకు కంకణం



గుత్తి : జిల్లాలోని రెవెన్యూ కార్యాలయాలకు వివిధ పనులపై ప్రజలు వస్తుంటారు. ఒంటికి, రెంటికి వెళ్లేందుకు మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఉరవకొండ, గుంతకల్లు, తాడిపత్రి నియోజకవర్గాల్లోని తహసీల్దార్ల కార్యాలయాల వద్ద స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ మరుగుదొడ్ల నిర్మాణానికి నిధులు సమకూర్చింది. పనులను ఇప్పటికే గ్రానీస ఇంజినీర్లు చేపట్టారు.

**ఎక్కడెక్కడంటే..?** గుత్తి, పామిడి, గుంతకల్లు, పెద్దవడుగూరు, యాడికి, పెద్దపప్పూరు, తాడిపత్రి తహసీల్దారు కార్యాలయాల వద్ద మరుగుదొడ్లు నిర్మిస్తున్నారు. గుత్తిలో స్థలసేకరణ ప్రక్రియ మొదలుపెట్టారు. గుంతకల్లు, ఉరవకొండలో నిర్మాణాలు చేయాల్సి ఉంది. కూడేరు, వజ్రకరూరుకు రెండు చొప్పున, ఉరవకొండ, విడపనకల్లు, బెళుగుప్ప మండలాలకు నాలుగేసి చొప్పున మంజూరయ్యాయి. ఒక్కో కార్యాలయం వద్ద నాలుగు, చిన్న మండలాల్లో రెండు చొప్పున మరుగుదొడ్లు నిర్మిస్తున్నారు.

ప్రతి మండలానికి రూ.12 లక్షలు చొప్పున నిధులు మంజూరయ్యాయి. మూడు నియోజకవర్గాల్లో మరుగుదొడ్ల నిర్మాణానికి మొత్తం రూ.1.20 కోట్లు వెచ్చించనున్నారు. ఇవి పూర్తయితే ప్రజల అవస్థలు తీరనున్నాయి.

# విల్లు ఎక్కుపెడితే పతకాలే!



ముదిగుబ్బ : వారంతా రైతు కుటుంబాలకు చెందినవారు. ఆర్చరీ క్రీడలో అద్భుత ప్రతిభ కనబరుస్తున్నారు. గత నెల అనంతపురంలోని ఆర్డీటీ స్టేడియంలో జరిగిన జిల్లాస్థాయి ఆర్చరీ పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటి రెండో స్థానంలో నిలిచి పతకాలు, ప్రశంసలు అందుకున్నారు. సంకల్పం గట్టిదైతే విజయం వరిస్తుందని నిరూపిస్తున్నారు ముదిగుబ్బ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన పదోతరగతి విద్యార్థినులు.

**ఆర్మీలో ఉద్యోగం లక్ష్యం..**

మాది యర్రగుంటపల్లి గ్రామం. అమ్మ లక్ష్మీ, నాన్న నారాయణస్వామి. వ్యవసాయమే ఆధారం. మొదట నేను పరుగుపందెం, లాంగ్‌జంప్ క్రీడల్లో పాల్గొన్నాను. ఆరో తరగతి చదివే సమయం నుంచి ఆర్చరీపై ఆసక్తి పెరిగింది. ఉపాధ్యాయులు ప్రత్యేక శిక్షణ ఇవ్వడంతో జిల్లాస్థాయిలో రాణించాను. అండర్-17 విభాగంలో అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులో రాష్ట్రస్థాయి పోటీల్లో రెండో స్థానంలో నిలిచాను. ఆర్మీలో ఉద్యోగం సాధించడమే లక్ష్యం.

మహిత

**మానసిక ఏకాగ్రత పెరుగుతుంది**

లక్ష్యానికి గురిపెట్టి బాణం వేసేటప్పుడు మానసిక ఏకాగ్రత ఎంతో ముఖ్యం. ఆర్చరీ క్రీడతో మానసిక ఏకాగ్రతతోపాటు పోటీతత్వం, శారీరక బలం పెరుగుతోంది. మాది ముదిగుబ్బ. నాన్న పుల్లయ్య బొలెరో డ్రైవర్, అమ్మ గృహిణి. ఆరో తరగతిలో షూటింగ్‌బాల్, ఏడో తరగతిలో కబడ్డీలో జిల్లాస్థాయిలో రాణించాను. ఆర్చరీలో రాష్ట్రస్థాయిలో రాణించి రెండోస్థానం సాధించాను. జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనేలా శిక్షణ తీసుకుంటున్నాను. భవిష్యత్తులో క్రీడాకోటాలో ఉద్యోగం సాధిస్తా.

వైష్ణవి

**జాతీయస్థాయిలో గెలవాలని..**

ఆర్చరీ క్రీడలో జాతీయ స్థాయిలో రాణించడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నా. మాది ముదిగుబ్బ. నాన్న నల్లప్ప వీఆర్వో, అమ్మ సువర్ణ గృహిణి. మొదట షూటింగ్‌బాల్, ఫ్లోర్‌బాల్ క్రీడల్లో పాల్గొన్నా. గతేడాది అండర్-17 విభాగంలో ఫ్లోర్‌బాల్ నర్సరావుపేటలో రాష్ట్రస్థాయిలో పాల్గొని రెండోస్థానంలో నిలిచాను. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించారు. అల్లూరిసీతారామరాజు జిల్లా పాడేరులో రాష్ట్రస్థాయిలో రాణించి రెండోస్థానం సాధించాను. భవిష్యత్తులో జాతీయస్థాయి పోటీల్లో సత్తా చాటాలని శిక్షణ తీసుకుంటున్నాను.

యశ్వంతకుమారి

# దేవుడి పరిహారంలోనూ కోత..!



పుత్తూరు : కార్వేటినగరం రాజుల పాలనలో పుత్తూరులో ఆరు శతాబ్దాల క్రితం కార్వేటినగరం రోడ్డు కల్యాణపురం, నగరి మండపం వద్ద కొండ చుట్టు మండపాలు నిర్మించినట్లు చరిత్ర చెబుతోంది.. వాటిని కాపాడాల్సిన అధికార యంత్రాంగం తొలగించేందుకు సిద్ధం కావడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పుత్తూరు-చిత్తూరు రోడ్డులోని కల్యాణపురం వద్ద ఉన్న కొండచుట్టు మండపాన్ని 2010లో పుత్తూరు-చిత్తూరు రోడ్డు విస్తరణలో భాగంగా తొలగించారు. సమీపానే నూతన మండపాన్ని నిర్మిస్తామన్న హామీ నేటికీ నెరవేరలేదు.

నగరి కొండచుట్టు మండపం నిర్మించి 600 సంవత్సరాలు అవుతోంది. ఇన్నేళ్లుగా ఏటా సంక్రాంతి సందర్భంగా కనుమ రోజున ఇక్కడ దేవతామూర్తులను పెద్దఎత్తున కొలువుదీర్చి కొండచుట్టు ఉత్సవం నిర్వహిస్తారు. ఈ మండపాన్ని తిరుపతి- చెన్నై జాతీయ హైవే అభివృద్ధి పనుల్లో భాగంగా తొలగించనున్నారు. ప్రస్తుతం అక్కడ ఒక్క అడుగు భూమి మార్కెట్ ధర ప్రకారం రూ.8 వేలు పలుకుతోంది. అయితే జాతీయ రహదారి అభివృద్ధి అధికారులు కేవలం పరిహారం కింద రూ.6 లక్షలు ఇవ్వడం గమనార్హం.

**ఇప్పుడు నగరి మండపం వంతు..**

ప్రస్తుతం నగరిలోని మండపాన్ని తిరుపతి-చెన్నై రహదారి విస్తరణలో భాగంగా కూల్చేందుకు సిద్ధం చేశారు. ఇప్పటికే నిర్వాహకులకు నోటీసులు ఇచ్చారు. రానున్న కొండచుట్టు ఉత్సవం వరకు గడువు ఇవ్వాలని, అసలు తొలగింపు ఆలోచనే విరమించుకోవాలని ఆర్డీవో నుంచి ఉన్నతాధికారుల వరకు నివేదించారు. మండపం నిర్మించాలంటే ఖర్చు తడిసి మోపెడవుతోందని చెబుతున్నారు. మండపం తొలగించకుండా దీనికి పశ్చిమాన ఉన్న ప్రభుత్వ భూమిలో సర్వీసు రోడ్డు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.


# మట్టికి లేని వివక్ష.. మనుషులకెందుకో..?



చౌడేపల్లె : రెక్కాడితే కాని డొక్కాడని జీవితాలు వారివి..కన్నబిడ్డ మృతిచూసి ఆ తల్లి విలవిల్లాడిపోయింది. గుప్పెడు మట్టిలో కలిసిపోవడానికి మనుషుల చూపు కరవైంది కన్నుమూసిన జీవానికి కన్నీళ్లే నివాళి ఈ కటిక దారిద్ర్యం కడసారి చూపునకు అడ్డుగోడై నిలుస్తోంది. కట్టుకున్న భార్య కాదంది.. కన్నతండ్రి చిన్నతనంలోనే దూరమయ్యారు. చివరకు ఊరుకాని ఊరు వచ్చి ఆకస్మికంగా మృతిచెందారు. నిత్యం భక్తులతో రద్దీగా ఉండే బోయకొండ వద్ద.. కుమారుడు మృతిచెందిన విషయం బంధువులకు తెలుపలేక.. అంత్యక్రియలు చేయలేక దీనమైన పరిస్థితిలో ఉన్న ఓ తల్లి గాథ ఇది. పెద్దపంజాణి మండలం రాయలపేటకు చెందిన గౌరీశంకర్(45) యానాది. భార్య వదిలేయడంతో తల్లి లక్ష్మమ్మ వద్ద ఉంటున్నారు. తోటకు కాపలా ఉంటూ జీవనం సాగిస్తున్నారు. ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో నాటుమందు కోసం రెండురోజుల కిందట బోయకొండ వద్దకు వచ్చారు. అయితే ఆదివారం ఉదయం 10 గంటలకు మృతిచెందారు. కళ్లముందే కన్నబిడ్డ ఆకస్మిక మృతి చూసిన తల్లి విలవిల్లాడిపోయింది. మృతదేహాన్ని ఊరికి తీసుకెళ్లేందుకు డబ్బులు లేకపోవడంతో దీనంగా కూర్చుండిపోయింది. సుమారు ఆరు గుంటల సేపు భక్తులు వస్తూ పోతున్నా.. ఏమైంది అని అడిగేవారు కరవయ్యారు. చివరకు కానిస్టేబుల్ దేవేంద్ర వృద్ధురాలిని విచారించి బంధువులకు సమాచారం అందించారు. సాయంత్రం మృతదేహాన్ని సొంతూరు తీసుకెళ్లారు.

# మూడు గ్రామాలు.. ఇంటికో సైనికుడు..!

భీమిలి : భీమిలి మండలం తగరపువలస, చిట్టివలస సమీప చిప్పాడ, మూలకుద్దు, గుడివాడ ప్రధాన గ్రామాల్లో ప్రతి కుటుంబం నుంచి ఓ వ్యక్తి సైన్యంలో చేరుతున్నారు. ఇక్కడి యువత పది, ఇంటర్, డిగ్రీ పూర్తి కాగానే ఆర్మీలో చేరడమే లక్ష్యంగా ముందుకు సాగుతుండటం విశేషం. ఇప్పటి వరకూ ఈ మూడు గ్రామాల నుంచి దాదాపు 700 మందికి పైగా సిపాయి, నాయక్, హవల్దారు, జూనియర్ కమాండింగ్



అధికారి, సుబేదార్, లెఫ్టినెంట్ కెప్టెన్, మేజరు, తదితర ఉద్యోగాల్లో పనిచేశారు. తొలి సైనికులు వీరే: చిప్పాడకు చెందిన కొయ్య అప్పారావురెడ్డి తొలిసారిగా 1956లో సైన్యంలో చేరారు. ఆయన ఐదేళ్ల కిందట మృతి చెందారు. ఆయన స్ఫూర్తితో వందల మంది సైన్యంలో చేరారు. ఆయన కుమారులు సుబేదార్ కొయ్య నాగేశ్వరరావు, ఈశ్వరరావు దేశానికి సేవలందించి ఉద్యోగ విరమణ చేశారు. మూలకుద్దు నుంచి 1985లో కొయ్య గురయ్యరెడ్డి మొదటిసారిగా సైన్యంలోకి వెళ్లారు. 'చిప్పాడ పరిధి పాతపాలేనికి చెందిన ఉప్పాడ గోవింద్‌రెడ్డి ఆర్మీ కమాండింగ్ అధికారిగా ఐక్యరాజ్యసమితి శాంతి దళంలో ఉంటూ పలుదేశాల్లో విధులు నిర్వహించి రాష్ట్రపతి నుంచి పతకాలు అందుకున్నార'ని మాజీ సైనికుల సంఘం భీమిలి నియోజకవర్గ శాఖ అధ్యక్షులు కొయ్య గురయ్యరెడ్డి తెలిపారు.

# చురుగ్గా కొనుగోళ్లు.. చకచకా చెల్లింపులు

చీడికాడ: ఈ ఏడాది ఖరీఫ్‌లో వాతావరణ పరిస్థితులు కలిసిరావడంతో దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయి. దళారుల వల మాయాజాలంలో చిక్కకుండా కూటమి ప్రభుత్వం సకాలంలో ధాన్యం సేకరణ కేంద్రాలు అందుబాటులోకి తేవడం అన్నదాతలకు వరంగా మారింది. జిల్లాలో కోనాం, రైవాడ, పెద్దేరు, తాండవ, కల్యాణపులోవ జలాశయాలతో పాటు చెరువులు అధికంగానే ఉన్నాయి. వర్షాలకు జలాశయాలు, చెరువులో సమృద్ధిగా నీరు చేరింది. దీంతో జిల్లాలో భూగర్భ జలాలు మెరుగయ్యాయి. ఇవన్నీ ఖరీఫ్ సాగుకు కలిసొచ్చాయి. సాగుకు పెట్టుబడులు కాస్త ఎక్కువ్వే అయినా దిగుబడులు బాగుండటంతో అన్నదాత ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వరికోతలు రైతులు మొదలు పెట్టగానే ప్రభుత్వం ముందుగా మేల్కొని ధాన్యం సేకరణ దశలవారీగా కేంద్రాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. గత వైకాపా సర్కారులా కాకుండా.. రైతు ధాన్యం విక్రయించిన 24 గంటల వ్యవధిలోనే రైతు ఖాతాలో డబ్బులు జమ చేస్తోంది. దీంతో రైతులు సంక్రాంతి పండగ ముందే కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తరలించి విక్రయాలు చేస్తున్నారు.

జిల్లాలో 65 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం 16 మండలాల్లో ధాన్యం సేకరణ చురుగ్గా జరుగుతోంది. మిగిలిన ఎనిమిది మండలాల్లో జనవరి మొదటి వారంలో ఏర్పాటు చేయనున్నారు. దిగుబడి ఎక్కువగా ఉండటంతో గతేడాది కన్నా.. ఎక్కువగానే ధాన్యం సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేశారు. సాధారణ రకానికి క్వింటాల్‌కు రూ. 2,300, 'ఎ' గ్రేడ్ ధాన్యానికి రూ. 2,320 అందిస్తున్నారు. దీంతోపాటు ఇతర సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తోంది.

రైతుల ఖాతాలో రూ. 20 కోట్ల జమ ... ఖరీఫ్ సీజన్‌లో 45 వేల టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా నిర్దేశించారు. ఇప్పటి వరకు 12,764 టన్నుల ధాన్యం సేకరణ జరిగింది. రైతు ధాన్యం విక్రయించిన కొన్ని గంటల్లోనే బ్యాంకు ఖాతాలో నగదు జమ అవుతుంది. ధాన్యం సేకరణ ప్రభుత్వం ముందుగానే కొంత నగదు కేటాయించింది. ఇప్పటివరకు ధాన్యం విక్రయించిన అన్నదాతలకు రూ.20 కోట్ల రైతు ఖాతాల్లో జమయ్యాయి. ఎవరికీ బకాయిలు లేవు. మార్చి నెలాఖరు వరకు ధాన్యం సేకరణ జరుగుతుంది. రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి. కె.వి.ఎల్.ఎ.ఎన్.మూర్తి, జిల్లా పౌర సరఫరాల అధికారి

# ఉత్తర ద్వారంలో కనులారా స్వామిని దర్శించుకునేలా..!

సింహాచలం : ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని సింహాద్రి అప్పన్న స్వామి దర్శనానికి సుమారు 50 వేల మంది భక్తులు వస్తారనే అంచనాతో అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఆయా వివరాలనుఈవో సుజాత విలేకరుల సమావేశంలో వెల్లడించారు. 'ఈ ఏడాది ఆన్‌లైన్ ద్వారా 9వేల టికెట్లు విక్రయిస్తు న్నారు. వరకు అవి అందుబాటులో ఉంటాయి. ఉత్తర ద్వారంలో కొలువైన స్వామిని భక్తులు క్యూలైన్ల ద్వారా పది నిమిషాల పాటు దర్శించుకునేలా ఏర్పాట్లు చేశాం. ఉదయం 11గంటల వరకే ఈ దర్శనం ఉంటుంది. తర్వాత వచ్చిన భక్తులకు సాధారణ దర్శనాలు ఉంటాయి. 30న కేవలం లడ్డూ ప్రసాదం మాత్రమే



విక్రయిస్తాం. ఆ మేరకు లక్ష లడ్డూలు తయారు చేయిస్తున్నాం. 20వేల మంది భక్తులకు ఉచితంగా పంపిణీ చేసేందుకు పొంగలి, పులుసు సిద్ధం చేస్తున్నాం. వాహనాల రద్దీ నియంత్రణకు ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక ప్రణాళిక అమలు చేస్తున్నారు. వివిధ ప్రభుత్వశాఖల సమన్వయంతో పాటు దేవాదాయశాఖ నుంచి అదనపు సిబ్బంది రప్పించేలా చర్యలు తీసుకున్నాం. స్వచ్ఛంద సేవకుల సహకారం తీసుకుంటున్నాం. 29న సాయంత్రం 6 గంటలకు స్వామివారి దర్శనాలు నిలిపివేస్తాం. ఈ సందర్భంగా కొండ కింద నుంచి బస్సులు ఉండవు. 30వ తేదీ వేకువజామున 4 గంటల నుంచి సింహగిరికి బస్సులు ప్రారంభమవుతాయి' అని ఈవో పేర్కొన్నారు. ఏఈవోలు తిరుమలేశ్వరరావు, రమణమూర్తి, ఈఈ సీహెచ్.రమణ, స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, కరి సీతారామాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

# తలనీలాల సొమ్మేది స్వామీ!

ఉరవకొండ : ప్రసిద్ధ పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి ఏటా లక్ష మంది వరకు భక్తులు దర్శించుకుంటుంటారు. వారిలో ఏడాది కాలంలో దాదాపు 20 వేల మంది వరకు తలనీలాలు సమర్పిస్తుంటారు. ఏటా తలనీలాల సేకరణ ప్రక్రియకు ఆలయ అధికారులు వేలం పాట నిర్వహిస్తారు. ఇందులో భాగంగా 2023-24 ఏడాదికి గాను రూ. 52. 5లక్షలకు ఉమ్మడి కడప జిల్లాకు చెందిన ఓ వ్యక్తి దక్కించుకున్నాడు. 2024-25 సంవత్సరానికి సంబంధించి ఉరవకొండ ప్రాంతానికి చెందిన గుత్తేదారు రూ. 27 లక్షలకు సేకరణ హక్కులను పొందాడు. ఈఏడాది ఆగస్టు నుంచి ఇప్పటివరకు మూడుసార్లు టెండర్లను నిర్వహించగా వాయిదా పడుతూ వస్తున్నాయి.

**కొంతే చెల్లింపు.. మిగతాది మమ**

తలనీలాల టెండర్లలో ఖరారైన పూర్తి మొత్తం ఆలయ ఖాతాకు చేరడం లేదు. 2023-24లో రూ. 52. 5లక్షలకు గాను రూ. 36. 5లక్షలు, 2024-25లో రూ. 27లక్షలకు గాను రూ. 9. 5లక్షలు గుత్తేదారు చెల్లించారు. అందులో రూ. 6. 5లక్షలు ఆలయ ఖాతాకు జమ చేసి, మిగతా రూ. 3లక్షలు ఓ అధికారి తన సొంతానికి వాడుకున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. దీనికి సంబంధించి గుత్తేదారుకు రసీదు ఇవ్వలేదని తెలిసింది. ఇదిలా ఉండగా టెండరు కాలం ముగిసిపోయి నెలలు గడుస్తున్నా... వారి నుంచి పూర్తి మొత్తాన్ని వసూలు చేయడంలో ఆలయ అధికారులు చొరవ చూపడం లేదు. భక్తులు ఎంతో నమ్మకంతో తలనీలాలను సమర్పిస్తే వాటిలోనూ అధికారులు, గుత్తేదారులు కుమ్మక్కై



ఆదాయాన్ని పక్కదారి పట్టిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. కొన్నేళ్లుగా ఇదే తంతు నడుస్తున్నా ఉన్నతాధికారులు సైతం తమకేదీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. గుత్తేదారులకు కనీసం నోటీసులు జారీ చేస్తున్న సందరాలేు లేవు. ఈ ఏడాదికి సంబంధించి ఆగస్టులోనే టెండర్లు పూర్తి కావాల్సి ఉన్నా ఇప్పటివరకు కొలిక్కి రాలేదు. కొందరు గుత్తేదారులు సిండికేటుగా ఏర్పడి తక్కువ ధరకు దక్కించుకోవడానికి ఎత్తుగడ వేస్తుండటంతో వేలం ప్రక్రియ వాయిదా పడుతూవస్తోంది. ఈ అంశంపై దేవదాయశాఖ జిల్లా సహాయ కమిషనర్ సుధారాణిని వివరణ కోరగా... టెండరు మొత్తం వసూలు చేయడంలో అలసత్వం చూపినా, పక్కదారి పట్టించినట్లు తేలితే తగిన చర్యలు తీసుకుంటాం. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామన్నారు.

# స్థలముంటే గృహయోగం

చిత్తూరు : సొంతంగా ఇంటి స్థలం ఉన్నవారికి గృహం మంజూరు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది.. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన(పీఎంఏవై) 2.0 ద్వారా ఇంటి నిర్మాణం కోసం పేదలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ. 2. 50 లక్షల ఆర్థిక సాయం అందించనుంది. ఇప్పటికే పట్టణ ప్రాంతాల్లో 2,400 గృహాలు మంజూరు చేశారు. తాజాగా గ్రామీణ ప్రాంతాల్లో అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. గడువు గత నెల 30తో ముగిసింది.. లబ్ధిదారులు ఇంకా దరఖాస్తులు చేస్తుండటంతో గడువును ఈ నెల 14 వరకు పొడిగించారు. గత నెల చివరి నాటికి 46వేల దరఖాస్తులందాయి.

**స్థలం కావాలంటున్న పేదలు..**

కొందరు ఇంటి నిర్మాణం కోసం స్థలం కావాలని వినతులు పెద్దఎత్తున అందిస్తున్నారు. ఇలా ఇప్పటివరకు 7,900 మంది దరఖాస్తు



చేసుకున్నారు. ఇంటి స్థలం ఉన్నవారి దరఖాస్తులను గృహనిర్మాణ శాఖ ఏఈలు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు. గతంలో ప్రభుత్వం ద్వారా గృహం పొందారా..? లేదా..? తదితర విషయాల్ని విచారిస్తున్నారు. తర్వాత సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇంటి స్థలం ఫొటో తీసి జియోట్యాగింగ్ చేస్తున్నారు.

**మండలాల వారీ సర్వే..**

వచ్చిన దరఖాస్తుల ఆధారంగా క్షేత్ర స్థాయిలో సర్వే చేసి వివరాలు నమోదు చేస్తున్నారు. కుప్పం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఇప్పటికే తమకు అందిన ఏడు వేల దరఖాస్తులు సర్వే చేశారు. చిత్తూరు నియోజకవర్గంలోని రెండు మండలాల్లో 750, జీడీనెల్లూరులో 3 వేలు, నగరిలో 1,500, పలమనేరులో 9,600, పుంగనూరులో 2,700, పూతలపట్టులో రెండు వేల దరఖాస్తులు సర్వే చేశారు. ఈ ప్రక్రియ పూర్తయ్యాక జనవరిలో మంజూరు పత్రాలు అందించే అవకాశాలు ఉన్నాయని అధికారులు పేర్కొన్నారు.

# మినుము రైతులకు ప్రోత్సాహకాలు

అనకాపల్లి : కారణాలు ఏవైనా అపరాల సాగు విస్తీర?ం తగ్గుతోంది. ముఖ్యంగా మినుము విస్తీరం ఏటికేడు పడిపోతోంది. ఫలితంగా మార్కెట్‌లో మినపప్పు ధరలు మండుతున్నాయి. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం మినుము సాగు విస్తీరం పెంపునకు చర్యలు చేపడుతోంది. రైతులకు ఉచితంగా విత్తనాలు అందజేయాలని నిరయించింది. జిల్లా వ్యాప్తంగా 4,700 విత్తన కిట్లు ఇవ్వనున్నారు. కేజీ విత్తనం ధర రూ. 138. ఒక్కో కిట్‌లో నాలుగు కేజీల విత్తనాలు ఉంటాయి. అర ఎకరా విస్తీర?ంలో సాగు చేసేందుకు సరిపోతాయి. జిల్లాలో వరి కోతల అనంతరం రైతులు అపరాలు సాగు చేస్తుంటారు. ప్రస్తుతం వరి కోతలు ప్రారంభమయ్యాయి. రబీలో వరి సాగు తక్కువ. ఖరీఫ్‌లో 85,884 హెక్టార్లలో వివిధ పంటలు సాగు చేస్తుంటే రబీలో 15,662 హెక్టార్లలోనే పంటలు వేస్తున్నారు. దాదాపు 70 వేల హెక్టార్ల భూమి ఖాళీగా ఉండిపోతుంది. ఈ క్రమంలో రబీ విస్తీర?ం పెంచాలని ప్రభుత్వం నిర?యించింది. జిల్లాలో పెసర 6,273 హెక్టార్లలో సాగవుతుంటే.. మినుము 2,753 హెక్టార్లలోనే వేస్తున్నారు. పుష్కర కాలం కిందట జిల్లాలో 5,380 హెక్టార్లలో మినుము సాగయ్యేది. ఏటా సాగు విస్తీర?ం తగ్గుతూ వస్తోంది. రెండేళ్ల కిందట 2,641 హెక్టార్లకు పడిపోయింది. కూటమి ప్రభుత్వం వచ్చాక అపరాల సాగు విస్తీర?ం పెంపుపై దృష్టిసారించింది. గతేడాది రబీలో 3,098 హెక్టార్లకు సాగు పెరిగింది. ఈ ఏడాది కనీసం ఐదు వేల హెక్టార్లలో సాగును ప్రోత్సహించాలని వ్యవసాయ అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. వరి కోతలకు రెండు, మూడు రోజుల ముందు మినుము విత్తనాలు వేసేలా కిట్లను అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

# పోలీసులు.. పిండేస్తున్నారు కాసులు!



అనంతపురం : నేరాలను కట్టడి చేసి నేరస్థులను జైలుకు పంపించాల్సిన పోలీసుల్లో కొందరు అవినీతికి పాల్పడుతున్నారు. అక్రమార్జనకు అలవాటుపడి కాసుల కక్కుర్తితో కేసులను తారుమారు చేస్తున్నారు. సివిల్ పంచాయతీలు సైతం చేస్తుండటం వివాదాస్పదంగా మారాయి. అనంతపురం జిల్లా తాడిపత్రి, కళ్యాణదుర్గం, గుంతకల్లు, అనంతపురం సబ్‌డివిజన్ పరిధిలోని ఎంతోమంది పోలీసులపై విమర్శలు గుప్పుమంటున్నాయి.

తాడిపత్రి సబ్‌డివిజన్‌లో ఓ అధికారిని ఉన్నతాధికారులు మూడోసారి వీఆర్‌కు పంపినా ఆయన తీరులో మార్పు రాలేదు. గుంతకల్లు సబ్ డివిజన్‌లో పనిచేసే క్రమంలో వైకాపా నాయకులను అడ్డం పెట్టుకుని ఇసుక దందా చేయించారు. జూదం పెచ్చరిల్లినా మామూళ్లు తీసుకుని పట్టించుకునేవాడు కాదు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులను బూతులు తిట్టడం, ప్రశ్నిస్తే చేయి చేసుకోవడం వంటివి ఉండేవి. ఇతని వ్యవహారం తెలిసి వీఆర్‌కు పంపారు. కూటమి ప్రభుత్వం వచ్చాక తాడిపత్రి సబ్ డివిజన్‌కు వెళ్లాడు. అక్కడ ఇద్దరు కానిస్టేబుళ్లను వసూళ్లకు పంపి.. ప్రతి కేసుకూ లెక్క కట్టి వసూలు చేసేవాడు. తాజాగా ఓ ప్రేమజంట విషయంలో పంచాయితీ చేసి డబ్బులు వసూలు చేశాడు. ఎస్పీకి ఫిర్యాదులు అందడంతో పది రోజుల క్రితం మరోసారి వీఆర్‌కు పంపారు. అనంతపురం సబ్ డివిజన్‌లో ఓ అధికారి ఏ స్టేషన్‌లో చేరినా వివాదాస్పదమే. ప్రభుత్వం ఏదైనా, అధికారి ఎవరైనా అక్రమాలకు పాల్పడుతుంటాడు. గతేడాది నగరంలో ఓ స్టేషన్‌నుంచి మరో స్టేషన్ బదిలీ అయ్యాడు. మట్కా, జూదం, గంజాయి, రేషన్ బియ్యం అక్రమ రవాణా ఉండే ఆ ప్రాంతంలో అక్రమార్కులతో చేతులు కలిపి నెలవారీ వసూళ్లు చేసేవాడు. బియ్యం మాఫియాతో రూ. లక్షల్లో లంచాలు తీసుకున్నట్లు ఆరోపణలు రావడంతో వీఆర్‌కు పంపారు.

**ఐడీ పార్టీ ముసుగులో..!** ఉరవకొండ సర్కిల్‌లో పనిచేసే ఓ కానిస్టేబుల్ ఐడీ పార్టీలో విధులు నిర్వహిస్తున్నాడు. అతడు గత వైకాపా ప్రభుత్వంలో ఉరవకొండలోనే పనిచేశాడు. అప్పట్లో తెదేపా నాయకులు, కార్యకర్తలను వేధింపులకు గురిచేశాడు. ప్రభుత్వం మారాక బదిలీ అయ్యాడు. కొందరు నాయకుల అండతో తిరిగి పాత సర్కిల్‌కు వచ్చాడు. ఆ కానిస్టేబుల్ జనాన్ని వేధిస్తూ, వ్యాపారుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నాడు. ఎక్కడైనా రద్దీ ప్రాంతం కనిపిస్తే చాలు.. నిలబడి అనధికారిక తనిఖీలు చేసి సొమ్ము చేసుకుంటున్నాడు. కళ్యాణదుర్గంలో ఓ కానిస్టేబుల్ జూదం, మట్కా, నాటుసారా కాసేవాళ్లలో మామూళ్లు తీసుకుని అక్రమాలకు పాల్పడుతున్నాడు. స్టేషన్‌కు వచ్చే బాధితులను డబ్బులు తీసుకుని బయటే పంచాయితీ చేసి పంపుతున్నాడు. శెట్టూరు స్టేషన్‌లో ఓ హెడ్‌కానిస్టేబుల్, ఓ కానిస్టేబుల్ ప్రజాకంతకులుగా మారారు. ఆ స్టేషన్‌కు కొంతకాలం అధికారి లేడు. కేసుకో రేటు నిర?యించి బాధితులతో డబ్బులు వసూలు చేశాడు. అదే స్టేషన్‌లో ఓ కానిస్టేబుల్ మద్యం అక్రమార్కులు, జూదం, మట్కా మాఫియాలతో సన్నిహితంగా మెలుగుతూ చేతికందినంత పోగేసుకుంటున్నా ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదు.

# అతివల భవితకు ఉషస్సు!



గుంతకల్లు : మహిళలకు సమాన అవకాశాలు కల్పించాలని, సాధికారత సాధన కోసం ఎన్డీయే ప్రభుత్వం గుంతకల్లులోని ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఎంపిక చేసింది. రాష్ట్రంలో గుంతకల్లుతో పాటు శృంగవరపుకోటలోని కళాశాలలను పీఎం ఉష పథకం కింద ఎంపిక చేసి అమలు చేయడం ప్రారంభించింది. మహిళలు విద్యతోపాటు, వివిధ అంశాల్లో శిక్షణ పొందడానికి ఇబ్బందులు పడుతున్నారని.. మధ్యలో చదువు నిలిపివేస్తున్నారని సర్కారు గుర్తించి... వారి అభ్యున్నతికి అవసరమైన సౌకర్యాలను కల్పిస్తోంది.

**రూ. 10 కోట్లు కేటాయింపు**

మహిళలకు అవసరమైన సౌకర్యాలను ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కలుగజేయడానికి రూ. 10 కోట్లు కేటాయించింది. ఇందులో భాగంగా కళాశాల ఆవరణలో రూ. 6కోట్లతో హాస్టల్ భవనాల నిర్మాణం సాగుతోంది. శిక్షణ పరికరాలు కొనుగోలుకు రూ. 2. 50 కోట్లు, ఇతర సామగ్రికి రూ. 1. 50 కోట్లు వ్యయం చేస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వం 25 కంప్యూటర్లు, జిరాక్స్ మిషన్లు, ప్రింటర్లు, ఎల్ఈడీ స్క్రీన్‌లు, ప్యానళ్లు సరఫరా చేసింది. హాస్టల్ భవనాల పనులు పూర్తయితే ఇతర సామగ్రిని సరఫరా చేయనుంది.

ఇప్పటికే అధికారులు పలు అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు. వసతిగృహాలు అందుబాటులోకి వస్తే కొత్త కోర్సుల్లోనూ తరీదు ఇస్తారు. ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన మహిళలే కాకుండా రాష్ట్రంలో ఏ ప్రాంతంలోనైనా నివసిస్తున్న వారు హాస్టల్‌లో చేరడానికి ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది.

**ఎందులో తరీదు ఇస్తారంటే..**

- డ్రోన్‌ల వినియోగం
- కృత్రిమ మేధస్సు
- ఆత్మవిశ్వాసం
- ఆరోగ్య పరిరక్షణ
- స్వీయరక్షణజి

**చట్టాలపై అవగాహన**

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ఉష పథకాన్ని మహిళలు పూర్తిగా సద్వినియోగం చేసుకుని జీవితాలను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవచ్చు మహిళల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. గుంతకల్లులోని ప్రభుత్వ కళాశాలను ఎంపిక చేయడం అదృష్టంగా భావిస్తున్నాం. ఆసక్తి ఉన్న మహిళలు అవకాశాన్ని అందిపుచ్చుకుని ముందడుగు వేయాలి.

డాక్టర్ లక్ష్మయ్య, ప్రధానాచార్యులు

# అన్నదాతల ఆశలకు గండి



అనంతపురం : అధికారుల్లో ముందుచూపు కొరవడింది. కనీస జాగ్రత్తలు తీసుకోలేదు. వారి నిర్వాకం.. నిర్లక్ష్యం మూలంగా ఒకే రోజులో ఉమ్మడి అనంతపురం జిల్లాకు ఎంతో కీలకమైన హెచ్ఎల్‌సీ ప్రధాన కాలువ, పీఏబీఆర్ కుడి కాలువ గట్లు తెగిపోయాయి. ఆదివారం ఉదయం బొమ్మనహాళ్ మండలం ఉంతకల్లు 113-507 కిలోమీటరు వద్ద హెచ్చెల్సీ కాలువకు గండి పడి సుమారు 100 క్యూసెక్కుల నీరు వృథాగా పోయింది. 2023లోనూ ఇక్కడే కాలువకు రంధ్రం పడినప్పుడు అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేసి చేతులు దులుపుకోవడంతోనే మళ్లీ పరిస్థితి పునరావృతమైంది. నీరంతా కోతలు కోసే వరి మళ్లలోకి వెళ్లడంతో సుమారుగా 200 ఎకరాల్లో పంటకు నష్టం కలిగినట్లు అన్నదాతలు వాపోయారు. అధికారులు టీబీ డ్యాం ఉన్నతాధికారులతో మాట్లాడి నీటి ప్రవాహాన్ని నిలిపివేయించి గండిని తాత్కాలికంగా పూడ్చారు. ఇదిలా ఉండగా దిగువన కూడేరు మండలం జల్లిపల్లి సమీపంలోని పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్) కుడి కాలువ గట్టు కోతకు గురైంది. నీరు పెద్దఎత్తున పంట పొలాల్లోకి వెళ్లడంతో సుమారు 50 ఎకరాల్లో కంది, వరికి నష్టం వాటిల్లింది. కొర్రకోడు డ్యాం సమీపంలోని ఎస్కేప్ ఛానల్ ద్వారా నీటిని పెన్నానదికి మళ్లించడంతో ప్రవాహం తగ్గింది. అంతకు ముందు.. కాలువ తెగిన ప్రదేశంలో వెంటనే మరమ్మతు పనులను చేపట్టాలని మంత్రి పయ్యావుల కేశవ్, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు జిల్లా జలవనరులను అధికారులను ఆదేశించారు.

# వాహనదారులూ.. ఈ సేవలు తెలుసా

పుత్తూరు: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఎటువైపు ప్రయాణం చేయాలన్నా జాతీయ రహదారుల్లో వెళ్లాల్సిందే. టోల్‌గేట్ల వద్ద రుసుము చెల్లిస్తూ.. దాటాల్సిందే. మరి ఇలా వసూలు చేసే డబ్బులతో వాహనదారులకూ పలు సౌకర్యాలు కల్పిస్తారని తెలుసా.. అవేంటో తెలుసుకుందామా..!జాతీయ రహదారులపై ప్రయాణించే సమయంలో ఏదైనా ప్రమాదం జరిగినా.. వాహనం బోల్తాపడినా.. మరమ్మతుకు గురై ఆగిపోయినా 1033 నంబరు సంప్రదించాలి. ఫోన్ చేసిన వెంటనే దిల్లీలోని కేంద్ర కార్యాలయానికి సమాచారం చేరుతుంది. సమీపంలోని టోల్‌గేట్ నిర్వాహకులు స్పందించి తక్షణమే సిబ్బంది వచ్చి సాయం చేస్తారు. వాహనంలో పెట్రోల్, డీజిల్ అయిపోయినా ఈ నంబరు ద్వారా సాయం పొందవచ్చు.

**ఉమ్మడి జిల్లాలో జాతీయ రహదారులు**

పూతలపట్టు- నాయుడుపేట

తిరుపతి- చెన్నై

చిత్తూరు- బెంగళూరు

చెన్నై- గూడూరు

పోలీసుల సాయం.. 112



జాతీయ రహదారుల్లో అనుకోని సంఘటనలు జరిగిన సమయంలో 112ను సంప్రదిస్తే పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుంటారు. దీనికితోడు టోల్‌ప్లాజాల వద్ద 24 గంటలు అంబులెన్స్, క్రేన్, హైవే పెట్రోలింగ్ వాహనం అందుబాటులో ఉంటాయి. వాహనాల పార్కింగ్ స్థలాలు, డ్రైవర్లు విశ్రాంతి తీసుకునేందుకు గదులు ఉంటాయి. ఈ సేవలన్నీ ఉచితమే.

**ఫొటో పెట్టు.. రివార్డు పట్టు**

జాతీయ రహదారుల సంస్థ ఇటీవల ఓ ప్రకటన చేసింది. టోల్‌ప్లాజాల వద్ద పురుషులు, మహిళలకు వేర్వేరుగా మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలి. అదే సమయంలో అవి అపరిశుభ్రంగా ఉంటే ఫొటో తీసి రాజ్‌మార్గ్ యాత్ర యాప్‌లో అప్‌లోడ్ చేస్తే రివార్డు కూడా ఇస్తారు.

**సేవలకు ఎస్‌వోఎస్..**

జాతీయ రహదారిపై ప్రతి రెండు నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో రోడ్డు పక్కన పసుపు రంగు స్తంభాల వద్ద ఎస్‌వోఎస్ పెట్టెలు ఉంటాయి. ఎలాంటి అవసరమైనా దానిపై ఉండే మీటను నొక్కితే సిబ్బంది ఆ ప్రాంతానికి చేరుకుని సేవలందిస్తారు.

# ఈ రీ'తీగ' ఉంటే ఎలా?

పుత్తూరు : విద్యుత్తు ప్రమాదాలు తరచూ జరుగుతున్నా డిస్కం అధికారులు స్పందించడం లేదు. తూతూమంత్రంగా చర్యలు చేపట్టి చేతులు దులుపుకొంటున్నారు. దీంతో ప్రాణ, ఆస్తి నష్టాలు విలువ కట్టలేనంత జరుగుతున్నాయి. ఉన్నతాధికారులు చెప్పే మాటలకు క్షేత్రస్థాయిలో పనితీరుకు భిన్నంగా ఉంది. తిరుపతిలో ఎస్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం ఉన్నా తిరుపతి, చిత్తూరు జిల్లాలో తరచూ విద్యుత్తు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

నగరపాలక సంస్థలు, పట్టణాలు, గ్రామాల్లో ఏళ్ల కిందట లాగిన విద్యుత్తు తీగలు(కండక్టర్లు) నేటికీ అలానే ఉన్నాయి. ఇవి ఉన్నట్లుండి తెగిపోతున్నాయి. సకాలంలో మరమ్మతు చేయడంలో తీవ్ర జాప్యం నెలకొంటోంది. తీగలు ఎక్కడైనా తెగిన వెంటనే ఉపకేంద్రాల్లోని బ్రేకర్స్ ట్రిప్ అవ్వాలి. అలా జరిగితే సరఫరా నిలిచిపోతుంది. దీనివల్ల ప్రమాదాలు సంభవించవు. అయితే ఈ ఉపకేంద్రాల్లోని బ్రేకర్స్ పలుచోట్ల సక్రమంగా పనిచేయడం లేదు. ఇందుకు కారణం ఎర్త్ వైర్లు సక్రమంగా లేకపోవడమే. దీనివల్లే ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయి.

**ఇలా జరగట్లేదేం..?**

ఉపకేంద్రాల్లో క్రమం తప్పక నిర్వహణ చేపట్టాలి. ప్రతి అంశాన్ని పరిగణనలోకి తీసుకుని క్షుణ?ంగా పరిశీలించి మార్పులు, చేర్పులు చేయాలి.

అవసరమైన చోట్ల కొత్త సామగ్రి ఏర్పాటు చేయాలి. అది అందుబాటులో లేక పాత వాటినే సరిచేసి వినియోగిస్తున్నారు. ఇవి కొద్దికాలం పనిచేసి ఆపై మొరాయిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో బ్రేకర్స్, ఎర్త్‌లు పనిచేయక పలు ప్రాంతాల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి.

**పలు కాలనీల్లో ఇళ్లపై లైన్లు**

నగరాలు, పట్టణాల్లో పలు కాలనీల్లో ఇళ్లపైనే విద్యుత్తు తీగలు వెళ్తున్నాయి. పుత్తూరు ఎన్జీవో కాలనీలో ఇళ్లపై 11కేవీ విద్యుత్తు లైన్లు వెళ్తుంటాయి. కనీసం ఆ ప్రాంతంలో కేబుల్ వ్యవస్థ ఏర్పాటు చేసే అవకాశం ఉన్నా ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. జీడీనెల్లూరు నియోజకవర్గంలోని పలు మండలాల్లోనూ ఇదే దుస్థితి.

# సర్వే ఆలస్యం.. అనుమానాలే సమస్తం

శ్రీకాళహస్తి: గత ప్రభుత్వ హయాంలో కాళహస్తి పరిధి రాజీవ్‌నగర్‌లో పేదలకు పంపిణీ చేసిన పట్టాలు అక్రమార్కుల చేతుల్లోకి వెళ్లాయి. 2007లో ఇక్కడ దాదాపు 6500 ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఇందులో చాలావరకు వైకాపా నేతలు దక్కించుకున్నారు. ఎవరికి వారు అడ్డగోలుగా పట్టాలు అమ్ముకోవడం, సొమ్ము చేసుకోవడం సర్వసాధారణంగా మారింది. ఈ విషయం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి వెళ్లింది. దీంతో ఆయన సమగ్రమైన సర్వేకు ఆదేశించడంతో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అందుకు శ్రీకారం చుట్టారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఇప్పటికి రెండు దఫాలు సర్వే జరిగింది. 12 బ్లాక్‌ల్లో ఏడు సర్వే బృందాలతో ఇంటింటా సర్వే చేయించారు. అయినా ఇప్పటికీ పూర్తి స్థాయిలో జరగకపోవడం గమనార్హం. **ఒక పట్టా.. ఐదారుగురి పేర్లు** ప్రస్తుతం ఖాళీగా ఉన్న దాదాపు 1800 ఇళ్ల స్థలాలకు సంబంధించి సర్వే పూర్తి కావాల్సి ఉంది. ఇక్కడ లబ్ధిదారులు ఒకరైతే.. పట్టాలు దాదాపు ఐదారుగురు పేర్లపై ఉన్నాయి. పట్టాలు లేకుండా చేతులు మారిన స్థలాలూ ఉండటం గమనార్హం. ఖాళీ స్థలాల సర్వే అధికారులకు శిరోభారంగా మారింది. వైకాపా హయాంలో అక్రమాలకు పాల్పడిన కొందరు తాజాగా కూటమి నేతలతో జతకట్టారు. వారి సహకారంతో అవినీతి, అక్రమాలు వెలుగులోకి రాకుండా చూసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ కారణంగానే సర్వే ఆలస్యం అవుతోందన్న ఆరోపణలు ఉన్నాయి. వరుసగా వర్షాలు, ప్రభుత్వ కార్యక్రమాలు, ఇతర కారణాలతో కొంత ఆలస్యమైందని అధికారులు చెబుతున్నా.. వివాదాస్పదంగా ఉన్న ఖాళీల పట్టాలు ఇంకనూ లెక్క తేలకపోవడం విమర్శలకు తావిస్తోంది.

చురకలు


# అక్రమాలు కనబడితే ఒట్టు

నంద్యాల :ఈ చిత్రంలోనిది.. ఆళ్లగడ్డ పట్టణంలోని మక్దుమ్ ఎయిడెడ్ ఉర్దూ పాఠశాల. ఇక్కడ ఒక విద్యార్థి కూడా లేరు. ఉపాధ్యాయులు ఇద్దరున్నారు. గతేడాది నుంచి ఒక్క విద్యార్థి కూడా రావడం లేదు. దస్త్రాల్లో మాత్రం ముగ్గురు ఉన్నట్లు చూపుతున్నారు. ఉపాధ్యాయులు రోజూ రావడం.. రిజిస్టరులో సంతకం చేసి వెళ్లడం సాధారణంగా మారింది. దస్త్రాల్లో మాత్రం పాఠశాలల వివరాలు కనపడుతాయి. విద్యార్థులు చదువుకుంటున్నట్లు చూపుతారు. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే వెతికి చూసినా ఒక్క విద్యార్థి కూడా ఉండడు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఉన్న ఎయిడెడ్ పాఠశాలల పరిస్థితి ఇది. వీటిని నిత్యం తనిఖీ చేసి చర్యలు తీసుకోవాల్సిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.

**దస్త్రాల్లో అన్నీ బాగున్నట్లు..**

నంద్యాల జిల్లాలో 47 ఎయిడెడ్ పాఠశాలలు ఉండగా ఇందులో 15 ఉన్నత విద్యాలయాలున్నాయి. కర్నూలు జిల్లాలో 38 పాఠశాలలు ఉండగా.. ఇందులో 14 ఉన్నత బడులు ఉన్నాయి. రెండు జిల్లాల్లో కొన్ని ఎయిడెడ్ పాఠశాలలు అంతంతమాత్రంగా నడుస్తున్నాయి. నిర్వాహకులు కనిపించరు. విద్యార్థులు అసలే రారు. విద్యాశాఖ దస్త్రాల్లో మాత్రం పాఠశాలలు రోజూ నడుస్తున్నట్లే 'లెక్క'.



**ప్రత్యేక కమిటీల ఏర్పాటు**

ఉమ్మడి జిల్లాలో ఎయిడెడ్ పాఠశాలల తనిఖీలకు పాఠశాల విద్యాశాఖ ప్రత్యేక కమిటీలు వేసింది. ప్రస్తుతమున్న విద్యార్థుల సంఖ్య ఎంత? ఎన్ని పోస్టులు ఉన్నాయి? ఎలాంటి సదుపాయాలున్నాయి తదితర వివరాలను కమిటీలు పర్యవేక్షించనున్నాయి. పిల్లల సంఖ్య ఆధారంగా కొత్త ఉపాధ్యాయుల అవసరం ఉందా? లేదా? కూడా తనిఖీ చేయనున్నాయి.

**అంతా బోగస్**

ఉమ్మడి జిల్లాలో పలు ఎయిడెడ్ పాఠశాలలు బోగస్ హాజరు నమోదుతో నడుస్తున్నాయి. నంద్యాల జిల్లాలోని రుద్రవరం, శిరివెళ్ల, జిల్లెల్ల గ్రామాల్లోని ప్రాథమిక ఎయిడెడ్ పాఠశాలల్లో విద్యార్థులు లేరు. లేని హాజరు చూపి పాఠశాల రద్దు కాకుండా.. ప్రభుత్వం నుంచి వచ్చే సదుపాయాలను కొన్ని యాజమాన్యాలు పొందుతున్నాయి. లేని విద్యార్థుల సంఖ్యను చూపి ఉపాధ్యాయులు, సిబ్బంది అవసరమంటూ పోస్టుల భర్తీకి కొన్ని యాజమాన్యాలు ప్రయత్నిస్తున్నాయి. యూడైస్ ప్రకారం విద్యార్థుల సంఖ్యను నమోదు చేయాల్సిన అధికారులు తప్పుడు నివేదికలిచ్చారన్న ఆరోపణలున్నాయి.

# నగరానికి బాహ్య వలయ మార్గం

కర్నూలు : నగరంలో ట్రాఫిక్ రద్దీ రోజురోజుకు పెరుగుతోంది. కూడళ్ల వద్ద వాహనదారులు నరకయాతన అనుభవిస్తున్నారు. ఈ నేపథ్యంలో సమస్యను పరిష్కరించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. బస్సులు, భారీ వాహనాలు వలయ మార్గంలో వెళ్లేలా సన్నాహాలు చేస్తున్నారు. నగరంలో భారీ వాహనాలు తిరగకుండా నేరుగా బైపాస్ రోడ్డుపై వెళ్తూ రింగ్‌రోడ్డుకు అనుసంధానం చేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే నగరపాలక, ఆర్అండ్‌బీ అధికారులు రింగ్‌రోడ్డు నిర్మిత ప్రాంతాలను పరిశీలించారు. పనులు పూర్తైతే ట్రాఫిక్ సమస్యలు కొంతమేర తీరుతాయి.

**17 కి.మీ. మేర..**

రానున్న రోజులను దృష్టిలో ఉంచుకొని ఔటర్ రింగ్ రోడ్డుకు ప్రతిపాదనలకు అధికారులు రంగం సిద్ధం చేశారు. మాస్టర్ ప్లాన్ ఆధారంగా రెండు వందల అడుగుల వెడల్పుతో 17 కి.మీ.ల మేర రింగ్‌రోడ్డు ఏర్పాటుకు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఇప్పటికే నగరపాలక, ఆర్అండ్‌బీ అధికారులు రింగ్ రోడ్డు ఏర్పాటుచేసే ప్రాంతాన్ని పరిశీలించారు. మూడు నెలల్లో డీపీఆర్ తయారు చేయనున్నారు. రింగ్‌రోడ్డు ప్రతిపాదిత ప్రాంతంలో ఎన్ని వాహనాలు తిరుగుతున్నాయో అంచనా వేస్తారు. నిధులు మంజూరైతే పనులు ప్రారంభిస్తారు.



**అనుసంధానం చేసేలా చర్యలు**

కల్లూరు పట్టణం లక్ష్మీపురం బైపాస్ నుంచి కోడుమూరు రోడ్డు పెద్దపాడు సమీపం వరకు 7.2 కి.మీ.లు ఉంటుంది. పెద్దపాడు సమీపంలోని కోడుమూరు రోడ్డు నుంచి హైదరాబాద్ రహదారి ఎన్‌హెచ్-44 వద్ద మునగాలపాడు రోడ్డు వరకు 9.9 కి.మీ.లు మేర రింగ్‌రోడ్డు అనుసంధానం చేస్తారు. సూరత్ హైవే మీదుగా వాహనాలు వెళ్లకుండా కోడుమూరు మార్గాన్ని ఉపయోగించేలా అధికారులు చర్యలు తీసుకోనున్నారు. భవనాలు, ప్రైవేటు భూములు కోల్పోకుండా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఔటర్ రింగ్ రోడ్డు ఎక్కువ భాగం ప్రభుత్వ భూమిలో వెళ్లేలా సన్నాహాలు చేస్తున్నారు.

ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణం పూర్తైతే ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ తెలిపారు.

# బీసీలకూ.. సూర్య వెలుగులు



చిత్తూరు : వినియోగదారుల విద్యుత్తు బిల్లులు తగ్గించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం.. పీఎం సూర్యఘర్ పథకం విస్తరణకు కూటమి ప్రభుత్వ సారథ్యంలో వేగవంతం చేసింది. ఇంటి పైకప్పుపై సౌర పలకలు ఏర్పాటు చేసుకునే ఓసీ, బీసీ సర్వీసుదారులకు రాయితీలు అందజేస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా 21 లక్షల మంది బీసీల ఇళ్లపై రూఫ్‌టాప్ సోలార్ పలకలు ఉచితంగా ఏర్పాటు చేయాలని నిర?యించింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 3.45 లక్షల బీసీ వర్గాల గృహ సర్వీసుదారుల నివాసాలపై సూర్య వెలుగులు మున్ముందు ప్రకాశించనున్నాయి.

**ఎస్సీ, ఎస్టీలకు 16 వేల పలకల ఏర్పాటు**

ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా సౌర పలకులు ప్రభుత్వం ఎస్పీడీసీఎల్ ఆధ్వర్యంలో అమర్చుతోంది. తొలుత జిల్లాలో ఎస్సీ, ఎస్టీ సర్వీసుదారులకు 16 వేల సౌరశక్తి యూనిట్ల ఏర్పాటు లక్ష్యంగా నిర?యించింది. ఇప్పటికే వీటి ఏర్పాటుపై టెండర్ల ప్రక్రియ పూర్తయింది. ఆయా పనులు చేపట్టేందుకు చిత్తూరు జిల్లాకు ఓ కంపెనీని కేటాయించారు. త్వరలో పనులు ప్రారంభించనున్నారు. **గ్రిడ్‌కు అనుసంధానం..**

ఇళ్ల పైకప్పులపై సౌరపలకలు ఏర్పాటు చేసి.. విద్యుదుత్పత్తి చేసి సొంతానికి వినియోగించుకున్నది పోను.. మిగిలింది గ్రిడ్‌కు అనుసంధానిస్తారు. ఒకసారి ఏర్పాటు చేసుకుంటే పాతికేళ్ల పాటు విద్యుత్తు పొందే అవకాశం ఉంది. బీసీలు సూర్యఘర్ పథకంలో ఉచితంగా రూఫ్‌టాప్ పలకల ఏర్పాటుకు అధికారులు తొలిఅడుగు వేశారు.

జిల్లాలో బీసీ వర్గాల గృహ సర్వీసులు ఇలా..(లక్షల్లో)

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో

సర్వీసులు: 3.45

చిత్తూరు జిల్లా : 1.45

తిరుపతి జిల్లా : 1.90

మార్గదర్శకాలకు అనుగుణంగా..

బీసీ వర్గాల గృహ సర్వీసులకు ఉచితంగా సూర్యఘర్ పథకం అమలుపై ఉత్తర్వులు రావాల్సి ఉంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ పథకాన్ని విస్తృతంగా అమలు చేస్తాం. ఈ పథకం ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తున్నాం.ఇస్మాయిల్ అహ్మద్, ఎస్ఈ, చిత్తూరు జిల్లా

# బినామీ రిజిస్ట్రేషన్లు.. బోగస్ దందా




చిత్తూరు : జీఎస్టీ రిటర్న్‌లో అక్రమాలకు పాల్పడిన తుక్కు మాఫియా ముఠా నాయకుడిని అధికారులు గుర్తించారు. అతడిని అదుపులోకి తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ విషయాన్ని అధికారులు ధ్రువీకరించడం లేదు. కాకిలెక్కలతో రూ.కోట్ల లావాదేవీలు చూపి పన్ను మినహాయింపు మొత్తాన్ని రిటర్న్ ద్వారా దోచుకున్నట్లు గుర్తించారు. అమాయకులకు నగదు ఆశ చూపి వారి పేరుతో నాలుగు బోగస్ సంస్థలను రిజిస్ట్రేషన్ చేయించాడు. ఆంధ్ర, తమిళనాడు, కరా?టక రాష్ట్రాల్లో క్రయవిక్రయాలు చేసినట్లు నకిలీ బిల్లులు సృష్టించి సీజీఎస్టీ ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ సొమ్ము దోచుకున్నారు. చిత్తూరు కేంద్రంగా ఇటీవల వెలుగు చూసిన ఈ వ్యవహారం సంచలనం సృష్టించింది.

**అక్రమాలకు పాల్పడిన సంస్థలు ఇవే..**

చిత్తూరు నగరానికి చెందిన అరహం పెట్రో అండ్ నాన్ పెట్రో సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, మదీనా స్టీల్స్, జెడ్ఎఫ్ ట్రేడర్స్, యార్ స్టీల్స్, ఎమ్మార్ స్టీల్స్ ప్రైవేట్ లిమిటెడ్.. ఇవన్నీ బినామీ పేర్లతో రిజిస్ట్రేషన్ అయ్యాయి. వాటిద్వారా పెద్దఎత్తున వ్యాపారం చేసినట్లు నకిలీ బిల్లులు సృష్టించి సీజీఎస్టీ రిటర్న్ చేయించుకుని ప్రభుత్వ సొమ్ము రూ.కోట్లలో కాజేసినట్లు విచారణ బృందాలు తేల్చాయి.


**ఎలా గుర్తించారంటే..**

తుక్కు మాఫియా ముఠా నాయకుడి ఫోన్ నంబరు ఆధారంగా కాల్ రికార్డులు సేకరించి నిత్యం మాట్లాడే వారి నంబర్లు, జరిగిన సంభాషణ, బినామీ పేర్లతో రిజిస్టరైన సంస్థలు, సీజీఎస్టీ ఇన్‌పుట్ టాక్స్ రిటర్న్ చేయించిన ఖాతాలు, వారి ఆర్థిక లావాదేవీలతో పాటు, మధ్యవర్తులుగా వ్యవహరించిన కొందరిని అదుపులోకి తీసుకుని వివరాలు రాబడుతున్నారు. త్వరలో ఈ దందాలో ముఠా నాయకుడితో పాటు, మరికొందరిని అదుపులోకి తీసుకుని మొత్తం వ్యవహారాన్ని గుట్టురట్టు చేయనున్నారు.

**ముఠా నాయకుడు చిత్తూరు వాసి..**

తుక్కు వ్యాపార సామ్రాజ్యాన్ని సృష్టించి అక్రమ మార్గంలో రూ.కోట్లు గడిస్తున్న బోగస్ సంస్థలన్నింటికీ అంతిమ ముఠా నాయకుడు చిత్తూరు వాసిగా గుర్తించారు. గతంలోనూ అతడి అక్రమాలు గుర్తించి కేసులు నమోదు చేసినా, తనకున్న పలుకుబడి, ఆర్థిక బలంతో పాటు వాణిజ్య పన్నుల శాఖలోని కొందరి అధికారుల సహకారంతో తన అక్రమ వ్యాపారాన్ని కొనసాగించినట్లు విచారణలో వెల్లడైనట్లు తెలిసింది. అమాయకులు, దినసరి కూలీలు, తోపుడు బండ్లపై చిరు వ్యాపారం చేసుకునే పేదలకు మధ్యవర్తుల ద్వారా రూ.10 వేల నుంచి రూ.20 వేలు ఇవ్వడం, వారి ఆధార్, పాన్, చరవాణుల నుంచి ఓటీపీ నంబర్లు తీసుకుని బినామీ సంస్థలు రిజిస్ట్రేషన్ చేయించారు. బ్యాంకుల్లోనూ వారి ఖాతాలకు సీజీఎస్టీ రిటర్న్ చేయించి ఆ మొత్తాన్ని దోచుకున్నట్లు గుర్తించారు.

# కొండకు ఎకో ముద్ర



తిరుపతి: తిరుమల క్షేత్రాన్ని సంపూర కాలుష్య రహితంగా తీర్చిదిద్దేందుకు భారీ కార్యాచరణ మొదలైంది. రాష్ట్ర ప్రభుత్వ విధానంలో భాగంగా 2029 నాటికి ఆర్టీసీ బస్సులన్నీ ఎలక్ట్రిక్ మయం చేయాలన్న లక్ష్యంతో ఆర్టీసీ అధికారులు వడివడిగా అడుగులు వేస్తున్నారు. ఇందులో భాగంగా నూతన సంవత్సరంలో తిరుపతి, తిరుమలకు అదనపు బస్సులు రానున్నాయి.

**ముందుగా 50.. ఆపై 300**

తిరుమల ఘాట్ రోడ్లలో ప్రస్తుతం 64 ఎలక్ట్రిక్ బస్సులు నడుస్తుండగా.. కడప, నెల్లూరు, మదనపల్లె మార్గాల్లో మరో 36 సర్వీసులు తిరుగుతున్నాయి. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని కొత్తగా మరో 50 బస్సులకు ఆర్టీసీ టెండర్లు ఖరారు చేసింది. 'ఈకా' సంస్థ ఈ బస్సులను సరఫరా చేయనుండగా.. రానున్న 3-6 నెలల్లో ఇవి అందుబాటులోకి రానున్నాయి. ఇవి కాకుండా.. తిరుమలకు ప్రత్యేకంగా మరో 300 బస్సులు కేటాయించాలని సీఎం కేంద్రాన్ని కోరడంతో అందుకు ఆమోదం లభించింది. వాటికి సంబంధించిన రూట్‌మ్యాప్, ప్రతిపాదనల ప్రక్రియ 95 శాతం పూర్తయిందని ఆర్టీసీ వర్గాలు తెలిపాయి. **కేంద్రమే నోడల్ ఏజెన్సీ**ఎలక్ట్రిక్ బస్సుల ధరలు, నిర్వహణ వ్యయం అధికంగా ఉండటంతో.. కేంద్ర ప్రభుత్వమే నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తోంది. పీఎం ఈ - సేవ కింద దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి వివరాలు సేకరించి, కేంద్రమే టెండర్లు పిలుస్తుండటంతో తక్కువ ధరకే బస్సులు అందుబాటులోకి వస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో ఎంపిక చేసిన 11 నగరాల్లో తిరుపతికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వడం విశేషం.

**కొండపైనే ప్రత్యేక డిపో**

ప్రస్తుతం అలిపిరి డిపో, తిరుపతి బస్టాండ్ పరిధిలో 36 ఛార్జింగ్ పాయింట్లు అందుబాటులో ఉన్నాయి. భవిష్యత్తులో బస్సుల సంఖ్య భారీగా పెరగనుండటంతో కొండపైనే ప్రత్యేకంగా డిపో ఏర్పాటు చేయాలని ఆర్టీసీ నిర?యించింది. ఇందుకోసం 5 ఎకరాలు కేటాయించాలని తితిదేని కోరగా.. ప్రాథమికంగా అంగీకారం లభించింది. కొత్తగా నిర్మిస్తున్న శ్రీనివాసం, అచ్యుతం కాంప్లెక్సుల వద్ద కూడా ఛార్జింగ్ సదుపాయాలు కల్పించనున్నారు.

**అప్పటిలోగా డీజిల్ బస్సులు బంద్**

ప్రస్తుతం ఘాట్ రోడ్లలో 323 డీజిల్ బస్సులు నడుస్తున్నాయి. కొండ పైకి కిందికి కలిపి 2,600 ట్రిప్పులు తిరుగుతూ.. సుమారు 1.20 లక్షల మంది భక్తులను గమ్యస్థానాలకు చేరుస్తున్నాయి. రాష్ట్ర ఈవీ పాలసీ ప్రకారం 2029 నాటికి డీజిల్ బస్సులన్నింటినీ తొలగించి, నూటికి నూరు శాతం ఎలక్ట్రిక్ బస్సులు నడపాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. **ప్రస్తుత సేవలు ఇలా..**

మొత్తం ఎలక్ట్రిక్ బస్సులు: 100

కొత్తగా వచ్చే ఈవీ బస్సులు: 350

ఒకరోజులో డీజిల్ బస్సులు

సహా తిరిగే ట్రిప్పులు: 2,600 ప్రయాణికులు: 1,20,000

# పడగొట్టారు.. విడగొట్టారు

పాణ్యం : కేసీ కాల్వ కింద రెండు పంటలు పండించుకునే రైతులకు విస్తరణ పనులు ఆటంకంగా మారాయి.. గుత్తేదారుల స్వార్థం వారికి శాపంగా మారింది. సుమారు రెండు దశాబ్దాలవుతున్నా పనులు పూర్తికాకపోవడం.. సూపర్ ప్యాసేజ్ పనులు చేపట్టకపోవడంతో ఆయకట్టుకు నీరందడం లేదు.

**డీజిల్ ఇంజిన్లతో ఆర్థిక భారం**

పాములపాడు, వెలుగోడు, జూపాడుబంగ్లా మండలాల పరిధిలో సుమారు 15 సూపర్‌ప్యాసేజ్‌లను కూలగొట్టి వదిలేశారు. పంట పొలాలకు నీరందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని.. డీజిల్ ఇంజిన్లతో మళ్లించుకోవాల్సి వస్తోందని రైతులు పేర్కొంటున్నారు. తలముడిపి చెరువుకు సుద్దగుండాల, గన్నేరు వంకల ద్వారా నీరు వచ్చేది. ఎస్సార్బీసీ నిర్మాణ సమయంలో వాటిపై సూపర్‌ప్యాసేజ్‌లు నిర్మించి చెరువుకు నీరందించేవారు. ఎస్సార్బీసీ విస్తరణ సమయంలో రెండు సూపర్‌ప్యాసేజ్‌లను తొలగించారు. నేటికీ పనులు పూర్తి చేయలేదు. నీరు లేకపోవడంతో గత ఐదేళ్లుగా చెరువు ఎండిపోయింది.

**కూల్చేసి.. నిర్లక్ష్యం చేసి**

భూమికి 50 అడుగుల లోతులో ఎస్సార్బీసీ ఉంది. ఈ కాలువ నిర్మాణం నేపథ్యంలో కేసీ కాల్వ కింద ఉన్న పంట పొలాలు రెండు భాగాలుగా విడిపోయాయి. ఎస్సార్బీసీ అవతలివైపునున్న కేసీ ఆయకట్టుకు నీరు



అందేందుకు సూపర్ ప్యాసేజ్‌లు నిర్మించారు. 2006లో విస్తరణ పనుల్లో వీటిని కూల్చేశారు. నేటికీ పనులు మాత్రం చేపట్టలేదు.

**పనులు ముందుకు సాగక..**

ఎస్సార్బీసీ ప్రధాన కాల్వను మొదట్లో 7 వేల క్యూసెక్కుల నీటి సామర్థ్యంతో నిర్మించారు. 2006లో 22 వేల క్యూసెక్కులు ప్రవహించేలా రూ.450 కోట్లతో పనులు చేపట్టారు. బనకచర్ల నుంచి గోరుకల్లు జలాశయం వరకు చేపట్టిన పనులు నేటికీ పూర్తి కాలేదు. 2022లో 34 వేల క్యూసెక్కుల సామర్థ్యంతో రూ.500 కోట్లతో మరోసారి పనులు ప్రారంభించారు. మూడేళ్లలో పూర్తి చేయాలని నిర?యించారు. 25వ ప్యాకేజీలో భాగంగా 1-26 కి.మీ.ల మేర కాల్వ పనులను ఇప్పటివరకు చేపట్టలేదు. 26వ ప్యాకేజీలో భాగంగా చేపట్టిన పనుల్లో ఇప్పటికీ 20 శాతం కూడా పూర్తికాలేదు.

# ఉన్నత విద్యకు ఆసరా

కర్నూలు : డిగ్రీ పూర్తి చేసుకున్న విద్యార్థులు ఉన్నత విద్య అభ్యసించేలా రాష్ట్ర ఉన్నత విద్యామండలి చర్యలు చేపట్టింది. పీజీ స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. గతంలో పీజీలో చేరాలంటే తప్పనిసరిగా పీజీ సెట్ రాయాల్సి వచ్చేది. ఇందులో మంచి ర్యాంకు సాధించిన వారికి కోరుకున్న సీటు లభించేది. ర్యాంకు రాని అభ్యర్థులు నిరాశ చెందేవారు. ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి ఎంఎస్సీ, ఎంఏ, ఎంకాంలో స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియకు చర్యలు చేపట్టారు. ఈ ఏడాది పీజీ సెట్‌కు సంబంధించి సడలింపు ఇవ్వడంతోపాటు అర్హులైన అభ్యర్థులు పీజీ చేసేందుకు అవకాశం లభించింది. ఈ మేరకు ప్రకటన వెలువడింది. జిల్లాలోని వర్సిటీల పరిధిలో సీట్ల వివరాలు.. ఏఏ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. వాటి ఫీజు వివరాలను ఉన్నత విద్యామండలి వెల్లడించింది. పీజీ సెట్లో అర్హత సాధించినా.. సాధించకున్నా దరఖాస్తు చేసుకోవచ్చు. ఉమ్మడి కర్నూలు



జిల్లాలోని వర్సిటీల పరిధిలో మొత్తం 982 సీట్లు అందుబాటులో ఉన్నాయి. రాయలసీమ, డా.అబ్దుల్ హక్ ఉర్దూ విశ్వవిద్యాలయాల పరిధిలో 10వ తేదీ వరకు, క్లస్టర్ వర్సిటీ పరిధిలో 12వ తేదీ వరకు అడ్మిషన్ల ప్రక్రియ జరుగుతుంది. అభ్యర్థులు నేరుగా దరఖాస్తు చేసుకుని పత్రాల పరిశీలన చేసుకోవాల్సి ఉంటుంది.

# వాసాపురం.. భక్తుల దివ్యధామం

ఆళ్లగడ్డ : నంద్యాల జిల్లా రుద్రవరం గ్రామానికి 2 కి.మీ. దూరంలో.. అప్పనపల్లె రహదారి సమీపంలో వందేళ్ల కిందటి వరకు వాసాపురం గ్రామం ఉండేది. వరదల కారణంగా గ్రామస్థులందరూ సమీప గ్రామాల్లోకి చేరుకోవడంతో ఊరంతా ఖాళీ అయ్యింది. గ్రామంలో వందల ఏళ్ల కిందట నిర్మించిన వాసాపురం వేంకటేశ్వరస్వామి గుడి శిథిలా



వస్థకు చేరింది. భక్తులు మాత్రం నిత్యం దర్శనానికి వచ్చేవారు. క్రమక్రమంగా రద్దీ పెరగడంతో కొండమాయపల్లె, రుద్రవరం గ్రామస్థులు కలిసి 2016లో ఆలయ పునరుద్ధరణకు నడుం బిగించారు. నంద్యాల, ఆళ్లగడ్డ పట్టణాలకు చెందిన పలువురు దాతలు ముందుకొచ్చారు. మొత్తం రూ.4.50 కోట్ల విరాళాలు సేకరించి 2020లో ఆలయాన్ని పునర్నిర్మించారు. 2022లో విగ్రహ ప్రతిష' చేశారు. వేంకటేశ్వరస్వామి, ఈశ్వర ఆలయాలతోపాటు నవగ్రహ, నాగ, ఆంజనేయ, వినాయక తదితర విగ్రహాలను ప్రతిషి'ంచారు. ప్రతి శనివారం సుమారు వెయ్యి మంది భక్తులు కాలినడకన సమీప గ్రామాల నుంచి తరలి వస్తుంటారు. ఏటా వార్షికోత్సవం, వైకుంఠ ఏకాదశిని ఘనంగా నిర్వహిస్తారు.

## న్యూ ఇయర్ కి డబుల్ ట్రీట్ ఇవ్వనున్న ఆలియా!

2026.. కొత్త ఏడాది కొత్త సినిమా కథలతో ప్రేక్షకులను మెప్పించడానికి ఎంతో మంది సెలబ్రిటీలు సిద్ధమవుతున్నారు. ముఖ్యంగా రెబల్ స్టార్ ప్రభాస్ ను మొదలుకొని నవీన్ పోలిశెట్టి వరకు.. ఇలా ఎంతోమంది యంగ్ హీరోలు తోపాటు మెగాస్టార్ చిరంజీవి, రవితేజ, వెంకటేష్ లాంటి సీనియర్ హీరోలు కూడా తమ సినిమాలతో ప్రేక్షకులను అలరించబోతున్నారు. ఇకపోతే హీరోలే కాదు హీరోయిన్లు కూడా తమ సినిమాలతో ప్రేక్షకులను మెప్పించడానికి సిద్ధమయ్యారు. ఈ క్రమంలోనే ఒక హీరోయిన్ ఏకంగా డబుల్ ట్రీట్ ఈ న్యూ ఇయర్ కి ఇవ్వడానికి సిద్ధమయ్యింది. ఆమె ఎవరో కాదు అందాలతార ఆలియా భట్. మహేష్ భట్ వారసురాలిగా సినీ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన ఆలియా భట్ తన అందంతోనే కాదు నటనతో కూడా అందరిని అబ్బురపరిచింది. ముఖ్యంగా హీరో రేంజ్ లో యాక్షన్ పర్ఫామెన్స్ తో అదరగొట్టేస్తూ నేషనల్ అవార్డులతో పాటు ఫిలింఫేర్ అవార్డుల కోసం అనేక ప్రశంసలు కూడా అందుకుంది ఆలియా భట్. హిందీలోనే సినిమాలు చేస్తూ అక్కడే పరిమితం



కాకుండా తెలుగులో ఆర్ఆర్ఆర్ వంటి బ్లాక్ బస్టర్ చిత్రాలలో కూడా నటించి, తెలుగు ప్రేక్షకులను మెప్పించింది ఈ ముద్దుగుమ్మ. ఇదిలా ఉండగా కొత్త ఏడాది ఏకంగా రెండు చిత్రాలతో ప్రేక్షకులను అలరించడానికి సిద్ధం అయ్యింది. ఇకపోతే గత ఏడాది జిగ్రా సినిమాతో ప్రేక్షకులను అలరించిన ఆలియా భట్ ఈ ఏడాదిలో కూడా తెరపైకి రావాల్సి ఉన్నా షూటింగ్ ఆలస్యంతో పాటు ఇతర కారణాల వల్ల థియేటర్లలో ఆమె సందడి కనిపించలేదు. అలా ఈ ఏడాది ప్రేక్షకులను పలకరించని తారలలో ఒకరిగా నిలిచింది ఆలియా భట్. ముఖ్యంగా ఈమె నటించిన లవ్ అండ్ వార్, ఆల్ఫా చిత్రాలు ఈ ఏడాది విడుదల కావాల్సి ఉండగా అనుకోని కారణాలవల్ల ఈ రెండు చిత్రాలు కూడా వాయిదా పడ్డాయి. దాంతో ఈ ఏడాది ఆమె తన సినిమాలను రిలీజ్ చేయలేకపోయింది. కానీ వచ్చే ఏడాది ఒకేసారి రెండు సినిమాలతో డబుల్ ట్రీట్ ఇవ్వబోతున్నట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా ఈ ఏడాది ఒక్క సినిమాతో కూడా ప్రేక్షకులను అలరించలేకపోయినా.. వచ్చే ఏడాది ఏకంగా రెండు చిత్రాలతో మెప్పించడానికి సిద్ధం అవుతుంది. మరి ఆ చిత్రాలతో ఆలియా భట్ ఎలాంటి సక్సెస్ ను తన ఖాతాలో వేసుకుంటుందో చూడాలి. సంజయ్ లీల భన్సాలీ దర్శకత్వంలో రణ్ బీర్ కపూర్, అలియా భట్ , విక్కీ కౌశల్ కాంబినేషన్లో రాబోతున్న చిత్రం లవ్ అండ్ వార్. ఈ సినిమా వచ్చే ఏడాది సమ్మర్ స్పెషల్ గా రిలీజ్ కాబోతోంది . ఇక ఈ చిత్రంతోపాటు ప్రముఖ డైరెక్టర్ శివ రావైల్ దర్శకత్వంలో ఆలియా భట్, శార్వరి, బాబీ డియోల్, హృరోషన్ , అనిల్ కపూర్ తదితరులు కీలకపాత్రలో నటిస్తున్న చిత్రం ఆల్ఫా. ఈ సినిమా కూడా వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు రానుంది.

## సక్సెస్ మంత్రం తెలుసిన సిసలైన డైరెక్టర్..!

టాలీవుడ్ లో అసలు ఫ్లాపులు లేని డైరెక్టర్ అంటే అందరు రాజమౌళి పేరు చెబుతారు. ఆయనతో పాటు ఎంటర్టైనింగ్ సినిమాలతో ఓటమి ఎరుగని ధీరుడిగా రాజమౌళి తర్వాత ప్లేస్ సంపాదించాడు డైరెక్టర్ అనిల్ రావిపూడి. పటాస్ నుంచి సంక్రాంతికి వస్తున్నాం సినిమా వరకు అనిల్ రావిపూడి సినిమా అంటే చాలు ఎంటర్టైన్మెంట్ పక్కా అని ఆడియన్స్ ఫిక్స్ అయ్యాడు. పటాస్, సుప్రీం, రాజా ది గ్రేట్ తర్వాత స్టార్ ఛాన్స్ లను కూడా సూపర్ గా హ్యాండిల్ చేసి సరిలేరు నీకెవ్వరు అంటూ మహేష్ తో కలిసి సినిమా హిట్ అందుకున్నాడు అనిల్ రావిపూడి.

**ఎలాంటి సినిమా ఇస్తే..** ఆయన సినిమాల్లో కామెడీ ఉంటుంది.. అది ఆడియన్స్ ని సూపర్ గా ఎంటర్టైన్ చేస్తుంది. సక్సెస్ మంత్రం తెలిసిన డైరెక్టర్ అనిల్ రావిపూడి. ఎందుకంటే ఆడియన్స్ కి ఎలాంటి



సినిమా ఇస్తే వారు హిట్ చేస్తారు అన్నది బాగా నేర్చుకున్నాడు. ఎంటర్టైన్మెంట్ సినిమాలతో ప్రతిసారి మెప్పించడం చాలామంది ఫెయిల్ అవుతుంటారు. కానీ అనిల్ రావిపూడి మాత్రం హిట్లు మీద హిట్లు కొడుతూనే ఉంటాడు. అనిల్ రావిపూడి సినిమాల్లో ఆడియన్స్ కి బాగా నచ్చే మరో అంశం సినిమా ప్రమోషన్స్. ఒక సినిమాను ఎలా ప్రమోట్ చేస్తే ఆడియన్స్ కు రీచ్ అవుతుందో అతనికి బాగా తెలుసు. ప్రమోషన్స్ లో హెడ్ మాస్టర్ టైప్ యాక్టివిటీస్ చేస్తూ ఆడియన్స్ ని సినిమాకు ఎంగేజ్ చేస్తుంటాడు అనిల్ రావిపూడి. ఇక ఎంచుకున్న కథకు తగినట్టుగా మిగతా మేళవింపులు అన్నీ ఉన్నా కూడా తన బలమైన కామెడీ మీద గట్టి ఎఫర్ట్ తో వస్తాడు. సో అక్కడ ఆడియన్స్ ఫిదా అయిపోతారు. తనపై వస్తున్న విమర్శలను కూడా పాజిటివ్ గా చేసుకునేలా పనిచేస్తూ ఉంటాడు అనిల్ రావిపూడి. అఫ్కోర్స్ ఆయన చేసే కామెడీ కొంతమందికి ఎక్కకపోతే చేసే ప్రతి విమర్శలు కూడా ఆయన రిసీవ్ చేసుకుని ముందుకు వెళ్తున్నారు.

**మెగాస్టార్ చిరంజీవితో మన శంకర వరప్రసాద్..** అందుకే అనిల్ రావిపూడి సూపర్ హిట్ డైరెక్టర్ గా క్రేజ్ తెచ్చుకున్నాడు. ప్రస్తుతం అనిల్ రావిపూడి మెగాస్టార్ చిరంజీవితో మన శంకర వరప్రసాద్ సినిమా చేస్తున్నాడు. ఈ సినిమాతో మరో హిట్ కొట్టాలని ఫిక్స్ అయ్యా డు. సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో సంక్రాంతికి బ్లాక్ బస్టర్ అందు కున్న అనిల్ రావిపూడి నెక్స్ట్ సంక్రాంతికి కూడా మరో సెన్సేషనల్ హిట్ కోసం ప్లాన్ చేశాడు. సో సక్సెస్ ఫుల్ డైరెక్టర్ గా ఆడియన్స్ కు ఫుల్ ఆన్ ఎంటర్టైన్మెంట్ అందిస్తున్న అనిల్ రావిపూడి బర్త్ డే ఈరోజు. ఆయన ఇలాంటి పుట్టినరోజులు ఎన్నో జరుపుకోవాలని.. ఇంకా ఎన్నో కామెడీ ఎంటర్టైనర్స్ తో అలరించాలని కోరుకుంటూ హ్యాపీ బర్త్ డే డైరెక్టర్ అనిల్ రావిపూడి.




## సంక్రాంతి రేస్..గ్లామర్ వేవ్‌తో ఆ ముగ్గురే టాప్!



ప్రతి సంక్రాంతికి తెలుగు సినిమాలు భారీ స్థాయిలో పోటీపడుతుండటం అందరికి తెలిసిందే. ఈ సీజన్‌లో సినిమాలు రిలీజ్ చేయాలని, భారీ క్రౌడ్‌ని క్యాష్ చేసుకుని బాక్సాఫీస్ వద్ద కలెక్షన్‌లు కొల్లగొట్టాలని స్టార్ హీరోల నుంచి స్టార్ డైరెక్టర్ల వరకు ఎదురు చూస్తుంటారు. సంక్రాంతి బరిలో తమ సినిమాలతో నిలుస్తుంటారు. అదే తరహాలో 2026 సంక్రాంతికి పలు క్రేజీ సినిమాలు బాక్సాఫీస్ వద్ద పోటీపడుతున్నాయి. పాన్ ఇండియా సినిమాలతో పాటు మినిమమ్ బడ్జెట్ చిత్రాల వరకు విడుదలవుతున్నాయి. ఈ సినిమాలతో స్టార్ హీరోలు, డైరెక్టర్లే కాకుండా స్టార్ హీరోయిన్‌లు కూడా తమ సినిమాలతో బరిలోకి దిగుతూ ఈ సంక్రాంతికి గ్లామర్‌ని యాడ్ చేస్తున్నారు. నయనతార నుంచి కేథరిన్ వరకు ఈ సంక్రాంతికి పోటీపడుతున్నారు. ఈ పోటీలో ముగ్గురు క్రేజీ భామలు మాత్రం పై చేయి సాధిస్తున్నట్టుగా తెలుస్తోంది. సంక్రాంతి సమరంలో ముందుగా థియేటర్లలోకి వస్తున్న మూవీ పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న భారీ కామెడీ హారర్ యాక్షన్ థ్రిల్లర్ ది రాజాసాబ్. జనవరి 9నే ఐదు భాషల్లో ప్రపంచ వ్యాప్తంగా భారీ స్థాయిలో రిలీజ్ అవుతోంది. ఇందులో ముగ్గురు క్రేజీ భామలు మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ హీరోయిన్‌లుగా నటిస్తున్నారు. మారుతి డైరెక్ట్ చేసిన ఈ మూవీ బిజినెస్ పరంగా మంచి క్రేజ్‌ని సొంతం చేసుకుని ప్రేక్షకుల్లో హైప్‌ని క్రియేట్ చేసింది. రీసెంట్‌గా విడుదలైన ఈ మూవీ ట్రైలర్ సినిమాపై కొంత మందిలో ఉన్న అనుమానాల్ని పటాపంచలు చేసింది. ఇందులో గ్లామర్ డోస్‌తో కనిపించి మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ అటెన్షన్‌ని గ్రాబ్ చేయడంలో టాప్‌లో నిలిచారు. ఇదే రేసులో మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న మన శంకరవరప్రసాద్‌గారు మూవీతో నయనతార, కేథరిన్ బరిలోకి దిగుతున్నారు. అయితే ఇందులో గ్లామర్ డోస్ తగ్గించడంతో ఈ ఇద్దరు ప్రేక్షకుల అటెన్షన్‌ని మాత్రం గ్రాబ్ చేయలేకపోయారు. ఇక మాస్ మహారాజా రవితేజ హీరోగా కిషోర్ తిరుమల రూపొందిస్తున్న భర్త మహాశయులకు విజ్ఞప్తి కూడా రిలీజ్ అవుతోంది. ఈ మూవీలో రవితేజకు జోడీగా అషిక రంగనాథ్, డింపుల్ హయాతీ నటించారు. ఈ ఇద్దరిలో అషిక రంగనాథ్ బికినీ ధరించి హీట్ పుట్టించే ప్రయత్నం చేసినా ప్రేక్షకుల దృష్టిని మాత్రం ఆకర్షించలేకపోయింది. శర్వానంద్ సైలెంట్‌గా నారీ నారీ నడుమ మురారితో బరిలోకి దిగుతున్నాడు. ఇందులో సాక్షీ వైద్య, సంయుక్త హీరోయిన్‌లుగా నటించారు. సినిమాకు సంబంధించి ఇప్పటి వరకు ఎలాంటి హడావిడీ లేకపోవడంతో వీరి ప్రభావం కూడా అంతంత మాత్రంగానే ఉంది. ఇక యంగ్ హీరో నవీన్ పొలిశెట్టి నటించిన అనగనగ ఒక రాజు కూడా ఈ సంక్రాంతికే రిలీజ్ అవుతోంది. ఇందులో నవీన్‌కు జోడీగా మీనాక్షీ చౌదరి నటించింది. సినిమా అంతా ఫ్యామిలీ ఎంటర్ టైనర్ కావడంతో మీనాక్షికి గ్లామర్‌కు స్పేస్ లభించలేదు. దీంతో వీరిందరినీ పక్కకు నెట్టి గ్లామర్ డోస్‌తో ది రాజా సాబ్ భామలు మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ సంక్రాంతి సమరంలో పైచేయి సాధించి టాప్‌లో నిలిచారు. తమదైన మార్కు గ్లామర్‌తో ఈ సంక్రతికి ప్రేక్షకులని ఈ భామలు మెస్మరైజ్ చేయబోతున్నారు.

## 2025లో పాన్ ఇండియా క్రేజ్.. 2026లో ఏం చేస్తారో?



2025కి మరో నాలుగు రోజుల్లో గుడ్ బై చెప్పి 2026కి వెల్కమ్ చెప్పేందుకు అంతా సిద్ధమవుతున్న విషయం తెలిసిందే. ఈ ఏడాదిలో ఎన్నో సినిమాలు ప్రేక్షకుల ముందుకు వచ్చాయి. ఆ చిత్రాల రిజల్ట్ పక్కన పెడితే.. ముగ్గురు హీరోయిన్స్ మాత్రం మంచి గుర్తింపు సంపాదించుకున్నారు. పాన్ ఇండియా లెవెల్ లో క్రేజ్ సొంతం చేసుకున్నారు. ఆ ముగ్గురు ఎవరు.. ఏ ఏ సినిమాలతో గుర్తింపు దక్కించుకున్నారో తెలుసుకుందాం. వారిలో ముందుగా చెప్పుకోవాల్సింది యంగ్ బ్యూటీ రితికా నాయక్ గురించే.. టాలీవుడ్ యువ కథానాయకుడు తేజ సజ్జా లీడ్ రోల్ లో నటించిన మిరాయ్ మూవీతో ఆమె పేరు ఒక్కసారిగా మారుమోగిందని చెప్పడంలో డౌట్ అక్కర్లేదు. సెప్టెంబర్ లో మిరాయ్ రిలీజ్ అవ్వగా.. తన స్క్రీన్ ప్రెజెన్స్, యాక్టింగ్ తో అందరినీ అలరించింది రితిక. పాన్ ఇండియా లెవెల్ ఆడియన్స్ ను మిరాయ్ లో తన నేచురల్ ఛార్మ్ తో మెప్పించిన ఆమె.. ఓ రేంజ్ లో ఫాలోయింగ్ పెంచుకుందని చెప్పాలి. ఇప్పుడు డ్యూయెట్ మూవీలో నటిస్తున్న రితికా.. వరుణ్ తేజ్ ఇండో- కొరియన్ హారర్-కామెడీ ప్రాజెక్ట్ లో యాక్ట్ చేస్తున్నారు. మరిన్ని సినిమాలను లైన్ లో పెడుతున్నారని వార్తలు వస్తున్నాయి. ఇక రితికా నాయక్ తర్వాత ఈ ఏడాదిలో అంతటి క్రేజ్ సంపాదించుకున్న మరో బ్యూటీ రుక్మిణీ వసంత్. బ్లాక్ బస్టర్ హిట్ మూవీ కాంతార చాప్టర్ 1తో భారీ గుర్తింపు ఆమె సొంతమైంది. కన్నడ స్టార్ హీరో రిషబ్ శెట్టి లీడ్ రోల్ లో రూపొందిన ఆ చిత్రంలో రుక్మిణి తన యాక్టింగ్ తో అందరినీ కట్టిపడేశారని చెప్పడంలో డౌట్ అక్కర్లేదు. సినిమాలో రోల్ కు రుక్మిణి సరైన న్యాయం చేశారు. అటు అందం.. ఇటు అభినయంతో మెప్పించారు. మంచి స్కోప్ ఉన్న పాత్ర దక్కించుకున్న ఆమె.. సినిమాకు మెయిన్ పిల్లర్ గా మెప్పించారు. దీంతో నేషనల్ వైడ్ గా ఫ్యాన్ బేస్ పెరిగిపోయింది. ఇప్పుడు ఆమె తారక్- నీల్ మూవీతోపాటు యష్ టాక్సిక్ లో యాక్ట్ చేస్తూ బిజీగా గడుపుతున్నారు. రుక్మిణి, రితికతోపాటు యంగ్ బ్యూటీ సారా అర్జున్.. ఇప్పుడు ధురంధర్ మూవీతో థియేటర్స్ లో సందడి చేస్తున్నారు. బాలీవుడ్ హీరో రణవీర్ సింగ్ లీడ్ రోల్ లో నటించిన ఆ సినిమాలో సారా.. తన యాక్టింగ్ తో అందరికీ షాక్ ఇచ్చారని చెప్పాలి. ఎందుకంటే.. చిన్న వయసులోనే తన టాలెంట్ తో పాటు స్క్రీన్ ప్రెజెన్స్ తో ఆకట్టుకున్నారు. ముఖ్యంగా సినిమాలో తన రోల్ లో ఎమోషన్స్ పండించిన విధానం అద్భుతమనే చెప్పాలి. దీంతో బాక్సాఫీస్ వద్ద ఎన్నో రికార్డులు క్రియేట్ చేసిన ధురంధర్ తో సారాకు దేశవ్యాప్తంగా ఓ రేంజ్ లో క్రేజ్ లభించింది. ప్రస్తుతం సారాకు మంచి ఆఫర్స్ వస్తున్నాయని ఇండస్ట్రీలో టాక్. మొత్తానికి రితిక, రుక్మిణి, సారా.. 2025లో నేషనల్ వైడ్ గా స్టార్ డమ్ సంపాదించుకున్నారు. మరి 2026లో కొత్త సినిమాలతో ఏ స్థాయిలో ప్రేక్షకులను ఆకట్టుకుంటారో వేచి చూడాలి.

## అస్సాం బ్యూటీకి అలా కలిసొచ్చింది!

డ్రాగన్ విజయంతో అస్సాం బ్యూటీ కయాదు లోహర్ తెలుగింట ఎంత ఫేమస్ అయిందో చెప్పాల్సిన పనిలేదు. తమిళ అనువాద చిత్రంతోనే తెలుగు యువత మనసు దోచుకుంది. అందం, అభినయమే అంతకు మించిన క్వాలిటీ కయాదులో ఉన్నాదనిపించింది. దీంతో సోషల్ మీడియాలో ఫాలోయింగ్ రెట్టింపు అయింది. ఇంత ఫేమస్ అయిన బ్యూటీకి తెలుగులో బిజీ అవ్వడం ఖాయమన్నారు. టైర్ 2, టైర్ 3 హీరోలకు పర్ఫెక్ట్ జోడీగా సెట్ అవుతుందని విశ్లేషణలు తెరపైకి వచ్చాయి. అక్కడ నుంచి స్టార్ లీగ్ లో చేరడానికి పెద్దగా సమయం పట్టదన్నారు. మరి ప్రయాణం టాలీవుడ్ లో ఆ రకంగా సాగుతుందా? అంటే ఎంత మాత్రం కాదనే చెప్పాలి. డ్రాగన్ తర్వాతతర్వాత కయాదు తెలుగులో కమిట్ అయింది రెండు సినిమాలే. ఫంకీ, ది ప్యారడైజ్ చిత్రాలకు ఒకే చెప్పింది. ఆ తర్వాత మరే కొత్తే సినిమాకు సైన్ చేయలేదు. అయితే టాలీవుడ్ ఇమేజ్ తో తమిళ, మలయాళ భాషల్లో మాత్రం ఫుల్ బిజీ అయింది. తమిళ్ లో నాలుగు సినిమాలు చేస్తుండగా, మలయాళంలో మూడు సినిమాలు చేస్తోంది. అవన్నీ ఆన్ సెట్స్ లో ఉన్నాయి. వచ్చే ఏడాది రిలీజ్ కానున్న ప్రాజెక్ట్



లు. ఈ నేపథ్యంలో 2026 లో యువ భామల్లో కయాదు హవా ఆ రెండు పరిశ్రమల్లో హైలైట్ అవుతుంది. ఇవి గాక మాలీవుడ్ లో రెండు..తమిళ్ లో మరో మూడు సినిమాలకు కూడా సైన్ చేసిందన్నది తాజా సమాచారం. తెలుగులో నటిస్తోన్న ఫంకీ, ది ప్యారడైజ్ కూడా వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకొస్తున్న చిత్రాలే. వాటిలో ప్యారడైజ్ పాన్ ఇండియాలో రిలీజ్ అవుతుంది. ఈ సినిమాపై భారీ అంచనాలున్నాయి. ఈ సినిమా సక్సెస్ అయితే కయాదు టాలీవుడ్ కెరీర్ కొత్త టర్నింగ్ తీసుకునే అవకాశాలున్నాయి. ఓ స్ట్రెయిట్ తెలుగు సినిమాతో సక్సస్ అందుకుంటే వచ్చే గుర్తింపు యూనిక్ గా ఉంటుంది. రీజనల్ సినిమాల్లో అవకాశాలకు ఆ విజయం దారి తీస్తుంది. సక్సెస్ సెంటిమెంట్ కూడా వర్కౌట్ అవుతుంది. అయితే ఈ బ్యూటీ తొలుత లాంచ్ అయింది మాత్రం కన్నడ పరిశ్రమలో. మెగిలిపెట్టే అనే చిత్రంతో ఎంట్రీ ఇచ్చింది. కానీ ఆ తర్వాత అక్కడ కొనసాగలేదు. మలయాళంలో ఎంట్రీ ఇచ్చిన తర్వాత అక్కడ చిత్రాలకే ప్రాధాతన్యత ఇచ్చింది. అటుపై ఏడాది అనంతరం అల్లూరి అనే ఓ తెలుగు సినిమాలో కూడా నటించింది. కానీ ఆచిత్రం గురించి పెద్దగా ఎవరికీ తెలియ కపోడంతో? కయాదు నటించిందా? అన్నది ఇప్పటికీ చాలా మందికి తెలియదు.

## డాల్ఫిన్ల స్వర్గంలో పాలకోవా బ్యూటీ

పాలక్ తివారీ పరిచయం అవసరం లేదు. ఆదిపురుష్ ఫేం సైఫ్ అలీఖాన్ కుమారుడు ఇబ్రహీం అలీఖాన్ తో డేటింగ్ చేస్తోందన్న పుకార్ల నడుమ పాలక్ దేశమంతా ఫేమస్. బుల్లితెర నటి శ్వేతా తివారీ నటవారసురాలిగాను సుపరిచితురాలు. పాలక్ తన బోయ్ ఫ్రెండ్ ఇబ్రహీంతో సెలబ్రేషన్స్ కారణంగా విమర్శల్ని కూడా ఎదుర్కొంటోంది. ఈ బ్యూటీ డేటింగుల కంటే, సినిమా కెరీర్ పై దృష్టి సారించాలని సూచిస్తున్నారు. అందాల పాలక్ కి సామాజిక మాధ్యమాల్లో భారీ ఫాలోయింగ్ ఉంది. ఇన్స్టాలో 48 లక్షల (4.8 మిలియన్ల)కు పైగా అనుచరులున్నారు. పాలక్ వరుస ఫోటోషూట్లు హీటెక్కిస్తూనే ఉన్నాయి. ఇంతకుముందు మారిషస్ బీచ్ లలో చిలౌట్ చేసిన ఫోటోషూట్లను షేర్ చేసిన పాలక్ ఇప్పుడు ఆస్ట్రేలియాలోని ఎగ్జోటిక్ లొకేషన్లలో ఎంజాయ్ చేస్తున్న కొన్ని అందమైన ఫోటోగ్రాఫ్స్ ని షేర్ చేసింది. ఆస్ట్రేలియాలో ఫేమస్ రిసార్ట్స్ ప్రత్యేకత గురించి చెప్పింది పాలక్. అక్కడ సముద్రపు అంచులో డాల్ఫిన్స్ నేరుగా



మనుషులతో స్నేహం చేస్తాయని కూడా వెల్లడించింది. అంతేకాదు.. పాలక్ ఒక చిన్న చేపపిల్లను డాల్ఫిన్ కి ప్రేమగా తినిపించింది. అది ఆ బుల్లి చేపపిల్లను గొంతులో వేసుకుని నీళ్లలోనే పాలక్ మోకాలిపై ఒక ముద్దు కూడా ఇచ్చి వెళ్లింది. ప్రస్తుతం ఈ ఎగ్జోటిక్ లొకేషన్ నుంచి ఫోటోషూట్ ని పాలక్ నేరుగా తన ఇన్ స్టాలో షేర్ చేసింది. ఇదే ఫోటోషూట్ లో బీచ్ ఇసుకలోకి ఏటవాలుగా ఒరిగిపోయిన ఒక భారీ కొబ్బరి చెట్టు వద్ద పాలక్ బికినీ ఫోటోషూట్ గుబులు రేపుతోంది. ఇందులో ఫ్లోరల్ మోనోకినిలో పాలక్ అందచందాలు హీట్ పుట్టిస్తున్నాయి. కెరీర్ మ్యాటర్ కి వస్తే... పాలక్ రోమియో S3` అనే చిత్రంతో అభిమానుల ముందుకు వచ్చింది. అంతకుముందు సల్మాన్ భాయ్ కిసీ కా భాయ్ కిసీకి జాన్ చిత్రంలో నటించింది. భూత్నీ అనే హారర్ చిత్రంలోను పాలక్ నటించింది. కానీ ఇవేవీ ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేదు. ఇటీవల పాలక్ యువహీరో ఇబ్రహీం అలీఖాన్ తో డేటింగ్ చేయడంపై తన తండ్రి (శ్వేతా తివారీ మాజీ భర్త) స్పందిస్తూ, డేటింగ్ కంటే నటనపై దృష్టి సారించాలని సూచించారు.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536